# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - బుధవారం 12 ఆగస్టు 2026 | సంపుటి: 10 | సంచిక: 218 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


ఐరాస ఆవరణలో మన నెమళ్లు



2

2028 మార్చి దాకా ఈవీ సబ్సిడీ




2



## ఓల్డ్ సిటీ మెట్రో పనుల్లో వేగం పెంచండి

### వీలైనంత త్వరగా టెండర్ ప్రక్రియ ప్రారంభించాలి

రద్దీకి అనుగుణంగా కొత్త కోచ్‌లు కొనుగోలు చేయాలె

డిసెంబర్‌లో జరుగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌పై సీఎం సమీక్ష

**హైదరాబాద్, ఆగస్టు 11 (మనం బ్యూరో):** హైదరాబాద్ మెట్రో రేల్ రెండో దశలో భాగంగా పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ మెట్రో రేల్ లిమిటెడ్ ఉన్నతాధికారులతో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కి.మీ.ల రోడ్డు విస్తరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కారిడార్‌లో మెట్రో పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియను వెంటనే మొదలు పెట్టాలనీ, మెట్రో విస్తరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ప్రయాణికుల రద్దీకి తగినట్లుగా మెట్రో రేల్‌కు అదనపు బోగీలు జత చేయాలని సూచించారు. ఇందుకు సంబంధించి అదనపు కోచ్‌లను కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మెట్రో ఫేజ్‌లో భాగంగా కారిడార్ కోసం ప్రస్తుత టెక్నాలజీపై ఢిల్లీ మెట్రోను సంప్రదించి అవసరమైన సలహాలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**డిసెంబర్‌లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్**

డిసెంబర్‌లో నిర్వహించ తలపెట్టిన ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు సంబంధించి ...మిగతా 2లో

పంద్రాగస్టున జెండా పండుగను

## చేసుకుందాం



హర్ ఘర్ తిరంగా ప్రచారంలో పాల్గొనాలె

హర్ ఘర్ తిరంగా, ఘర్ ఘర్ తిరంగా, హర్ మన్ తిరంగా అని అభివర్ణించిన ప్రధాని మోడీ

**ఢిల్లీ, ఆగస్టు 11:** భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో ఇన్ స్టాగ్రామ్ వేదికగా ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం ఓ వీడియో పోస్టు చేశారు. ఆగస్టు 15న జెండా పండుగను ప్రజలంతా సగర్వంగా నిర్వహించుకోవాలని ప్రధాని పిలుపునిచ్చారు. దేశ ప్రజలంతా 'హర్ ఘర్ తిరంగా' ప్రచారంలో చురుకుగా పాల్గొనాలని కోరారు. స్వాతంత్ర్య సమరయోధులకు ఘనంగా నివాళులర్పించాలని మోదీ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 'ఆగస్టు 15ని గర్వంగా జరుపుకోండి, స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులు అర్పించండి, వికసిత్ భారత్ కోసం ప్రతిజ్ఞ చేయండి. హర్ ఘర్ తిరంగా, ఘర్ ఘర్ తిరంగా, హర్ మన్ తిరంగా' అని ఆయన పేర్కొన్నారు. అలాగే, ప్రతి ఇంటిలోనూ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని మోడీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని ...మిగతా 2లో

## కలిసి పని చేద్దాం.. రండి

### మూన్ బేస్ మిషన్‌లో భాగం కావాలంటూ ఇస్రోకు నాసా ఆహ్వానం




**వాషింగ్టన్, ఆగస్టు 11:** అంతరిక్ష పరిశోధనల్లో దూసుకెళ్తున్న ఇస్రో .. చంద్రుడిపై కీలక పరిశోధనలు చేస్తున్న సంగతి విషయం తెలిసిందే. అమెరికా కూడా చంద్రుడి దక్షిణ ధ్రువంపై 2032 నాటికి శాశ్వత మానవ స్థావరం ఏర్పాటు చేసేందుకు తీవ్రంగా కృషి చేస్తోంది. ఈ క్రమంలో ఇటీవల తలపెట్టిన మూన్ బేస్ మిషన్‌లో భాగం కావాలని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థను నాసా ఆహ్వానించింది. ఇండియా-యూఎస్ ...మిగతా 2లో

**టెసరాట్ సంస్థకు**

## భూ కేటాయింపులపై కేటీఆర్ ఆరోపణలు అవాస్తవం

### ఆ సంస్థతో సీఎం సోదరులకు సంబంధం లేదు • మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్, ఆగస్టు 11, (మనం బ్యూరో):** టెసరాట్ సంస్థకు భూ కేటాయింపులపై కేటీఆర్ చేసిన ఆరోపణలు అవాస్తవమని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఆ సంస్థతో సీఎం సోదరులకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. మంగళవారం మంత్రి మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో ఎకరం రూ.90 లక్షలకు ఇస్తే మేం కోటిన్నరకు ఇచ్చాం. బోర్డు డిసైడ్ చేసిన దాని కంటే ఒక్క రూపాయి కూడా తక్కువకు ఇవ్వలేదు. 32 మంది దరఖాస్తు చేసుకుంటే అందులో ఒకటి టెసరాట్ కంపెనీ, ఆ కంపెనీకి నిబంధనల ప్రకారమే కేటాయింపులు జరిగాయని పేర్కొన్నారు. సోషల్ మీడియా పోస్టుల ఆధారంగా ...మిగతా 2లో

## నా ఓటు తీసేసిండ్రు

తన ఓటు పోయిందంటున్న ప్రకాశ్ రాజ్



2

## వెండితెరపై సర్దార్ సర్వాయి పాపన్న

బహుజన రాజ్య స్థాపకుడి పోరాటం అమోఘం

చిత్రం ట్రైలర్‌ను ఆవిష్కరించిన మంత్రి పొన్నం ప్రభాకర్




**హైదరాబాద్, ఆగస్టు 11 (మనం న్యూస్):** సామాజిక సమానత్వం, స్వయం పాలనే లక్ష్యంగా అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవిత చరిత్రను భావితరాలకు చాటిచెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతిని పురస్కరించుకుని.. ఈ నెల 21న విడుదల కానున్న 'సర్దార్ సర్వాయి పాపన్న' చలనచిత్ర ట్రైలర్‌ను మంగళవారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాపన్న జీవిత చరిత్రకు సంబంధించిన పుస్తకంతో పాటు సినిమా పోస్టర్‌ను కూడా మంత్రి విడుదల చేశారు.అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. మన ప్రాంతాన్ని మనమే పరిపాలించుకోవాలనే ఉన్నతమైన ఆలోచనతో గోల్కొండను వేదికగా చేసుకుని పాపన్న బహుజన రాజ్య స్థాపనకు ...మిగతా 2లో

## 3.43 కోట్ల మందికి స్మార్ట్ ఆహార భద్రత



### రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో ఏకకాలంలో అమలు

సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీకి శ్రీకారం

ఏర్పాట్లలో ఎక్కడా లోపం ఉండొద్దు

పౌర సరఫరాలో సమీక్షపై మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్, ఆగస్టు 11 (మనం బ్యూరో):** రాష్ట్రంలో ఆహార భద్రతకు ఇక స్మార్ట్ రూపం రానుంది. రాష్ట్రవ్యాప్తంగా 3.43 కోట్ల మంది లబ్దిదారులకు సంబంధించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి పంద్రాగస్టున సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టనున్నారు. సంగారెడ్డిలో జరిగే రాష్ట్రస్థాయి కార్యక్రమంలో సీఎం ఈ ప్రక్రియను లాంఛనంగా ప్రారంభించనుండగా, అదే రోజు రాష్ట్రంలోని 33 జిల్లా కేంద్రాల్లో ఏకకాలంలో పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈమేరకు పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మంగళవారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ఏర్పాట్లపై ఆ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ...మిగతా 2లో

3

### సినిమా పిచ్చోళ్లే జనసేనలోకి పోతున్నరు?

బీజేపీ నేత రాంచందర్ రావు కీలక వ్యాఖ్యలు

## నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ బిల్లు ఆమోదం

**ఢిల్లీ, ఆగస్టు 11:** కేరళ రాష్ట్రం పేరును 'కేరళం'గా మార్చేందుకు తీసుకొచ్చిన చట్ట సవరణ బిల్లుకు లోక్ సభ ఆమోదం తెలిపింది. దీంతోపాటు నేషనల్ కోఆపరేటివ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చట్టసవరణ బిల్లుకు కూడా సభ ఆమోదం లభించింది. ఢిల్లీలో నిరసనకారులపై పోలీసుల దాడి గురించి హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్కు వచ్చి సమాధానం ఇవ్వాలని సభలో విపక్ష సభ్యులు నినాదాలు చేశారు. ఈ నినాదాల మధ్యే ఈ రెండు బిల్లులను కేంద్రం ప్రవేశపెట్టగా.. ఎటువంటి చర్చ లేకుండానే మూజువాణి ఓటుతో అవి ఆమోదం పొందాయి.



3

### బోనమెత్తిన కలెక్టరమ్మ

హైదరాబాద్ కలెక్టరేట్‌లో బోనాల ఉత్సవం సందర్భంగా అమ్మవారికి బోనం సమర్పించిన జిల్లా మేజిస్ట్రేట్ డా. ప్రియాంక అలా

## నిషేధిత భూములపై ఎలాంటి ఆందోళన వద్దు

చట్టబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తాం

ఈనెల 14లోగా డాక్యుమెంట్లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి: మంత్రి పొంగులేటి



**హైదరాబాద్, ఆగస్టు 11, (మనం బ్యూరో):** నిషేధిత 22ఎ జాబితాలో ఉన్న భూములకు సంబంధించి ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని మంత్రి పొంగులేటి సూచించారు. చట్టబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని వెల్లడించారు. ఈమేరకు మంగళవారం సచివాలయంలో 22ఎ అంశంపై హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి కలెక్టర్లు, జిల్లా సబ్ రిజిస్ట్రార్లతో మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కొత్తగా ఎలాంటి భూములను తమ ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చలేదనీ, గత ప్రభుత్వం నుంచి కొనసాగుతున్న చట్టపరమైన సాంకేతిక చిక్కులను పరిష్కరించి బాధితులకు ఊరట కలిగిస్తామని స్పష్టం చేశారు. సమస్య వచ్చినప్పుడు ...మిగతా 2లో

## నీట్ రద్దు చేయాలి

### తమిళనాడు అసెంబ్లీ తీర్మానం

**చెన్నై, ఆగస్టు 11:** వైద్య కోర్సుల్లో ప్రవేశాలు పొందడానికి జాతీయ స్థాయిలో నిర్వహించే నీట్ ప్రవేశ పరీక్షను తొలినుంచీ తమిళనాడు వ్యతిరేకిస్తోంది. ఈ నేపథ్యంలో సీఎం విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వం రాష్ట్ర అసెంబ్లీలో నీట్ కు వ్యతిరేకంగా తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. ఆరోగ్యశాఖ మంత్రి కె.అరుణ్‌రాజ్ ...మిగతా 2లో

## గడువులోగా పూర్తి కావాల్సిందే

- ప్రజలకు మాట ఇచ్చినం.. పనుల్లో ఆలస్యాన్ని సహించేది లేదు
- ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌పై సమీక్షలో మంత్రి కోమటిరెడ్డి



2

### పార్లమెంట్ ఆవరణలో అధికార, ప్రతిపక్షాల పోటాపోటీ నిరసనలు

9




### ట్రంప్ పదవీకాలం పూర్తయ్యేదాకా చర్చల ప్రసక్తే లేదు: ఇరాన్

**దుబాయ్, ఆగస్టు 11:** డొనాల్డ్ ట్రంప్ పదవీకాలం పూర్తయ్యేదాకా అమెరికాతో చర్చలు జరిపే ప్రసక్తే లేదని ఇరాన్ తేల్చి చెప్పింది. మరోవైపు అమెరికా తమ షరతులు అంగీకరించే వరకూ ...మిగతా 2లో

## ట్రంప్ లాపతా జర్నీ

**వాసింగ్టన్, ఆగస్టు 11:** పశ్చిమాసియా ఘర్షణలు, బెదిరింపుల నేపథ్యంలో అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ నేతలు శత్రువులకు చిక్కకుండా కొత్తమార్గాల్లో రాకపోకలు సాగిస్తున్నారు. అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ శత్రువులకు దొరక్కుండా ఒక చిన్న విమానంలో ప్రయాణించారట. పటిష్ట భద్రతకు నెలవైన ఎయిర్ఫోర్స్ వన్ ను వదిలి.. యూఎస్ మిలిటరీకి చెందిన చిన్న విమానాన్ని వాడారు. ఇటీవల తుర్కియేలో జరిగిన నాటో సదస్సు అనంతరం ఆ దేశాన్ని వీడేటప్పుడు ఈ రహస్య ఫ్లైట్ను ఎంచుకున్నారని అమెరికా మీడియా కథనం వెల్లడించింది. జులైలో తుర్కియే రాజధాని అంకారాలో నాటో సదస్సు జరిగింది. ఖతార్ కానుకగా ఇచ్చిన బోయింగ్ 747-8లో అంకారాకు ట్రంప్ వెళ్లారు. కానీ వచ్చేటప్పుడు మాత్రం దానిని



వాడలేదు. ఎయిర్ఫోర్స్ వన్ ఎక్కారు. ప్రపంచం మొత్తానికి అదే చూపించారు. కానీ అక్కడే సీన్ మారింది.. తర్వాత విమానం బెల్లీ నుంచి బయటకు తెచ్చి.. అక్కడే సిద్ధంగా ...మిగతా 2లో

## పొలం గట్టున బస

నాటుకోడి పులుసుతో విందు

తెలంగాణ టూరిజం శాఖ సరికొత్త ప్లాన్.. • పల్లెటూరి పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు హోమ్ స్టే విధానం

3

### ఇకనుంచి మండల స్థాయిలో ప్రజావాణి

మండల నోడల్ అధికారు(ఎంపీడీవో)లకు రేపు ప్రజాభవన్‌లో శిక్షణ

3

365 రోజుల్లో 8,000 క్వాలిఫైడ్ వాచ్ అవర్స్ లేదా 90 రోజుల్లో 20 మిలియన్ల షార్ట్స్ వీక్షణలు

• యూట్యూబర్లకు మానిటైజేషన్ నిబంధనల్లో మార్పు

9

# గడువులోగా పూర్తి కావాల్సిందే

- ప్రజలకు మాట ఇచ్చినం.. పనుల్లో ఆలస్యాన్ని సహించేది లేదు
- ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌పై సమీక్షలో మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 11, మనం బ్యూరో: రాష్ట్ర ప్రభుత్వం విధించిన నిర్ణీత గడువు ఈ ఏడాది అక్టోబర్ 31లోగా ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులు పూర్తి కావాల్సిందేనని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. నిర్లక్ష్యాన్ని, పనుల్లో ఆలస్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని తేల్చి చెప్పారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌పై మంత్రి కోమటిరెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మాట ఇచ్చాం...చేసి తీరాల్సిందేనని వెల్లడించారు. ఏళ్ల తరబడి అవస్థ పడుతున్న ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేద్దాం మనసు పెట్టి పని చేయండి అని అధికారులకు సూచించారు. మ్యాన్ పవర్ పెంచి మూడు షిఫ్టుల్లో పనులు చేయాలనీ, రాత్రి వేళల్లో 11 నుంచి ఉదయం 6 గంటల వరకు నిరంతరం పనులు జరగాలని పేర్కొన్నారు. కారిడార్ కింద బిటి రడ్డు పనులు ఈ నెలాఖరుకు పూర్తి చేయాలనీ, నారాపల్లి వైపు నుండి ఉప్పల్ వైపు నుండి రెండు వైపులా లాంచింగ్ గడ్డర్లతో పనులు వేగం పెంచాల,ఈ కారిడార్ కింద 6.25 కి.మీ.ల బిటి రోడ్డు పనులు ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని తేల్చి చెప్పారు. ప్రతి పది రోజులకు ఒకసారి తాను స్వయంగా క్షేత్రస్థాయి పనుల పురోగతిని సమీక్షిస్తాననీ, ప్రతి రోజు వర్క్ ప్రోగ్రెస్ చూపించాలన్నారు. 300 మంది కార్మికులు రెండు షిఫ్టుల్లో పని చేస్తున్నారని అధికారులు, వర్క్ ఏజెన్సీ ప్రస్తుత పరిస్థితుల్లో రాత్రిపూట పనుల వల్ల మరింత సమయం పట్టే అవకాశం ఉందని నిర్మాణ సంస్థ విజ్ఞప్తి చేసింది. దీంతో 2026 అక్టోబర్ 31 నాటికి అందుబాటులోకి తెస్తామని డెడ్‌లైన్ పెట్టుకున్నాం ప్రజల ట్రాఫిక్ ఇబ్బందుల గురించి ఆలోచించాలన్నారు. 2026 సంవత్సరంలో ఎట్టి పరిస్థితుల్లో ప్రజలకు అందుబాటులోకి తేవాల్సిందే...అధికారులు, వర్క్ ఏజెన్సీ ఆ దిశగా పని చేయాలని ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష చేశారు.

## వెండితెరపై సర్దార్ సర్వాయి పాపన్న

(మొదటి పేజీ తరువాయి)

అమోఘమైన కృషి చేశారని కొనియాడారు.అనేక కోటలను జయించి, గోల్కొండ కోట వరకు తన సామ్రాజ్యాన్ని విస్తరించిన ఆయన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ఇలాంటి మహనీయుడి వీరగాథను, పోరాటాలను నేటి తరానికి పరిచయం చేయడంలో సినిమాలు, పుస్తకాలు కీలక పాత్ర పోషిస్తాయని అభిప్రాయపడ్డారు.ఆయన 376వ జయంతి సందర్భంగా ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం అభినందనీయమని పేర్కొంటూ చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫిలిం ఛాంబర్ అధ్యక్షుడు పతాని రామకృష్ణ, చిత్ర దర్శకుడు, నిర్మాత లింగంపల్లి వెంకటేష్ గౌడ్, డిస్ట్రిబ్యూటర్ పేపర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## 3.43 కోట్ల మందికి స్మార్ట్ ఆహార భద్రత

(మొదటి పేజీ తరువాయి)

1,06,28,092 ఆహార భద్రత కార్డుల ద్వారా 3.43 కోట్ల మంది లబ్ధిదారులు ఆహార భద్రత పరిధిలో ఉన్నారని తెలిపారు. ప్రతి అర్హుడైన లబ్ధిదారునికి నెలకు ఆరు కిలోల సన్న బియ్యాన్ని ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత, లబ్ధిదారుల సౌలభ్యం మరింత పెరుగుతాయని చెప్పారు. 2025 జనవరి 26 నుంచి ఇప్పటి వరకు 16,32,810 కొత్త ఆహార భద్రత కార్డులను జారీ చేసి వాటి ద్వారా 61,08,544 మంది లబ్ధిదారులకు ఆహార భద్రత కల్పించినట్లు వెల్లడించారు. ఆగస్టు 2026 నాటికి రాష్ట్రంలో మొత్తం ఆహార భద్రత కార్డుల సంఖ్య 1.06 కోట్లకు చేరిందన్నారు. సంగారెడ్డి కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల తరలింపు, సీటింగ్, భద్రత, కార్డుల పంపిణీతో పాటు సీఎం పర్యటనకు సంబంధించిన ప్రతి అంశానికి సంబంధించి పకడ్బందీ ప్రణాళిక రూపొందించాలన్నారు. కార్యక్రమానికి సంబంధించిన మినిట్-టు-మినిట్ షెడ్యూల్ సిద్ధం చేసి నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ ఆ శాఖ అధికారులను ఆదేశించారు.

## భూ కేటాయింపులపై కేటీఆర్ ఆరోపణలు అవాస్తవం

(మొదటి పేజీ తరువాయి)

కేటీఆర్ ఆరోపణలు చేయడం, ఐదెకరాల్లో రూ.34 కోట్లతో ఏర్పాటయ్యే కంపెనీని రూ.200 కోట్ల సంస్థగా చెప్పడం ఆశ్చర్యంగా ఉందని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ హయాంలో ముడుపులు తీసుకునే కంపెనీలకు భూములు ఇచ్చారా ? తక్కువ ధరకు ఎందుకు ఎందుకు ఇచ్చారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మీడియాలో వస్తుందని ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం కాదు, పీఎం ఏక్తామాల్ టెండర్లు పారదర్శకంగా జరిగాయి. పరిశ్రమలు రావొద్దనే హిడెన్ ఎజెండాతో కేటీఆర్ ఆరోపణలు చేస్తున్నారని హితవు పలికారు. నా శాఖలో జరిగే ప్రతీ నిర్ణయం నాకు తెలుసు. ఎవరో చెప్తే నేను పనిచేసే రకం కాదు. బీఆర్ఎస్ హయాంలో లీజుకు ఇచ్చిన భూములను సైతం రెగ్యులర్ చేశారు. అప్పుడు కేటీఆర్‌కు తప్పనిపించలేదా ? బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రావడం కలలో కూడా జరగదని ఈసందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు.

## ఓల్డ్ సిటీ మెట్రో పనుల్లో వేగం పెంచండి

(మొదటి పేజీ తరువాయి)

ముందస్తు ఏర్పాట్లపై సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు సూచనలు చేశారు. వ్యాపార రంగంలో వివిధ సెక్టార్లలో గుర్తింపు పొందిన ప్రముఖులను సమ్మిట్‌లో సన్మానించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యంగా తెలంగాణలో పెట్టుబడులను ఆకర్షించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో సమ్మిట్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత ఏడాది నిర్వహించిన సమ్మిట్‌లో రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు పురోగతికి సంబంధించి



పూర్తి వివరాలను నివేదించాలని ఆదేశించారు. పెట్టుబడుల్లో మరింత పురోగతి సాధించేందుకు అవసరమైన ప్రణాళికను తయారు చేయాలని సూచించారు.

## నిషేధిత భూములపై ఎలాంటి ఆందోళన వద్దు

(మొదటి పేజీ తరువాయి)

పరిష్కరించడం కన్నా సమస్య రాకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లపై ఉందన్నారు. 22ఎ దరఖాస్తులకు సంబంధించి కేస్ బై కేస్ ప్రతి రోజు సమీక్షించాలనీ, ఉద్దేశపూర్వకంగా పేదోడికి అర్హులకు అన్యాయం చేసే విధంగా వ్యవహరిస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. సబ్ రిజిస్ట్రార్లు ఏదైనా సమస్య ఉంటే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురావాలనీ, జాబితాలో ఉన్న ఆస్తుల రిజిస్ట్రేషన్లను గుడ్డిగా తిరస్కరించవద్దన్నారు. వచ్చిన ప్రతి దరఖాస్తును ఇకపై తహసీల్దార్‌కు కాకుండా నేరుగా కలెక్టర్‌కే పంపాలనీ, కలెక్టర్ నుండి డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ అక్కడి నుండి కలెక్టర్ మధ్యనే ఉత్తర ప్రత్యుత్తరాలు జరగాలన్నారు. సబ్ రిజిస్ట్రార్ పరిశీలనలో కొన్ని ఆస్తులు నిషేధిత జాబితాలో ఉన్నట్లు కనిపిస్తున్నందున మొత్తం రిజిస్ట్రేషన్లు ఆపుతున్నారన్న ఫిర్యాదులు వస్తున్నాయనీ, తాజాగా అప్‌లోడ్ చేస్తున్న సమాచారంతో సరిపోల్చుకుని నిర్ణయాలు తీసుకోవాలని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు.

# జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ

- టీయూడబ్ల్యూజే-ఐజేయూ లక్ష్యం
- మనది 70 ఏళ్ల చరిత్ర గల సంఘం
- అక్రిడేషన్లు, బస్సుపాసులు ఇప్పించిన ఘనత టీయూడబ్ల్యూజే-ఐజేయూదే
- సంఘటితంగా పోరాడితే పరిష్కారం కాని సమస్య ఏది లేదు
- సంగారెడ్డి జిల్లా కమిటీ చురుకుగా పని చేస్తోంది
- టీయూడబ్ల్యూజే-ఐజేయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ఏ.కే. ఫైసల్
- పటాన్ చెరు అసెంబ్లీ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



పటాన్ చెరు, ఆగస్టు 11(మనం న్యూస్): జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం అందరం కలిసి కట్టుగా సంఘటితంగా పని చేయాల్సిన అవసరం ఉందని తెలంగాణ యూనియన్ వర్కింగ్ జర్నలిస్టు-ఐజేయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఏకే. ఫైసల్ అన్నారు. పటాన్చెరు నియోజకవర్గం టియుడబ్ల్యూజే -ఐజేయూ విస్తృత స్థాయి సమావేశాన్ని రామచంద్రాపురంలోని లక్ష్మీ గార్డెన్ లో మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఫైజల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 70ఏళ్ల చరిత్ర ఉన్న యూనియన్ టీయూడబ్ల్యూజే-ఐజేయూ క్రమశిక్షణకు మారుపేరులాంటిందన్నారు. క్రమ శిక్షణతో పాటు గ్రామీణ విలేకరుల సంక్షేమం, హక్కుల కోసం పోరాటడమే యూనియన్ ప్రధాన లక్ష్యమన్నారు. రాష్ట్రంలో జర్నలిస్టులకు బస్సు పాస్ సౌకర్యం కల్పించడంలో టీయూడబ్ల్యూజే-ఐజేయూ పాత్ర మరవలేనిదని చెప్పారు. జిల్లాలో అర్హులైన ప్రతీ జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డులను ఇప్పించడం జరుగుతుందని అన్నారు. జర్నలిస్టుల అరోగ్య భద్రత, హక్కుల పరిరక్షణకు తమ యూనియన్ పాటు పడుతుందన్నారు. నియమనిబంధనలతో సంఘం పనిచేస్తుందని చెప్పారు. సంఘటితంగా ఉండి పోరాడితే పరిష్కారం కానీ సమస్య ఏదీ లేదన్నారు. సంగారెడ్డి జిల్లా కమిటీ చురుకుగా పని చేస్తోందని, పటాన్ చెరు నూతన కార్యవర్గం కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు.

జర్నలిస్టులపై ప్రమాదాల నివారణ కోసం జాతీయస్థాయిలో చట్టం తీసుకురావడానికి కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు యూనియన్ కృషి చేస్తుందన్నారు. జర్నలిస్టుల ఉద్యోగ భద్రత, ఇతర సమస్యలపై యూనియన్ త్వరలోనే ఒక నిర్ణయం తీసుకుపోతున్నట్లు స్పష్టం చేశారు. పటాన్ చెరు కమిటీలు అవకాశం రానివారు నిరాశ చెందొద్దని, పనిచేసే ప్రతి ఒక్కరికి యూనియన్ గుర్తించి సముచిత స్థానం కల్పిస్తదని ఫైసల్ భరోసా ఇచ్చారు.సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు యాదగిరి మాట్లాడుతూ.. మన సంఘంలో ప్రతి జర్నలిస్టుకు గౌరవం దక్కుతుందన్నారు. జర్నలిస్టుల గౌరవం, భద్రత, హక్కుల విషయంలో అవసరమైనప్పుడు సంఘటితంగా గొంతెత్తాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ మాట్లాడుతూ.. పటాన్ చెరు జర్నలిస్టుల సమిష్టి కృషితోనే అంచలంచలుగా జిల్లా స్థాయికి ఎదిగానని చెప్పారు. ఇక్కడి జర్నలిస్టులకు రుణపడి ఉంటానంటూ సభావేదిక ద్వారా పాదాబివందనం చేస్తున్నట్లు తెలిపారు. సంఘం బలోపేతానికి శాయశక్తులా కృషి చేస్తానని చెప్పారు. టీయూడబ్ల్యూజే-ఐజేయూ ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యదర్శి చెన్న బసవేశ్వర్ అధ్యక్షత వహించిన సమావేశంలో ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు ఆసీఫ్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనాథ్, జిల్లా జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా జాయింట్ సెక్రటరీ భూపాల్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ సంతోష్, ఫోటో గ్రాఫర్ జిల్లా అధ్యక్షుడు ఆరీప్, చిన్న,మధ్య తరహా పేపర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు సిద్ధిఖ్, జనరల్ సెక్రటరీ ఈశ్వర్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

### అనంతరం పటాన్చెరు నియోజకవర్గం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు

**పటాన్ చెరు అసెంబ్లీ టీయూడబ్ల్యూజే-ఐజేయూ నూతన కార్యవర్గం..**

**అధ్యక్షునిగా పత్తి నరసింహా, ప్రధాన కార్యదర్శిగా యాదగిరి (ఏబీఎన్)**

నూతన అధ్యక్షునిగా పత్తి నర్సింహా, ప్రధానకార్యదర్శిగా యాదగిరి, సలహాదారులుగా కాశీపతి, సయ్యద్ సులేమాన్, రామారావు, ఉపాధ్యక్షులుగా విఠల్, నగేష్, శివకుమార్, జెమిని రాజు, రమేష్, జాయింట్ సెక్రటరీలుగా వేణు, ప్రభాకర్, శ్రీనివాస్, కోటేష్, శివాజీ, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఆంజనేయులు, గాండ్ల మహేష్, వివేక్, జీవరత్నం, రాజు, కోశాధికారిగా శ్రీనివాస్ రెడ్డి, ఈసీ మెంబర్లు గా శ్రీనివాస్, శంకర్, శేఖర్, మహేందర్ గౌడ్, సిద్దు, శ్రీనివాస్ మామా, రాజశేఖర్, ప్రదీప్ రెడ్డి, విజయ్, నాయుడు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరికి రాష్ట్ర, జిల్లా నాయకులు, తోటి జర్నలిస్టులు శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు.

# జర్నలిస్టుల హక్కుల సాధనకు కృషి

- సంఘం బలోపేతమే లక్ష్యంగా పని చేస్తా
- అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు అందరికీ కృతజ్ఞతలు
- టీయూడబ్ల్యూజే-ఐజేయూ పటాన్చెరు నియోజకవర్గ అధ్యక్షుడిగా పత్తి నరసింహా

రామచంద్రాపురం, ఆగస్టు 11 (మనం న్యూస్):జర్నలిస్టుల హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేస్తూనే టీయూడబ్ల్యూజే-ఐజేయూ సంఘం బలోపేతానికి శాయశక్తులా పనిచేస్తానని నూతన పటాన్చెరు నియోజకవర్గ అధ్యక్షుడు పత్తి నర్సింహా అన్నారు. మంగళవారం రామచంద్రాపురంలోని లక్ష్మీ గార్డెన్లో నిర్వహించిన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయనకు సంఘం పటాన్ చెరు నియోజకవర్గ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సంఘం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. జర్నలిస్టులందరినీ కలుపుకొని ముందుకు సాగుతూ వారి హక్కులు, గౌరవం, సంక్షేమం కోసం పని చేస్తానని తెలిపారు. సంఘం ప్రతిష్ట పెంచడంతో పాటు సంఘాన్ని ఆదర్శంగా నిలుపుతానని భరోసా ఇచ్చారు. తనకు నియోజకవర్గ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు నియోజకవర్గ జర్నలిస్టులకు, అవకాశం ఇచ్చినందుకు సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పత్తి నరసింహాకు సన్మానించి, జర్నలిస్టులు శుభాకాంక్షలు తెలిపారు.



## ఐరాస ఆవరణలో భారత నెమళ్లు

జెనీవా, ఆగస్టు 11: స్విట్జర్లాండ్‌లోని ఐక్యరాజ్యసమితి జెనీవా కార్యాలయ ప్రాంగణంలో మన నెమళ్లు సందడి చేయనున్నాయి. దశాబ్దాలుగా కొనసాగుతున్న సంప్రదాయానికి పునరుజ్జీవం కల్పిస్తూ ఐదు నెమళ్లను జెనీవాలోని ఐరాస కార్యాలయానికి భారత్ బహూకరించింది. యూఎన్ఓజీ డైరెక్టర్ జనరల్ టాటియానా వలోవాయాకు భారత శాశ్వత ప్రతినిధి అరిందమ్ బాగ్చీ వీటిని అందజేశారు. ఇందులో నాలుగు నీలి నెమళ్లు కాగా, మరొకటి తెల్లని ఈకలతో ఉన్న మగ నెమలి. ఐక్యరాజ్యసమితికి ప్రతీకగా నిలిచే నీలం, తెలుపు రంగులను ప్రతిబింబించేలా ఈ నెమళ్లను అందించడం ప్రత్యేకతను సంతరించుకుంది. ఐరాస జెనీవా కార్యాలయానికి నెమళ్లను భారత్ బహూకరించడం ఇదే తొలిసారి కాదు. 1981లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఢిల్లీ జూ నుంచి ఒక జత నెమళ్లను పంపించారు. 45 ఏళ్ల తర్వాత ఇప్పుడు మరోసారి మన నెమళ్లు జెనీవాకు చేరాయి.

## 2028 మార్చి దాకా ఈవీ కొనుగోలు సబ్సిడీ

**పీఎం ఇ-డ్రైవ్ పథకం గడువు పొడిగింపు**

ఢిల్లీ, ఆగస్టు 11: ఎలక్ట్రిక్ వాహన కొనుగోలుదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. పీఎం ఇ-డ్రైవ్ పథకం కింద ఇచ్చే సబ్సిడీ గడువును 2028 మార్చి 31 వరకు పొడిగించింది. ఈ పథకం అమలుకు మరో రూ.1000 కోట్లు అదనంగా కేటాయించింది. ఈ మేరకు సోమవారం రాత్రి నోటిఫికేషన్ జారీ చేసింది.ఈ స్కీమ్ కింద ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలకు కిలోవాట్ అవర్ కు రూ.2,500 చొప్పున సబ్సిడీ చెల్లిస్తారు. ఒక వాహనానికి గరిష్ఠంగా రూ.5వేలు మాత్రమే సబ్సిడీ లభిస్తుంది. 2024-25లో కిలోవాట్ అవర్కు రూ.5వేలు, ఒక వాహనానికి గరిష్ఠంగా రూ.10వేలు సబ్సిడీ ఉండేది. ఎలక్ట్రిక్ టూవీలర్ ఎక్స్ షోరూమ్ ధర రూ.1.5 లక్షలు దాటని వాహనాలకే ఈ సబ్సిడీ వర్తిస్తుంది. ఈ పథకం కింద మొత్తం 45,79,120 ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలకు లబ్ధి చేకూర్చాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విభాగం కోసం మొత్తం రూ.2,767 కోట్లు కేటాయించారు. పీఎం ఇ-డ్రైవ్ పథకానికి రూ.11,900 కోట్లు కేటాయించింది.దేశంలో విద్యుత్ వాహనాల వినియోగాన్ని పెంచే ఉద్దేశంలో పీఎం ఇ-డ్రైవ్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. 2024 సెప్టెంబర్లో ప్రకటించిన ఈ పథకం గడువు 2027 మార్చి 31తో ముగియనుంది. ఈ నేపథ్యంలో సబ్సిడీ గడువు పొడిగించాలంటూ రాజ్యసభ స్టాండింగ్ కమిటీ కేంద్ర భారీ పరిశ్రమల శాఖను కోరింది. ఈ క్రమంలో గడువు పెంపు నిర్ణయం వెలువడింది. నిర్దేశిత గడువు కంటే ముందే ఈ నిధులు పూర్తయితే కొత్త క్లెయిమ్లు స్వీకరించరు. అలాగే, ఇ-ద్విచక్ర వాహనాల సబ్సిడీ క్లెయిమ్ చేసుకోవడానికి 2027 డిసెంబర్ 31ని చివరితేదీగా నిర్ణయించారు.

## ట్రంప్ పదవీకాలం పూర్తయ్యేదాకా చర్చల ప్రసక్తే లేదు: ఇరాన్

(మొదటి పేజీ తరువాయి)

హర్మూజ్ జల సంధిని తెరిచే ప్రసక్తి లేదని ఇరాన్ విదేశాంగశాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘేయి తెలిపారు. రేవుల దిగ్బంధనాన్ని ఎత్తివేయడంతోపాటు యుద్ధంవల్ల ఇరాన్‌కు కలిగిన నష్టానికి పరిహారం చెల్లించాలని, ఆర్థిక ఆంక్షలను ఎత్తివేయాలని, స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తుల్ని విడుదల చేయాలని బఘేయి డిమాండు చేశారు.

మీరే పరిహారం చెల్లించాలి: ట్రంప్

గత ఐదు నెలలుగా యుద్ధంవల్ల కలిగిన నష్టానికి పరిహారం చెల్లించాలని ఇరాన్ కోరుతోందని, అది మంచి ఐడియానే అని, అయితే చాలా ఏళ్లుగా చేస్తున్న అరాచకాలకు ఆ దేశం పరిహారం చెల్లించాల్సి ఉంటుందని ట్రంప్ స్పష్టం చేశారు. దశాబ్దాలుగా ఇరాన్ అరాచకాలు చేస్తోందని, ఆందోళనల సందర్భంగా వేల మందిని చంపిందని, గత ఐదు నెలల్లో చంపిన 52,000 మందికీ పరిహారం చెల్లించాలని డిమాండు చేశారు.

## నీట్ రద్దు చేయాలి

**తమిళనాడు అసెంబ్లీ తీర్మానం**

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం ఈ తీర్మానాన్ని తీసుకువచ్చారు. దీనికి ప్రధాన విపక్షాలైన డీఎంకే, ఏఐఏడీఎంకే మద్దతు తెలిపాయి.

టీవీకేకు మిత్రపక్షాల నుంచి ఎలాగూ మద్దతు ఉంది. ఒక్క బీజేపీ మాత్రం సభ నుంచి వాకౌట్ చేసింది. తీర్మానాన్ని ప్రవేశపెట్టిన సందర్భంగా ఆరోగ్య మంత్రి అరుణ్రాజ్ మాట్లాడారు. ''కేంద్ర ప్రభుత్వం నీట్‌ను రద్దు చేయాలి. ఈ ప్రవేశ పరీక్షవల్ల విద్యార్థుల దృష్టి కోచింగ్ సెంటర్ల వైపు మళ్లింది. ఫీజులు భారీగా వసూలు చేసే కోచింగ్ సెంటర్లు పెరిగిపోయాయి. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని, సామాజికంగా-ఆర్థికంగా వెనకబడిన విద్యార్థుల అవకాశాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి' అని ఆందోళన వ్యక్తంచేశారు. సామాజిక న్యాయం, సమానత్వం, రాష్ట్రాల హక్కులకు ఈ పరీక్ష వ్యతిరేకం అనే విషయాన్ని తమిళనాడులోని ప్రతి ప్రభుత్వం వాదిస్తోన్న విషయాన్ని గుర్తుచేశారు. 12వ తరగతి మార్కుల ఆధారంగా వైద్య కోర్సుల్లో ప్రవేశం ఉండాలని విజయ్ (ఇజ్జ్ఞుడు) ప్రభుత్వం ప్రతిపాదించింది. గతంలో డీఎంకే ఇదే ప్రతిపాదన చేసిన సంగతి తెలిసింది.

నీట్ పేపర్ లీక్ అంశాన్ని కూడా తమిళనాడు ప్రభుత్వం తీర్మానంలో ప్రస్తావించింది. విద్యార్థుల ఆత్మహత్యలకు ఈ పరీక్ష ఒత్తిడి కారణమని పేర్కొంది. నీట్ రద్దుతోనే వాటికి ముగింపు వస్తుందని అభిప్రాయపడింది.

## ట్రంప్ లాపతా జర్నీ

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న ఎయిర్‌పోర్ట్ క్యాటరింగ్ ట్రక్కు లోకి ట్రంపును మార్చారు. ఆ తర్వాత ఆయన్ను ఇ-32అ విమానంలోకి ఎక్కించి రహస్యంగా తుర్కియే దాటించారు. అక్కడి నుంచి బ్రిటన్ వెళ్లారు. ఎయిర్‌ఫోర్స్ వన్లో పాత్రికేయులు, ఇతర సిబ్బంది ప్రయాణించారు. ట్రంప్ ఆ విమానంలోనే ఉన్నారని శత్రువులను నమ్మించేందుకు, ఆయన భద్రత దృష్ట్యా ఈ ఏర్పాటు చేశారని తెలుస్తోంది. జులై 8న ఈ ఘటన జరిగిందని మీడియా కథనం పేర్కొంది. అప్పటికే ఇరాన్-అమెరికా మధ్య ఘర్షణలు తీవ్రస్థాయిలో కొనసాగుతున్నాయి. అదీగాక తుర్కియేకు అత్యంత సమీపంలో ఇరాన్ ఉంటుంది.

## పంద్రాగస్టున జెండా పండుగను చేసుకుందాం

(మొదటి పేజీ తరువాయి)

ఓ వేడుకలా నిర్వహించాలని కోరారు. త్రివర్ణ పతాకం మనకు గర్వకారణమని, దేశం కోసం ఎల్లప్పుడూ సేవలందించేందుకు అది నిరంతరం స్ఫూర్తినిస్తుందని ప్రధాని చెప్పుకొచ్చారు. ఈసారి హర్ ఘర్ తిరంగా ఉద్యమంలో ఉత్సాహంగా పాల్గొని, భారత్ నిర్మాణానికి దోహదపడాలని ఆకాంక్షించారు. అలాగే, ఈ ఏడాది వందేమాతరం జాతీయ గీతం ఇతివృత్తంగా వేడుకలు నిర్వహించనున్నట్లు మోడీ పేర్కొన్నారు.

# నా ఓటు తీసేసిండ్రు

**తన ఓటు పోయిందంటున్న ప్రకాశ్ రాజ్**

బెంగళూరు, ఆగస్టు 11: బెంగళూర్లో గల్లంతైన 65 లక్షల ఓట్లలో తనది కూడా ఉందని ప్రకాశ్ రాజ్ తెలిపారు. ఈ విషయంపై సోషల్ మీడియాలో ఓ సెల్ఫీ వీడియోను పంచుకున్నారు. ప్రత్యేక సమగ్ర సవరణ(సర్)పై మాట్లాడారు. 'సర్' తర్వాత బెంగళూరు నియోజకవర్గంలో తొలగించిన 65 లక్షల ఓట్లలో నాది కూడా ఉంది. ఇది చాలా హాస్యాస్పదంగా అనిపిస్తోంది. నేను ఈ నియోజకవర్గంలోనే పుట్టాను. ఇక్కడే నివసించాను. చదువంతా ఇక్కడే పూర్తయింది. నటన నేర్చుకుంది కూడా ఇక్కడే. అన్నిటికంటే ముఖ్యంగా.. నేను ఈ నియోజకవర్గం నుంచి ఎంపీ అభ్యర్థిగా కూడా పోటీ చేశాను. అయినా నా ఓటును తొలగించారు' అని ఆ వీడియోలో చెప్పారు. మళ్లీ ఓటర్ కార్డు పొందడానికి ఏ డాక్యుమెంట్లు అడుగుతారో అని వ్యంగ్యంగా అన్నారు. తాను అన్నిటికీ సిద్ధంగా ఉన్నానని చెప్పారు. 'మీకు ఓటు వేయని వారిని తొలగించే అధికారం మీకు ఉండొచ్చు. కానీ మిమ్మల్ని అధికారం నుంచి దింపకుండా మమ్మల్ని ఆపగలరా?' అని గేమ్ ఆన్ అంటూ ప్రశ్నించారు.

ప్రకాశ్ రాజ్ కు కర్ణాటక, తమిళనాడు, తెలంగాణతో సహా నాలుగు రాష్ట్రాల్లో ఓటరు కార్డులు ఉన్నాయనే ఆరోపణలపై ఇటీవల బెంగళూరులో కేసు నమోదైంది. నోటీసులకు స్పందించకపోవడంతో ఆయనపై నాన్-బెయిలబుల్ వారెంట్ కూడా జారీ చేశారు. ఈ కేసులో జులైలో బెంగళూరు కోర్టు ముందు ప్రకాశ్ రాజ్ హాజరుకాగా.. వాదనలు విన్న న్యాయస్థానం ఆయనకు బెయిల్ మంజూరు చేసింది.

# కలిసి పని చేద్దాం రండి

(మొదటి పేజీ తరువాయి)

సివిల్ స్పేస్ జాయింట్ వర్కింగ్ గ్రూప్ సమావేశం బెంగళూరులోని ఇస్రో ప్రధాన కార్యాలయంలో ఇటీవల జరిగింది. ఈ సందర్భంగా ఇప్పటికే చేసుకున్న ఒప్పందాలను మరింత బలోపేతం చేసుకోవడం, శాస్త్రీయ సమాచారాన్ని పంచుకోవడం, సహకారం, వీటికి సంబంధించిన చర్చలను ముమ్మరం చేసుకునేందుకు ఇరుపక్షాలు అంగీకరించాయి. గతేడాది అమెరికా అధ్యక్షుడు ట్రంప్, భారత ప్రధాని మోడీ చేసిన సంయుక్త ప్రకటనకు అనుగుణంగా ఇరు దేశాలు సాధారణ, వాణిజ్య




అంతరిక్ష పరిశోధనల్లో సహకారాన్ని మరింత విస్తరించుకోవడంపైనా ఇరు పక్షాలు ప్రధానంగా దృష్టి సారించాయి. ఈ సందర్భంగా ఇస్రో ఛైర్మన్ నారాయణన్, అమెరికా రాయబారి సెర్గియో గోర్‌లు మాట్లాడుతూ.. ద్వైపాక్షిక అంతరిక్ష సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం, దాని ప్రాముఖ్యతను ప్రస్తావించారు.

# బోనమెత్తిన హైదరాబాద్ కలెక్టర్

### కలెక్టరేట్‌లో కనులపండువగా 'బోనాలు'

### ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు

### హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా



హైదరాబాద్,ఆగష్టు 11,(మనం న్యూస్): హైదరాబాద్ ఆషాఢ బోనాల పండుగకు అత్యంత విశిష్టమైన ప్రత్యేక గుర్తింపు ఉందని జిల్లా పాలనాధికారిణీ డాక్టర్ ప్రియాంక అలా స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ ఆవరణలోని శ్రీశ్రీశ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో బోనాల మహోత్సవాన్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు.ఆలయ మర్యాదలతో నిర్వహించిన ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ స్వయంగా బోనమెత్తి, అమ్మవారికి భక్తిశ్రద్ధలతో సమర్పించారు. కలెక్టరేట్ మహిళా ఉద్యోగులు సాంప్రదాయ రీతిలో బోనాలతో తరలివచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో విలసిల్లాలని, జిల్లా మరింత ప్రగతి పథంలో దూసుకు పోవాలని అమ్మవారిని ప్రార్థించినట్లు ఆమే వెల్లడించారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, ఎక్కడా తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని కనకదుర్గమ్మను వేడుకున్నట్లు ఆమె పేర్కొన్నారు.

**హోరెత్తిన కలెక్టరేట్ ప్రాంగణం:**

అమ్మవారి బోనాల ఊరేగింపు సందర్భంగా కలెక్టరేట్ ప్రాంగణం శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, తొట్టెల సమర్పణ మరియు మహిళల కోలాటాలతో మార్మోగింది. నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు వరకల సత్యనారాయణ, సభ్యుల ఆధ్వర్యంలో ఈ వేడుకలను అత్యంత ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గత 33 సంవత్సరాలుగా అసోసియేషన్ అందిస్తున్న సేవలపై హర్షం వ్యక్తం చేస్తూ, ఉద్యోగులను అభినందించిన కలెక్టర్ వారికి జ్ఞాపికలను అందజేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గత ఆదివారం పాత కలెక్టరేట్‌లోని శ్రీ మహంకాళి అమ్మవారికి కూడా కమిటీ సభ్యులు, ఉద్యోగులు సాంప్రదాయబద్ధంగా బోనాలు సమర్పించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ వేడుకల్లో అదనపు కలెక్టర్ కదిరవన్ పలని, డీఆర్ఓ డాక్టర్ నారాయణ, ఆర్డీవోలు సాయిరాం, రామకృష్ణ, ఏఓ వెంకటరామిరెడ్డి, సంఘం ప్రతినిధులు రామకృష్ణ, ముత్యాలు, తుల్జారాం, దశరథ్ మరియు వివిధ శాఖల రెవిన్యూ సిబ్బంది, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఆషాఢ మాసం బోనాల సందర్భంగా నిర్వహించే పలారం బండ్ల ఊరేగింపు మంగళవారం పటాన్ చెరు లో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి , వివిధ రాజకీయ పార్టీల నాయకులు , కుల సంఘాల నాయకులు , స్థానిక నేతలు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# ఇకనుంచి మండల స్థాయిలో ప్రజావాణి

### మండల నోడల్ అధికారు(ఎంపీడీవో)ల రేపు ప్రజాభవన్‌లో శిక్షణ

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇకనుంచి మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ప్రతి సోమవారం మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనుంది. ఈ మేరకు జీవో ఎంఎస్ నంబర్-4 ద్వారా ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో బాగంగా ప్రజావాణిపై ఎంపీడీవోలకు శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించనుంది. రేపు (ఆగస్టు 13వ తేదీన) ఉదయం10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వారికి శిక్షణ ఇవ్వనుంది. హైదరాబాద్ ప్రజాభ వన్‌లో ఈ శిక్షణ ఇవ్వనున్నారు. మండల నోడల్ అధికారులైన ఎంపీడీవోలు తప్పనిసరిగా ఈ శిక్షణకు హాజరు కావాలని తెలంగాణ సర్కార్ ఆదేశాలు జారీ చేసింది.

# బోనంతో నిరుద్యోగుల నిరసన

- పోలీస్ ఉద్యోగాల్లో వయోపరిమితి, ఉద్యోగ నోటిఫికేషన్లు పెంచాలని డిమాండ్

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగులను నమ్మిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, తామొస్తే? తక్షణమే జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తాం.. 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామంటూ అలవికానీ హామీలిచ్చి గద్దెనెక్కిందని రేవంత్ సర్కార్ తీరును నిరసిస్తూ నిరుద్యోగులు మరోసారి రోడ్డెక్కారు. అయితే, ఈ సారి అత్యంత వినూత్నంగా నిరసన తెలియచేశారు.

హామీలను నెలవేర్చకపోవడంపై దశల వారిగా ఆందోళనలు నిర్వహిస్తున్న నిరుద్యోగులు.. తాజాగా పోలీస్ ఉద్యోగాల్లో వయోపరిమితి పెంచాలని, ఉద్యోగ నోటిఫికేషన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ మంగళవా రం అమ్మాయిలు బోనమెత్తారు.

ఈ మేరకు దిల్‌సుఖ్ నగర్ రోడ్లపై నిరుద్యోగ యువతులు ఓ వైపు బోనమెత్తగా.. మరోవైపు యువకులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. పోలీస్ ఉద్యోగాల వయోపరిమితి 4 ఏండ్లకు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. కానిస్టేబుల్ ఉద్యోగాలకు వయోపరిమితిని 36 ఏండ్లు, ఎస్ఐ ఉద్యోగాలకు వయోపరిమితి 38కి పెంచాలని, 87వ జీవో సవరించాలని డిమాండ్ చేశారు.

# ప్రాజెక్టుకు డీపీఆరే ప్రాణం

- ఆనకట్టల అంచనాలపై 'కాగ్' ఆడిట్ ఫీల్డ్ సర్వే, సాంకేతిక సాధ్యాసాధ్యాలను క్షుణ్ణంగా పరిశీలించాలె
- ప్రిన్సిపాల్ అకౌంటెంట్ జనరల్ మాధవి



హైదరాబాద్, ఆగష్టు11 (మనం న్యూస్): ఒక ఇంజినీరింగ్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టినప్పుడు దానికి సంబంధించిన 'సమగ్ర ప్రాజెక్టు నివేదిక' అత్యంత కీలకమని, అదే ప్రాజెక్టుకు ప్రాణాధారమని ప్రిన్సిపాల్ అకౌంటెంట్ జనరల్ (ఆడిట్) పి. మాధవి స్పష్టం చేశారు. ఈ రిపోర్టులోనే ఫీల్డ్ సర్వే, క్షేత్రస్థాయి డేటా సేకరణ, సాంకేతిక సాధ్యాసాధ్యాలు, డిజైన్,అంచనా వ్యయం వంటి అంశాలు స్పష్టంగా ఉంటాయని, వీటిని కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) కార్యాలయ గణాంక అధికారులు అత్యంత క్షుణ్ణంగా పరిశీలించాల్సిన బాధ్యత ఉందని ఆమె గుర్తుచేశారు.ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా (ఎస్కి) లో 'ప్రిపరేషన్ ఆఫ్ ఎస్టిమేట్స్ అండ్ డీపీఆర్ ఫర్ ఇంజనీరింగ్ ప్రాజెకట్స్ అండ్ వర్క్స్' పై వివిధ రాష్ట్రాల సీనియర్ డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్స్, డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్స్ గ్రేడ్-1, 2 ల కోసం ఏర్పాటు చేసిన ఐదు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం ఆమె సీనియర్ అధికారులతో కలిసి ఆమే ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డీపీఆర్‌లో ప్రాజెక్టు నిర్మాణ వ్యయం మాత్రమే కాకుండా, భవిష్యత్ నిర్వహణ వ్యయం (లైఫ్‌సైకిల్ కాస్ట్), ప్రాజెక్టు సుస్థిరత, దాని సామర్థ్యం వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రాజెక్టు పరిధిలోని సైట్ కండిషన్స్, సాయిల్ ఇన్వెస్టిగేషన్స్ (భూసార పరీక్షలు), పర్యావరణ అనుమతులు కూడా సమగ్ర ప్రాజెక్టు రిపోర్టులో అంతర్భాగంగా ఉండాలన్నారు. షెడ్యూల్ ఆఫ్ రేట్స్, మార్కెట్ రేట్లు, మెటీరియల్ ధరలు, కార్మిక వ్యయం,రవాణా ఖర్చులను అంచనా వేసేటప్పుడు పారదర్శకత పాటించాలన్నారు.

**సమర్థవంతమైన పర్యవేక్షణ అవసరం:**

ఈ సమావేశంలో ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ కల్నల్ హర్ పాల్ సింగ్ గ్రేవల్ మాట్లాడుతూ, ఒక ఇంజనీరింగ్ పనికి నిధుల సమీకరణ, టెండర్ ప్రక్రియ,పనుల అమలు పర్యవేక్షణ అత్యంత సమర్థవంతంగా జరగాలన్నారు. అప్పుడే ప్రాజెక్టులు అనుకున్న సమయానికి పూర్తవుతాయని చెప్పారు. మాజీ ఇంజనీర్ ఇన్ చీఫ్, న్యాక్ మాజీ డైరెక్టర్ కె. భిక్షపతి మాట్లాడుతూ, ప్రస్తుతం జి.ఐ.ఎస్, ఆటోక్యాడ్ వంటి ఆధునిక సాఫ్ట్‌వేర్ టూల్స్ అందుబాటులోకి వచ్చాయని, వీటి సహాయంతో డీపీఆర్లను మరింత సులభంగా, ఖచ్చితత్వంతో తయారు చేయవచ్చని కల్నల్ హర్ పాల్ సింగ్ గ్రేవల్ వివరించారు.

**కాగ్ - ఎస్కీ మధ్య కీలక ఒప్పందం:**

గత మూడు నెలల క్రితం ఢిల్లీలోని కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ కార్యాలయంలో కాగ్ మరియు ఎస్కీ మధ్య జరిగిన ఒప్పందం మేరకు ఈ శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వాటర్ రిసోర్సెస్ ఇంచార్జ్ హెడ్ జి. నరేష్ తెలిపారు. కాగ్ కార్యాలయంలో పనిచేస్తున్న డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్లకు నెలకు ఒక బ్యాచ్ చొప్పున ఐదు రోజుల పాటు డీపీఆర్ల తయారీపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. హైవేస్, బ్రిడ్జెస్, డ్యామ్స్, కెనాల్స్, స్ట్రక్చర్స్‌పై నిపుణులైన ఫ్యాకల్టీలతో శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ సదస్సులో 50 మంది అకౌంట్స్ అధికారులు పాల్గొన్నారు.



# పొలం గట్టున బస

## నాటుకోడి పులుసుతో విందు

- తెలంగాణ టూరిజం శాఖ సరికొత్త ప్లాన్..
- స్థానికుల ఇళ్లలోనే పర్యాటకులకు బస, భోజన సౌకర్యాలు
- గ్రామీణ యువతకు ఉపాధి, ఇంటి యజమానులకు అదనపు ఆదాయం
- దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లోనే అనుమతులు మంజూరు
- వసతుల ఆధారంగా సిల్వర్, గోల్డ్, ప్లాటినమ్ కేటగిరీలుగా వర్గీకరణ

**ఆహా..ఉదయాన్నే దట్టమైన అడవుల్లో సఫారీ వాహనంలో విహారం.. సాయంత్రానికి పొలం గట్టున వేసిన మంచెపై సేద తీరుతూ, వేడివేడి జొన్న రొట్టెను ఘుమఘుమలాడే నాటుకోడి పులుసుతో ఆస్వాదించడం.. ఇలాంటి అపురూపమైన పల్లెటూరి అనుభూతిని నగరవాసులకు, పర్యాటకులకు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. కేరళ, గోవా, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో విజయవంతమైన 'హోమ్ స్టే' విధానాన్ని తెలంగాణ రాష్ట్రంలోనూ అమలు చేసేందుకు పర్యాటక శాఖ ముమ్మరంగా కసరత్తు చేస్తోంది. సాధారణ హోటళ్లు, రిసార్టులకు భిన్నంగా, గ్రామీణ వాతావరణంలో స్థానికుల ఇళ్లలోనే బస చేస్తూ వారి జీవనశైలి, సంస్కృతీ సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లను ప్రత్యక్షంగా అనుభూతి, ఊహించని ఎంజాయ్ కూడా ఈ'హోమ్ స్టే' ద్వారా పొందవచ్చు.**

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణలోని స్థానికులకు పర్యాటక రంగం ద్వారా అదనపు ఆదాయం కల్పించేందుకు ప్రభుత్వం త్వరలోనే ఒక ప్రత్యేక హోమ్ స్టే పథకాన్ని ప్రారంభించనుంది. దీని ద్వారా నివాస గృహాలను పర్యాటకుల బసకు వినియోగించుకునేందుకు యజమానుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తుంది. తెలంగాణ టూరిజం పాలసీ 2025-30లో భాగంగా ప్రవేశపెట్టిన ఈ పథకం ద్వారా గ్రామీణ, పట్టణ, గిరిజన ప్రాంతాల సంస్కృతి, వంటకాలు, హస్తకళలను పర్యాటకులకు పరిచయం చేయడమే కాక.. భారీ కమర్షియల్ నిర్మాణాలు లేకుండానే వసతి సామర్థ్యాన్ని పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

**పర్యాటకానికి కొత్త ఊపు..**

ఈ విధానం ద్వారా రాష్ట్రంలోని అనేక పర్యాటక, ఆధ్యాత్మిక, ప్రకృతి రమణీయ ప్రాంతాల్లో పర్యాటక రంగానికి కొత్త ఊపు రానుంది. యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం, ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర జరిగే మేడారం, లక్నవరం సరస్సు, తాడ్వాయి అటవీ ప్రాంతాలు హోమ్ స్టేలకు చిరునామాగా మారనున్నాయి.

అలాగే, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల్లోని దట్టమైన అడవులు, కుంతాల, బొగత జలపాతాల సమీప గిరిజన గూడేలు పర్యాటకులను ఆకర్షించనున్నాయి. వీటితో పాటు నల్గొండ జిల్లాలోని కృష్ణానది పరీవాహక ప్రాంతాలు, బౌద్ధ క్షేత్రాలు, మాల్దీవులను తలపించే సోమశిల, పోచంపల్లి చేనేత గ్రామాలు, యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రం వంటి ప్రాంతాలు ఈ జాబితాలో ఉన్నాయి.

**స్థానికులకు ఉపాధి.. యజమానులకు ఆదాయం**

ఈ హోమ్ స్టే విధానం కేవలం పర్యాటకులకు కొత్త అనుభూతిని ఇవ్వడమే కాకుండా, స్థానికులకు పెద్ద ఎత్తున ప్రయోజనం చేకూర్చనుంది. గ్రామీణ యువత, మహిళలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. మీ ఇంటినే హోటల్‌గా మార్చుకొని అదనపు ఆదాయం పొందొచ్చు. మారుమూల గ్రామీణ ప్రాంతంలో ఇళ్లు, ఖాళీ గదులు, పాతకాలపు వారసత్వ భవనాలు, ఫాం హౌజ్‌లు ఉన్న యజమానులు ఎలాంటి భారీ పెట్టుబడి లేకుండానే టూరిజం ద్వారా అదనపు ఆదాయం సంపాదించుకోవచ్చు.

అందుకు అనుగుణంగా పర్యాటక రంగాన్ని కొత్త దిశగాతీసుకెళ్లేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేస్తోంది. ఇకపై రాష్ట్రంలోని ఇళ్లనే పర్యాటక వసతులుగా మార్చి కుటుంబాలు అదనపు ఆదాయం పొందేలా ప్రత్యేక హోమ్ స్టే పథకాన్ని అమలు చేయనుంది. ఈ మేరకు పర్యాటక శాఖ త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అర్హత కలిగిన ఇంటి ఓనర్ల నుంచి దరఖాస్తులను ఆహ్వానించనుంది. వారి చేతి వంటకాలకు, స్థానిక పిండివంటలకు మంచి ప్రచారం దక్కుతుంది.

**సరళమైన అనుమతులు, ప్రత్యేక శిక్షణ**

ఆసక్తి ఉన్న గృహ యజమానులు పర్యాటక శాఖకు దరఖాస్తు చేసుకుంటే, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి కేవలం 30 పనిదినాల్లోనే అనుమతులు మంజూరు చేస్తారు. ఈ రిజిస్ట్రేషన్ రెండేళ్ల పాటు చెల్లుబాటులో ఉంటుంది. కల్పించే వసతులను బట్టి హోమ్ స్టేలను సిల్వర్, గోల్డ్, ప్లాటినమ్ కేటగిరీలుగా వర్గీకరించి, వాటికి అనుగుణంగా ధరలను నిర్ణయిస్తారు. పర్యాటకులకు నాణ్యమైన సేవలు, భద్రత, గౌరవప్రదమైన ఆతిథ్యం అందించే అంశాలపై యజమానులకు, స్థానిక యువతకు పర్యాటక శాఖ ప్రత్యేక శిక్షణ కూడా ఇవ్వనుంది.

ఈ బృహత్తర ప్రణాళికతో తెలంగాణ పర్యాటక ముఖచిత్రంపై పల్లెటూరి అందాలు కొత్త రంగులు అద్దనున్నాయి.

తెలంగాణ తొలి ప్రత్యేక పర్యాటక విధానమైన తెలంగాణ టూరిజం పాలసీ 2025-30లో ఐదేళ్లలో రూ.15 వేల కోట్ల పెట్టుబడులు ఆకర్షించడం, మూడు లక్షల ఉద్యోగాలు సృష్టించడం, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో పర్యాటక రంగం వాటాను రెండంకెలకు పెంచడం వంటి లక్ష్యాలను ప్రభుత్వం నిర్దేశించింది. ఈ లక్ష్యాల సాధనలో హోమ్ స్టేలు కీలకంగా మారే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

మొత్తంగా హోమ్ స్టే పథకం ద్వారా పర్యాటకం కేవలం ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ఆధారిత రంగంగా కాకుండా ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి చెందే అవకాశముందని నిపుణులు అంటున్నారు. స్థానిక ఆహారం, కళలు, హస్తకళలు, సంప్రదాయాలు, పండుగలకు పర్యాటక మార్కెట్ కల్పించడంతోపాటు కుటుంబాలకు అదనపు ఆదాయం అందించడం ద్వారా తెలంగాణ పర్యాటక రంగంలో కొత్త మోడల్‌కు ఈ పథకం బాటలు వేయనుందని పర్యాటక రంగ మేధావులు చెప్పున్నారు.

# జీఆర్ఎంబీలో మీటింగ్‌ను బాయ్‌కాట్ చేయండి

### 7 ప్రాజెక్టుల రద్దు అంశాలను మీటింగ్‌లో తొలగించకపోతే జల ఉద్యమం చెస్తాం : కేటీఆర్

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో.. నాటి కేసీఆర్ హయంలో ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం అనుమతిచ్చిన విషయం తెలిసిందే. అయితే, ఆ 7 ప్రాజెక్టులకు ఎంతో కష్టపడి అనుమతులు సాధించిన తర్వాత ఇవాళ అనుమతులు రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పట్టుబడితే జీఆర్ఎంబీ ఎజెండాలో పెట్టారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. రేవంత్ ప్రభుత్వానికి రోషం, పౌరుషం ఉంటే ఆ మీటింగ్‌ను బాయ్ కాట్ చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. అసలు బీజేపీ సిగ్గుంటే మీరిచ్చిన అనుమతులు మీరే రద్దు చేయాలని ఎలా అడుగుతున్నారో.. ఎందుకు రద్దు చేయాలని వారిని ప్రశ్నించాలన్నారు. కేంద్ర ప్రభుత్వమే అనుమతిచ్చి కేంద్రప్రభుత్వ ఆధీనంలో ఉండే జీఆర్ఎంబీని రద్దు చేయాలని అజెండాలో పెడుతుంటే సిగ్గులేకుండా మాట్లాడటానికి బీజేపీవాళ్లకు ఏరకంగా మనసు వస్తుందో.. ఏ రకంగా నోరు వస్తుందో నాకైతే అర్థం కావడం లేదు. నీళ్లు, నిధులు, నియామకాలు.. ఆధారంగా జరిగిన తెలంగాణ ఉద్యమంలో బ్రహ్మాండంగా రాష్ట్రం సాధించామని, ఆ తర్వాత ఒక్కో నీటి బొట్టును ఒడిసి పట్టి తెలంగాణ బీడు భూములకు మలిపే ప్రయత్నం చేశామని ఆయన స్పష్టం చేశారు. ఇందులో కాళేశ్వరం, సీతారామ, పాలమూరు-రంగారెడ్డి, చనాకా-కొరాట లాంటి చిన్న ప్రాజెక్టులు చాలా ఉన్నాయి. అలాంటి అన్నీ ప్రాజెక్టులు వాటితోపాటు మిషన్ కాకతీయ ప్రాజెక్టులన్నీ చేసి తెలంగాణ నీటి వనరులకు పెద్ద ఎత్తున న్యాయం జరిగే విధంగా, నీటి వనరులను కాపాడుకునే విధంగా మేం ప్రయత్నం చేశామన్నారు. అందులో భాగంగా అనుమతులు తెచ్చాం. ఇవాళ ఆ అనుమతులన్నింటిని తుంగలో తొక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మా చెప్పు చేతల్లో కేంద్ర ప్రభుత్వం ఉందని, నేను ఆడించినట్టే ఆడాలని చంద్రబాబు అనుకుంటే తెలంగాణ తరహాలో మరో భారీ పోరాటం చేసేందుకు బీఆర్ఎస్ సిద్దంగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో బాబుకు కేటీఆర్ ఓ విజ్ఞప్తి చేశారు. కేసీఆర్‌కు ఎటువంటి బేషజాలు లేవన్నారు. నీళ్లు వాడుకుందామని ఎప్పుడో చెప్పారని, మా కడుపు కొట్టి తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేస్తామంటే ఊరుకోమని తీవ్రంగా హెచ్చరించారు. ఏపీ పోలవరం కట్టుకుంటే తామేం అనలేదు? కదా.. పట్టి సీమ నీళ్లు లిఫ్ట్ చేసుకుంటుంటే ఏం అనలేదన్నారు. కేంద్రం నా చెప్పు చేతల్లో ఉందని, మాకొచ్చిన అనుమతులను చెడగొట్టేందుకు?, తాను ఆడిచ్చినట్టు ఆడే చెంచాగాడు తెలంగాణ ముఖ్యమంత్రి ఇక్కడున్నడని అనుకుంటే తెలంగాణ రైతుల తరపున భారీ పోరాటం చేసేందుకు బీఆర్ఎస్ సిద్దంగా ఉందన్నారు. అయితే, జలసౌధలో జరిగే మీటింగ్‌ను ఈ ప్రభుత్వం బాయ్ కాట్ చేయకపోతే.. ఎజెండా మార్చి ఈ 7 ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేసే అంశాలను తొలగించకపోతే తెలంగాణలో తప్పకుండా జల ఉద్యమం నిర్మాణం చేస్తామని, అవసరమైతే ఆ రోజు జలసౌధను ముట్టడిస్తామని కేటీఆర్ హెచ్చరించారు.

# సినిమా పిచ్చోళ్లే జనసేనలోకి పోతున్నరు?

### బీజేపీ నేత రాంచందర్ రావు కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్, మనం ప్రతినిధి : కమలం నుంచి జనసేన పార్టీలోకి వెళ్లే వారిపై తెలంగాణ బీజేపీ నేత రాంచందర్ రావు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బీజేపీని వీడి జనసేన పార్టీలో చేరే వారిని ఆ పార్టీలోకి ఎందుకు వెళ్లారని ప్రశ్నిస్తే.. కేవలం తాము పవన్ కళ్యాణ్ అభిమానులం కాబట్టే వెళ్లాం అని సమాధానం చెబుతున్నారని ఆయన పేర్కొన్నారు. రాజకీయ సిద్ధాంతాలు, పార్టీ విధానాల కంటే కేవలం సినిమా హీరో పిచ్చి ఉన్నవారు, సినిమా అభిమానులైన వాళ్లు మాత్రమే జనసేన పార్టీ వైపు వెళ్తున్నారని ఆయన ఈ సందర్భంగా విశ్లేషించారు. రాజకీయాల కంటే వ్యక్తిగత అభిమానంతోనే ఆ పార్టీలోకి వలసలు జరుగుతున్నాయనే కోణంలో రాంచందర్ రావు చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

## ఎంత వెళ్లినా..

మనసు ఎంత వెనక్కి వెళ్లాలనుకున్నా
అప్పటి వాళ్ళను మళ్లీ కలవలేం
ఆ ఆనవాళ్ళను తాకలేం
ఆ ఉద్వేగాలను ఆ అద్భుత ఉదయాలను
ఆ ప్రశాంత సంధ్యా సమీరాలను
మళ్ళీ అందుకోలేం
తెరపడిన నాటకాన్ని
రెండో సారి రక్తికట్టించలేరు
తోట ప్రతిసారి
అదే పరిమళాలు వెదజల్లదు

గాలి వచ్చిన దారినుండే
మళ్ళీ మళ్ళీ రాదు
తడిసిన అన్ని నేలలకు
ఒకే వాసన రాదు
పొదలోకి వెళ్ళిన
కుందేళ్లలో నీ కంటికి చూసింది
మళ్లీ దొరకదు
ఒక సారి ఇంటి ముందు వాలిన
పిట్టలు మళ్లీ రావు

కూలిన వంతెన కట్టినా
పాతదాని అందం రాదు
తెగిన మాట కలిపినా
కనిపించని ఖాళీలు
లోపల విసిగిస్తూనే ఉంటాయి
సీతాకోకలు పాత వర్ణాలతోనే రావు
పోయిన వాటి వర్ణాలు
నీకు గుర్తుకు రావు

**- డా. సుంకర రమేశ్**
9492180764

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు**
**manamlekhalu@ gmail.com**
**మెయిల్ అడ్రస్‌కు పంపగలరు**

**ఈ పేపర్ కోసం**
**https://www.manamepaper.com/**
**వెబ్‌సైట్‌లో చూడండి- ఎడిటర్**

# యువత విలువలతో వికసించాలి



ఒక వైపు మద్యం,మాదక ద్రవ్యాలతో యువశక్తి నిర్వీర్యమైపోతున్నది. మరోవైపు యువ జనాభా పలు దేశాల్లో తగ్గుముఖం పట్టి, ఆందోళన కలిగిస్తున్నది. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో అభివృద్ధి జరగడానికి అవకాశం లేదు.

'ఎవరో వస్తారని...ఏదో చేస్తారని...ఎదురు చూసి మోసపోకుమా...నిజం మరచి నిదుర పోకుమా'... అంటూ నిద్రాణంలో ఉన్న సమాజాన్ని మేల్కొలపడానికి శ్రీశ్రీ 'భూమి' సినిమా కోసం సుమారు 52 సంవత్సరాల క్రితం రచించిన గీతం నేటికీ శ్రోతల వీనులను స్పృశిస్తున్న మాట వాస్తవం. నేటికీ మారని వ్యవస్థలో మార్పుకోసం ఈ గీతాన్ని పదే పదే వినిపించాలి. ఎవరూ ఎవరినీ ఉద్ధరించరు. మన కోసం మనమే ప్రయత్నించాలి. మనలో అంకురించిన నిర్మాణాత్మక ఆలోచనలను ఆచరణలో పెట్టి, దేశానికి ఉపయోగపడాలి. గాడాంధకారంలో వెలుతురు కోసం అన్వేషించడం కంటే, చీకట్లు కమ్ముకోకముందే,రాబోయే విపత్కర పరిణామాలను సునిశితంగా పరిశీలించి, అవరోధాలకు అడ్డుకట్టవేయడం శ్రేయస్కరం. సచ్ఛీలత, నిజాయితీ, మానవీయత మనిషి వ్యక్తిత్వాన్ని శిఖర స్థాయిలో నిలబెడుతుంది.

బతుకు దెరువు కోసమో, ఇతర స్వార్థ ప్రయోజనాల కోసమో వ్యక్తిత్వాన్ని మసకబార్చుకోవడం దురదృష్టకరం. ఇదొక రకమైన భావ దారిద్ర్యం. పరుల అడుగులకు మడుగులొత్తే సంస్కృతి మారాలి. ఆత్మాభిమానం ప్రాణం కంటే విలువైనదనే సత్యాన్ని నేటి యువతరం గ్రహించాలి. వర్షం వెలసిన తర్వాత గొడుగును అవతలికి విసిరికొట్టడం, రుచిని అస్వాదించిన తర్వాత కూరలో కరివేపాకును తీసిపారేయడం, అవసరానికో రంగు మార్చడం, అవసరానికి అక్కరకు చేరి, అవసరం తీరిన తర్వాత అధః పాతాళానికి తొక్కడం విలువల పతనానికి పరాకాష్ఠ. ఇలాంటి భావాలు మారాలి. ముఖ్యంగా యువతను ఇలాంటి పెడధోరణుల నుంచి కాపాడాలి. యువజనం నిస్వార్థంతో, ఆత్మాభిమానంతో విలువల ఆధారంగా శ్రమశక్తిని, నైపుణ్యాన్ని ఆయుధంగా చేసుకుని జీవించాలి.ప్రతిభకు మించిన ఆయుధం, వ్యక్తిత్వానికి మించిన ఆభరణం మరొకటి లేదనే సత్యం గ్రహించాలి.

నిజమైన ప్రతిభ మరుగున పడిపోతే, అది సమాజానికి శాపం. ఈ భువిపై జీవించి ఉన్నప్పుడే సక్రమమైన నడవడికతో, వ్యక్తిత్వ వికాసంతో మెలగాలి. జీవిత చరమాంకంలో పశ్చాత్తాప పడినా ఫలం శూన్యం.

వర్తమానంలో స్వార్థం పరాకాష్ఠకు చేరింది. మానవత్వ విలువలు మంటగలిసాయి. ధనార్జనకే గాని, విలువలకు పనికిరాని వ్యక్తుల వలన సమాజానికి ఒరిగేది శూన్యం.

ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలపై యువతకు అవగాహన కలిగించి, ప్రపంచ నిర్మాణం వైపు యువతను కార్యోన్ముఖులను చేయడం, యువతకు సమస్యలపై పోరాడే బాధ్యతలను అప్పగించి, ప్రత్యక్ష భాగస్వామం కల్పించడం, న్యాయ సంబంధమైన, సామాజిక,ఆర్థిక,రాజకీయ సంబంధమైన అంశాల్లో అవగాహన కల్పించడంతో పాటు ప్రపంచాన్ని పురోగమనంవైపు పయనించే టట్టు మార్గనిర్దేశనం చేసి, ప్రగతికి బాటలు వేయడమే అంతర్జాతీయ యువజన దినోత్సవం ముఖ్యోద్దేశం.

నేడు ప్రపంచం అనేకమైన సమస్యలను ఎదుర్కొంటున్నది. నిరక్షరాస్యత,నిరుద్యోగం, పేదరికం, ఆర్థిక అసమానతలు, లింగ వివక్షత వంటి సమస్యలతో పాటు ఉగ్రవాదం, మాదకద్రవ్యాల వినియోగం,అక్రమ రవాణా, హింస, శ్రమదోపిడీ, అత్యాచారాలు, అవినీతి, బాల కార్మిక వ్యవస్థ, లైంగిక హింస వంటివి మాత్రమే కాకుండా సామాన్య ప్రజలకు కావలసిన కూడు, గూడు, గుడ్డ, విద్య, ఆరోగ్యం వంటి సమస్యలు ఎన్నో ఉన్నాయి. పల్లెల్లో ఈ నాటికీ పారిశుద్ధ్య సమస్యలు, త్రాగునీటి సమస్య వంటి ఎన్నో సమస్యలు తాండవిస్తున్నాయి. చాలా దేశాలు తీవ్రవాద సమస్యతో బెంబేలెత్తి పోతున్నాయి. సామ్రాజ్యవాద శక్తులు బలహీన దేశాలను కబళించడానికి ప్రయత్నిస్తున్నాయి. పొరుగుదేశాల అవసరాలను ఆసరాగా చేసుకుని, ఇతర దేశాల్లో ఉగ్రవాదానికి సహకరిస్తున్నాయి.



అనునిత్యం ప్రజలు పేదరికంతో బ్రతక లేక నానా అవస్థలు పడుతుంటే ఇదే అదనుగా భావించి,కొన్ని దుష్టశక్తులు యువతలోని బలహీనతలను తమకు అనుకూలంగా మలచుకుని, వారిని వివిధ రకాల మాఫియా విషవలయాల్లోకి మళ్ళించడానికి ప్రయత్నాలు చేస్తున్నాయి. యువశక్తి విధ్వంసానికి వినియోగపడితే, తద్వారా సంభవించే పరిణామాలు ఊహాతీతం. ప్రపంచంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు ఎన్నో ఉన్నాయి.వీటికి తోడుగా మానవ తప్పిదాలతో సృష్టించిన కాలుష్య సమస్య, పర్యావరణం, ప్రకృతి విధ్వంసం, ప్లాస్టిక్ సమస్య, గ్లోబల్ వార్మింగ్ వంటి ఎన్నో సమస్యలు ఉన్నాయి. 1991 వ సంవత్సరం ఆస్ట్రేలియా రాజధాని వియన్నా లో నిర్వహించిన వరల్ యూత్ ఫోరంలో పెద్ద ఎత్తున పాల్గొన్న యువత తమ కోసం ప్రతీ ఏటా అంతర్జాతీయ యువదినోత్సవం జరపాలని అభ్యర్థించింది. 1998లో యువదినోత్సవంపై ప్రకటన వెలువడడం, 1999లో ఐక్యరాజ్య సమితి ఒక తీర్మానాన్ని ఆమోదించింది.2020 వ సంవత్సరం నుండి అధికారికంగా ప్రతీ ఏటా ఆగస్టు 12.వ తేదీని అంతర్జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకోవడం రెండు దశాబ్దాలుగా జరుగుతున్నది.ప్రపంచం ఎదుర్కొంటున్న పెనుసవాళ్ళను పరిష్కరించి, స్థానికంగాను,జాతీయంగాను,అంతర్జాతీయం గాను, యువతను ప్రభావితం చేసి,చైతన్యం నింపి,వారి ప్రాధాన్యత ను పెంచి,యువతను అయా సమస్యల పోరాటంలో ప్రత్యక్షంగా భాగస్వాములను చేయడానికి ఐ,రా.స నిర్ణయించింది. ప్రపంచ వ్యాప్తంగా యువత సమస్యలను పరిష్కరించి, యువత ద్వారా నూతన ప్రపంచ నిర్మాణానికి ఐ.రా.స ఒక కార్యాచరణ ప్రణాళిక ప్రకటించింది. ప్రపంచం భౌగోళికంగా వివిధ ఖండాలుగా,వివిధ దేశాలుగా విడిపోయినప్పటికీ ప్రజలందరిదీ ఒకే జాతి. అదే మానవ జాతి. మానవులంతా స్వేచ్ఛా,సౌభ్రాతృత్వాలతో కలసి మెలసి జీవించాలి. ఈ సత్కార్య సాధనలో యువత పాత్ర అత్యంత కీలకం. ఎక్కడ యువత అన్నిరంగాల్లో నైపుణ్యత ప్రదర్శించి, తలెత్తుకుని జీవిస్తుందో అక్కడ అభివృద్ధి తాండవిస్తుంది. ఎక్కడ యువత బాధ్యతా రహితంగా ప్రవర్తిస్తూ, నిస్తేజమౌతుందో అక్కడ అభివృద్ధికి స్థానం ఉండదు.

**(ఆగష్టు12, అంతర్జాతీయ యువ జన దినోత్సవం)**

**- సుంకవల్లి సత్తిరాజు**
9704903463

# గ్రంథపాలకుడికి స్ఫూర్తి ఎస్. ఆర్. రంగనాథన్



జ్ఞానానికి దారి చూపిన మహర్షి - ప్రతి గ్రంథపాలకుడికి స్ఫూర్తి పుస్తకాలు మాట్లాడవు... కానీ వాటిని మనిషి జీవితాన్ని మార్చేలా మాట్లాడించగల వ్యక్తి గ్రంథపాలకుడు. ఈ భావనను తన జీవితమంతా ఆచరణలో చూపించి, గ్రంథాలయాన్ని కేవలం పుస్తకాల నిల్వగదిగా కాకుండా సమాజ వికాసానికి కేంద్రబిందువుగా మార్చిన మహనీయుడు డాక్టర్ షియాలి రామం అమృత రంగనాథన్.

1892 ఆగస్టు 12న తమిళనాడులోని షియాలి (ప్రస్తుత మయిలాడుతురై)లో జన్మించిన రంగనాథన్ చిన్ననాటి నుంచే చదువుపట్ల అసాధారణ ఆసక్తి కనబరిచారు. గణితశాస్త్రంలో ఉన్నత విద్యను అభ్యసించి కొంతకాలం అధ్యాపకుడిగా పనిచేశారు. అయితే విధి ఆయనను మరో మహోన్నత మార్గంలో నడిపించింది. 1924లో మద్రాస్ విశ్వవిద్యాలయ గ్రంథపాలకుడిగా నియమితులైన తరువాత ఆయన జీవితమే మారిపోయింది. అప్పటి వరకు గ్రంథాలయాలు పుస్తకాలను భద్రపరిచే గదులుగా మాత్రమే ఉండేవి. కానీ రంగనాథన్ దృష్టిలో గ్రంథాలయం అనేది జ్ఞానాన్ని ప్రజలకు చేరవేసే సజీవ వ్యవస.

గ్రంథాలయ శాస్త్రానికి కొత్త దిశ డాక్టర్ రంగనాథన్ పేరు వినగానే ప్రపంచవ్యాప్తంగా గుర్తుకొచ్చేది ఆయన ప్రతిపాదించిన గంథాలయ శాస్త్రంలోని ఐదు సూత్రాలు.. పుస్తకాలు ఉపయోగించడానికే, ప్రతి పాఠకుడికి అతనికి అవసరమైన పుస్తకం లభించాలి, ప్రతి పుస్తకానికి దానిని చదివే పాఠకుడు ఉండాలి. పాఠకుని సమయాన్ని ఆదా చేయాలి. గ్రంథాలయం నిరంతరం అభివృద్ధి చెందే జీవి.

ఈ ఐదు సూత్రాలు నేటికీ ప్రపంచవ్యాప్తంగా అన్ని రకాల గ్రంథాలయాల నిర్వహణకు మార్గదర్శకాలుగా నిలిచాయి. డిజిటల్ యుగం లోనూ వాటి ప్రాముఖ్యత ఏమాత్రం తగ్గలేదు. ఒక శతాబ్దం క్రితం ఆయన చెప్పిన ఈ భావనలు నేడు కృత్రిమ మేధస్సు, డిజిటల్ గ్రంథాలయాల యుగంలో కూడా సమానంగా వర్తిస్తుండటం ఆయన దూరదృష్టికి నిదర్శనం.

గ్రంథాలయ శాస్త్రంలో డాక్టర్ రంగనాథన్ చేసిన అత్యంత గొప్ప ఆవిష్కరణ కాలన్ క్లాసిఫికేషన్ (Colon Classification). సంప్రదాయ వర్గీకరణ పద్ధతుల పరిమితులను అధిగమిస్తూ, విజ్ఞానాన్ని మరింత శాస్త్రీయంగా వర్గీకరించే ఈ విధానాన్ని ఆయన రూపొందించారు. ప్రపంచంలోని అనేక గ్రంథాలయాలు ఈ పద్ధతిని అనుసరించాయి.

డాక్టర్ రంగనాథన్ ఒక గొప్ప సిద్ధాంతకర్త మాత్రమే కాదు. అద్భుత రచయిత కూడా. ఆయన జీవితకాలంలో 60కు పైగా గ్రంథాలు, దాదాపు 2,000కు పైగా పరిశోధనా వ్యాసాలు రచించారు. ఆయన ప్రసిద్ధ గ్రంథాలలో కొన్ని.. ఫైవ్ లా సు ఆఫ్ లైబ్రరీ సైన్స్, లైబ్రరీ అడ్మినిస్ట్రేషన్, రిఫరెన్స్ సర్వీస్, ప్రొలొగామిన టు లైబ్రరీ క్లాసిఫికేషన్.. ఈ రచనలు నేటికీ ప్రపంచవ్యాప్తంగా




గ్రంథాలయ శాస్త్ర విద్యార్థులకు ప్రామాణిక గ్రంథాలుగా ఉపయోగపడుతున్నాయి.

డాక్టర్ రంగనాథన్ గారి ప్రతిభకు భారతదేశ సరిహద్దులు సరిపోలేదు. ఆయన 1948లో యూరప్ మరియు అమెరికా దేశాల్లో పర్యటించి, అక్కడి గ్రంథాలయ వ్యవస్థలను అధ్యయనం చేశారు. ఆ పర్యటన అనుభవాలను Library Tour, 1948: Europe and America అనే గ్రంథంగా రూపొందించారు. ఆయన అంతర్జాతీయ గ్రంథాలయ సమావేశాల్లో పాల్గొని, భారతదేశపు గ్రంథాలయ శాస్త్రాన్ని ప్రపంచానికి పరిచయం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఆయన ప్రసంగాలు, ఉపన్యాసాలు గ్రంథాలయ రంగంలో ఒక మైలురాయిగా నిలిచిపోయాయి. ఆయన ప్రతిపాదించిన ఐదు సూత్రాలు, కాలన్ వర్గీకరణ పద్ధతి ప్రపంచవ్యాప్తంగా గ్రంథాలయాల్లో ఆదరణ పొందాయి.

డాక్టర్ రంగనాథన్ గారి సేవా జీవితం వివిధ ప్రతిష్ఠాత్మక సంస్థల్లో ప్రకాశించింది. మద్రాస్ విశ్వవిద్యాలయం (1924-1945). మొదటి గ్రంథపాలకుడిగా 20 ఏళ్లపాటు సేవలందించి, ఆ గ్రంథాలయాన్ని ఒక ఆదర్శ విద్యాసంస్థగా తీర్చిదిద్దారు. బనారస్ హిందూ విశ్వవిద్యాలయం (1945-1947)..గ్రంథపాలకుడిగా, గ్రంథాలయ శాస్త్ర ఆచార్యుడిగా పనిచేశారు. ఢిల్లీ విశ్వవిద్యాలయం (1947-1955), గ్రంథాలయ శాస్త్ర ఆచార్యుడిగా, భారతదేశంలోనే మొట్టమొదటి ఉన్నత విద్యను అందించే గ్రంథాలయ శాస్త్ర పాఠశాలకు మార్గదర్శకత్వం వహించారు. డాక్యుమెంటేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సెంటర్ (DRTC), బెంగళూరు (1962), ఆయన కృషి ఫలితంగా ఏర్పడిన ఈ సంస్థ నేటికీ డాక్యుమెంటేషన్ రంగంలో అగ్రగామిగా నిలిచింది.

డాక్టర్ రంగనాథన్ గారు కేవలం ఒక గ్రంథపాలకుడు మాత్రమే కాదు. ఒక సంఘటనా నిర్మాత. ఆయన స్థాపించిన సంస్థలు నేటికీ గ్రంథాలయ ఉద్యమానికి ఊపిరిగా నిలుస్తున్నాయి. మద్రాస్ లైబ్రరీ అసోసియేషన్ (MaLA) - 1928 జనవరి 31. ఇది భారతదేశంలోని తొట్టతొలి గ్రంథాలయ సంఘాల్లో ఒకటి. ఇది గ్రంథాలయ ఉద్యమానికి సజీవ చిహ్నంగా మారింది.

ఇండియన్ లైబ్రరీ అసోసియేషన్ (ILA) - 1933: ఆయన ఈ సంస్థకు 1944 నుండి 1953 వరకు అధ్యక్షుడిగా పనిచేశారు. ఢిల్లీ విశ్వవిద్యాలయంలో గ్రంథాలయ శాస్త్ర విభాగం-1946. ఇది భారత దేశంలోనే తొట్టతొట్టి గ్రంథాలయ శాస్త్ర విభాగం.

డాక్టర్ రంగనాథన్ సేవలను ప్రపంచం గుర్తించింది. ఆయన ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఫర్ ఇన్ఫర్మేషన్ అండ్ డాక్యుమెంటేషన్ (FID)కి గౌరవ సభ్యులుగా ఎన్నికయ్యారు. లైబ్రరీ అసోసియేషన్ ఆఫ్ గ్రేట్ బ్రిటన్‌కి ఆజీవం ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. పిట్స్‌బర్గ్ విశ్వవిద్యాలయం 1964లో ఆయనకు D. Litt. గౌరవ డిగ్రీని ప్రదానం చేసింది. 1965లో భారత ప్రభుత్వం ఆయనను జాతీయ పరిశోధనా ఆచార్యుడిగా (National Research Professor) నియమించి సత్కరించింది.

గ్రంథాలయ రంగానికి ఆయన చేసిన అసాధారణ సేవలకు భారత ప్రభుత్వం 1957లో 'పద్మశ్రీ' పురస్కారంతో సత్కరించింది. ఆయన స్మృతిగా 1992లో భారత ప్రభుత్వం ఆయన పేరుతో ఒక తపాలా బిళ్ళను విడుదల చేసింది.

డాక్టర్ రంగనాథన్ గ్రంథాలయాలను నగరాలకు మాత్రమే పరిమితం చేయలేదు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కూడా గ్రంథాలయ సేవలు అందాలనే లక్ష్యంతో జీవితాంతం కృషి చేశారు. ప్రతి గ్రామంలో ఒక గ్రంథాలయం ఉండాలి అనే ఆయన ఆలోచన దేశవ్యాప్తంగా ప్రజా గ్రంథాలయ ఉద్యమానికి ఊపిరి పోసింది.

ప్రతి సంవత్సరం ఆగస్టు 12న దేశవ్యాప్తంగా జాతీయ గ్రంథపాలకుల దినోత్సవాన్ని జరుపుకోవడం వెనుక ఒక గొప్ప సందేశం ఉంది. అది కేవలం ఒక మహనీయుడి జన్మదినాన్ని గుర్తుచేసుకోవడం కాదు. జ్ఞానాన్ని సమాజానికి చేరవేసే ప్రతి గ్రంథపాలకుడి సేవలను గౌరవించడం.

డాక్టర్ ఎస్. ఆర్. రంగనాథన్ ఒక వ్యక్తి కాదు. ఒక ఆలోచన. ఆయన నిర్మించిన సూత్రాలు, రచించిన గ్రంథాలు, వెలిగించిన జ్ఞాన దీపాలు, స్థాపించిన సంస్థలు, శాసించిన సంఘాలు - ఇవన్నీ నేటికీ లక్షలాది గ్రంథపాలకుల చేతుల్లో వెలుగుతున్నాయి. ప్రపంచం ఎంతగా మారినా, సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా, జ్ఞానాన్ని మనిషి చేతుల్లోకి చేర్చాలనే ఆయన తపన శాశ్వత సత్యంగా నిలిచిపోతుంది. 'ఒక మంచి గ్రంథపాలకుడు వేలాది గురువుల సేవను ఒకేచోట అందించగలడు' అనే భావనకు డాక్టర్ రంగనాథన్ జీవితం సజీవ సాక్ష్యం. ఆయన కలలు కన్న గ్రంథాలయాలు జ్ఞాన ఆలయాలుగా వికసిస్తూ ఉండటం, ఆయనకు మనం అందించే నిజమైన నివాళి.

**(ఆగస్టు 12న గ్రంథాలయ శాస్త్ర పితామహుడు డా. ఎస్. ఆర్. రంగనాథన్ జన్మదినం)**

**- రవికుమార్ చేగోని**

# చేతిరాతతోనే ఉజ్వల భవిష్యత్తు



కుదురుగా, అందంగా చేతిరాత రాయడం ఓ అద్భుత కళ. విలక్షణమైన చేతిరాత ఒక కళాత్మక వ్యక్తీకరణగా, అందమైన అక్షరాల పొందికను వివరించే విజ్ఞానాన్ని కాలిగ్రఫీ లేదా చేతిరాత అని పిలుస్తున్నాం. చేతిరాత పట్ల అవగాహన పెంచడానికి కార్యశాలలు, ఆన్‌లైన్ కార్యక్రమాలు, కొత్త రాతలను నేర్చుకోవడం, అందమైన రాత కోసం సాధన చేయడం కొనసాగాలి. సాధారణంగా మంచి చేతిరాతతో పునాది పాఠశాల స్థాయిలోనే జరుగుతుంది. కుదురుగా అక్షరాలు రాయడానికి పాఠశాల స్థాయిలో డబుల్‌రోల్ నోట్ బుక్స్‌లో రాయడం నేర్పిస్తారు.

కాలిగ్రఫీ నైపుణ్యం పట్ల ప్రాధాన్యాన్ని అవగాహన పరచడం, చేతిరాతను మెరుగు పరుచుకోవడం, అందమైన చేతిరాత పట్ల ఆసక్తిని కనబరచడం లాంటి ముఖ్యమైన అంశాలను చర్చించే వేదికగా ప్రతి ఏటా ఆగష్టు 2వ బుధవారం రోజు, అనగా 12 ఆగష్టున ప్రపంచ కాలిగ్రఫీ దినోత్సవం పాటించడం ఒక ఆచారంగా వస్తున్నది. 2017లో 'మ్యాన్యుస్క్రిప్ట్స్ పెన్ కంపెనీ ప్రారంభించిన ప్రపంచ కాలిగ్రఫీ రోజు, ముఖ్యంగా విద్యాలయాల్లో అందమైన చేతిరాత పోటీలను నిర్వహించడం జరుగుతుంది. చేతిరాత ప్రక్రియలో నైపుణ్యాన్ని, సృజనాత్మకతను ప్రశంసించడం ఒక మంచి సాంప్రదాయం. అది ఒక ప్రత్యేక నైపుణ్యం అని గుర్తించాలి.

కాలిగ్రఫీ అంటే కేవలం అందంగా రాయడం మాత్రమే కాదు. దీని వల్ల ఏకాగ్రత, మనసుకు ప్రశాంతత, జ్ఞాపకశక్తి, మెదడు చురుకుదనం, సృజనశీలత, క్రమశిక్షణ పెరగడం జరుగుతుంది. అందమైన లిపి చదివితే తేలికగా అర్థం అవుతుంది. కుదురుగా రాయడం వల్ల మనకు మంచి గుర్తింపు వస్తుంది. చేతిరాతను బట్టి మన వ్యక్తిత్వాన్ని సహితం అంచనా వేస్తారు. అందమైన చేతిరాతతో పరీక్షల్లో ఉత్తమ మార్కులు పొందవచ్చు. మనం సరైన సమాధానం రాసినప్పటికీ చెడు చేతిరాత వల్ల రావలసినన్ని మార్కులు రాక పోవచ్చు. మన చేతిరాత కూడా మన విద్యా భ్యాసంలో కీలక పాత్రను పోషిస్తున్నది. మంచి చేతిరాత ఉన్న విద్యార్థుల పేపర్లను ఉపాధ్యాయుడు ఆసక్తిగా చదివి మంచి మార్కులు లేదా గ్రేడ్స్ వేస్తారు. చేతిరాతను మెరుగుపరచడానికి చిన్నతనంలోనే




ప్రత్యేక శిక్షణను ఇప్పించాలి. అక్షరాలు సరైన పరిమాణంలో అందంగా రాయడం, పదానికి పదానికి మధ్య గ్యాప్ వదలడం, మార్జిన్ ఇవ్వడం, ఒకే లైన్‌లో రాయడం లాంటి జాగ్రత్తలు తీసు కోవాలి.

అందంగా చేతిరాత రాయడంలో మనం కూర్చునే విధానం కూడా ప్రభావితం చేస్తుంది. వెన్నెముక నిటారుగా ఉండేలా కూర్చొని, కాళ్లు నేలకు ఆనించి రాయడం వల్ల చేతిపై ఒత్తిడి తగ్గి అక్షరాలు కుదురుగా రాయడానికి ఉపకరిస్తుంది. పెన్ను పట్టుకునే విధానం కూడా కాలిగ్రఫీలో ముఖ్యం అని గమనించాలి. చూపుడు వేలు, బొటన వేలు మధ్య పెన్నును పట్టుకోవాలి. పెన్నులను గట్టిగా పట్టుకోవద్దు. మనం రాసే అక్షరాల సైజ కూడా చేతిరాతను నిర్ణయిస్తుంది. పేజీకి నాలుగు వైపులా మార్జిన్ తీసుకోవడం, మరో చిన్నగా లేదా మరో పెద్దగా అక్షరాలు రాయవద్దు. అభ్యాసం వల్ల చేతిరాత సులభంగా మెరుగుపడుతుంది. చేతి గీతాలు బాగుంటే మన భవిష్యత్తు బాగున్నట్లే, చేతిరాత బాగుంటే ఊహించిన దాని కన్న అధిక మార్కులు వస్తాయి. చేతిరాత బాగా రాసేవారి ఆత్మవిశ్వాసం అధికంగా ఉంటుంది. చదువుతో పాటు చేతిరాతతో కూడా ప్రాధాన్యం ఇవ్వాలి. చేతిరాత స్పష్టత కోల్పోతే సరైన సమాధానమే అయినప్పటికీ మంచి మార్కులు రావని తెలుసుకోవాలి. చేతిరాత మెరుగుపరుచుకోవడానికి సమయం కేటాయించి ప్రత్యేక శిక్షణ, అభ్యాసం పొందాలి

**(12 ఆగష్టు ప్రపంచ కాలిగ్రఫీ దినోత్సవం)**

**- డా. బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

# ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గుతున్న విద్యార్థులు

ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాల అంటే గ్రామానికి గుండె. అక్కడి నుంచే డాక్టర్లు, ఇంజినీర్లు, కలెక్టర్లు, ఉపాధ్యాయులు తయారయ్యారు. కానీ నేడు ఆ గుండె చప్పుడు నెమ్మదిస్తోంది. క్లాస్రూమ్లు ఖాళీ అవుతున్నాయి. విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. ఇది కేవలం గణాంకాల సమస్య కాదు. ఇది భవిష్యత్తుకు సంబంధించిన ప్రశ్న. తల్లిదండ్రుల ఆకాంక్ష సహజం. తమ పిల్లలకు మెరుగైన ఆంగ్ల మాధ్యమం, డిజిటల్ సౌకర్యాలు, క్రమశిక్షణ, పోటీ పరీక్షల శిక్షణ కావాలని కోరుకుంటున్నారు. ఆ కారణంగానే ప్రైవేట్ పాఠశాలల వైపు అడుగులు వేస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు తగ్గి, ఉపాధ్యాయుల బదిలీలు, పాఠశాలల విలీనం, మూసివేత వంటి పరిస్థితులు వస్తున్నాయి. గత కొన్నేళ్లుగా ప్రభుత్వం డిజిటల్ తరగతులు, ఇంగ్లీష్ మీడియం, ఉచిత పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫాం, స్కాలర్‌షిప్‌లు వంటి పథకాలతో ప్రభుత్వ పాఠశాలల ముఖచిత్రాన్ని మారుస్తోంది. చాలా పాఠశాలల్లో ఇప్పుడు స్మార్ట్ టీవీలు, ల్యాబ్‌లు, ఆటస్థలాలు కూడా ఉన్నాయి. సమస్యలు ఉన్నా, మార్పు కూడా కనిపిస్తోంది. విద్య అనేది వ్యాపా రమా లేక హక్కా? ప్రభుత్వ పాఠశాలలు మూతపడితే నష్టపోయేది ఎవరు? పేద, మధ్యతరగతి కుటుం బాల పిల్లలే. ఫీజు కట్టలేని కారణంగా లక్షల మంది చదువుకు దూరమయ్యే ప్రమాదం ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో వస్తున్న మంచి ఫలితాలను, సౌకర్యాలను ప్రతి గ్రామంలో ప్రచారం చేయాలి. తల్లిదండ్రుల్లో విశ్వాసం పెంచాలి. గుణాత్మక విద్య ఉపాధ్యాయులకు నిరంతర శిక్షణ, పాఠ్యప్రణాళికలో ఆధునికత, ఫలితాల బాధ్యత తప్పనిసరి. సౌకర్యాల కల్పన ప్రతి పాఠశాలలో కనీస మౌలిక సదుపాయాలు, మరుగుదొడ్లు, తాగునీరు, లైబ్రరీ, ఇంటర్నెట్. సమాజ భాగస్వామ్యం, పూర్వ విద్యార్థులు, స్థానిక సంస్థలు, CSR నిధులు పాఠశాలల అభివృద్ధికి వాడాలి. ప్రభుత్వ పాఠశాలల బలహీనత ప్రభుత్వానిది మాత్రమే కాదు. అది మొత్తం సమాజం



యొక్క బాధ్యత. ఈ రోజు మనం పట్టించుకోకపోతే, రేపు సమాన అవకాశాల తలుపులు మూసుకుపోతాయి. విద్యార్థుల సంఖ్య తగ్గడం అనేది విద్యా వ్యవస్థకు ఇస్తున్న చివరి హెచ్చరిక. దీన్ని అవకాశంగా మార్చుకుని, ప్రభుత్వ పాఠశాలలను మళ్లీ గౌరవంగా, గర్వంగా చెప్పుకునే స్థాయికి తీసుకురావాల్సిన సమయం ఇది.

**- ఉక్కల్ కర్ రాజేందర్ నాథ్**
9440287170

## రాజభవనాల... ప్రపంచం

రాజభవనాల,సింహాసనాల,కిరీటాల
ఈ ప్రపంచం,
మనిషికి బద్ధశత్రువైన సమాజాల ఈ ప్రపంచం,
సంపదకై ఎంతో ఆకలిగొన్న
ఆచారమయప్రపంచం,
ఈ ప్రపంచ మొకవేళ నా కధీనమైనా ఏముందీ?

ప్రతిదేహం క్షతగాత్రం,
ప్రతి ఆత్మా దాహపరితప్తం,
చూసేచూపుల్లో సందిగ్ధతా,హృదయాల్లో విషాదం,
ఇది ప్రపంచమా లేక భయాయోమయ లోకమా?
ఈ ప్రపంచ మొకవేళ నా కధీనమైనా ఏముందీ?

ఇక్కడ- మనిషి ఉనికి కేవలం ఒక బొమ్మ,
ఈ బస్తీ- శవారాధకులు తిరుగాడే వాడల బస్తీ,
ఇక్కడ- బ్రతుకు కన్నా చావే చాలా చాలా చౌక,
ఈ ప్రపంచ మొకవేళ నా కధీనమైనా ఏముందీ?

యువత- చెడుదారుల్లో తిరుగుతూ ఉంటుంది,
యవ్వనం-తానే విపణివీధై ముస్తాబౌతుంటుంది,
ఇక్కడ- ప్రేమ వ్యాపారమై జీవిస్తూ ఉంటుంది,
ఈ ప్రపంచ మొకవేళ నా కధీనమైనా ఏముందీ?

ఎక్కడ మనిషికి ఏ విలువా లేదో
ఆ ప్రపంచ మిది,
విశ్వాస మేమీ ఉండదు, స్నేహమూ
ఏమీ ఉండదు,
ప్రేమకు కనీసగౌరవం లేనటువంటి
ప్రపంచ మిది,
ఈ ప్రపంచ మొకవేళ నా కధీనమైనా ఏముందీ?
ఇటువంటి ప్రపంచాన్ని
కాల్చేయ్,బూడిదచేసేయ్,
ఈ ప్రపంచాన్ని నా ముందు కనిపించనీయకు,
ఈ ప్రపంచం నీదే,నీవే నీవే సంబాళించుకో,
ఈ ప్రపంచ మొకవేళ నా కధీనమైనా ఏముందీ?

**హిందీమూలం**
సాహిర్ లుధియాన్వీ
**స్వేచ్ఛానువాదం**
**- 'రఘువర్మ'**
9290093933

# అఖిలాండ శక్తి స్వరూపిణులు కొలువుదీరడం ప్రజల అదృష్టం

- ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**వేములవాడ,ఆగస్టు11(మనం న్యూస్):**ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని వేములవాడ పట్టణంలోని శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయంలో బోనాల జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి.ప్రతినిత్యం అమ్మవార్ల ఆరాధనలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక సందడితో అలరిస్తుంది.ఈ సందర్భంగా మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయంలో కొలువుదీరిన శ్రీ ఉజ్జయిని మహంకాళి,శ్రీ ప్రత్యంగిరా,శ్రీ భగలాముఖి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి అమ్మవార్ల ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఆషాఢ మాసం ప్రజలందరికీ పవిత్రమైన మాసమని పేర్కొన్నారు.బోనాల జాతర మహోత్సవాలలో అమ్మవార్లను దర్శించుకోవడం తాను చేసుకున్న పుణ్యమన్నారు.ఆలయంలో శ్రీ ఉజ్జయిని మహంకాళి,శ్రీ ప్రత్యంగిరా,శ్రీ భగలాముఖి అమ్మవార్లు ఒకే చోట కొలువుదీరి భక్తులకు దర్శనమివ్వడం వేములవాడ ప్రజల అదృష్టమని తెలియజేశారు.అఖిలాండ శక్తి స్వరూపిణులైన అమ్మవార్ల కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.అమ్మవార్ల దయతో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు సుభిక్షంగా ఉండాలని,రైతులు సంతోషంగా ఉండాలని కోరుకున్నారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవార్లను ప్రార్థించినట్లు తెలిపారు.ఆషాఢ మాసం పురస్కరించుకొని ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బోనాల జాతర మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్న ఆలయ కమిటీని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించారు.ముఖ్యంగా ఆలయ కమిటీ చైర్మన్ మహంకాళి శ్రీనివాస్ గౌడ్ను ప్రత్యేకంగా అభినందిస్తూ,ఆలయ అభివృద్ధి,భక్తుల సౌకర్యాల కల్పనలో కమిటీ చేస్తున్న కృషిని ప్రశంసించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ను శాలువాతో ఘనంగా సత్కరించారు.అనంతరం అమ్మవార్ల చిత్రపటాన్ని ఆయనకు అందజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు,మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు,కౌన్సిలర్ తుమ్ మధు,కౌన్సిలర్లు తోట రాజు,కొండ శేఖర్,అన్నారం శ్రీనివాస్,కుమ్మరి శ్రీనివాస్,కాంగ్రెస్ నాయకులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్,నాగుల విష్ణు ప్రసాద్, పాత సత్యలక్ష్మి, బైరి సతీష్ ముదిరాజ్ లతో పాటు ఆలయ కమిటీ సభ్యులు కందుల క్రాంతి కుమార్,భివండి శ్రీనివాస్,నరేష్ ,మైలారం రాము తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాల భక్త మార్కండేయ ఆలయంలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమి



**జగిత్యాల ఆగస్టు 11 (మనం న్యూస్):** జగిత్యాల పట్టణంలోని అంగడి బజార్ లో గల శ్రీ భక్త మార్కండేయ ఆలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఐదు లక్షల రూపాయల నిధులతో అభివృద్ధి పనులను జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ భూమి పూజ చేసి ప్రారంభించారు. అంతకుముందు ఆలయంలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ కాటిపెల్లి గంగారెడ్డి ఏఎంసి చైర్మన్ గడ్డం నారాయణ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ అడువల జ్యోతి లక్ష్మణ్, గిరి నాగభూషణం, టిపిసిసి సెక్రటరీ బండ శంకర్ ,కో ఆప్షన్ సభ్యులు గట్టు సతీష్ ,వీరబత్తిని శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు కొత్త మోహన్, కౌన్సిలర్ లు పవిత్ర మహేష్, సాయి కిరణ్ వేముల శ్రీనివాస్, అధ్యక్షులు భోగ గంగాధర్, కార్యవర్గ సభ్యులు, సంఘం సభ్యులు ,నాయకులు క్యాదాసు నాగయ్య, నక్కల రవీందర్ రెడ్డి,వినోద్, కుసరి అనిల్ ,దూమాల రాజ్ కుమార్, మహేందర్, శ్రవణ్,పంబాల రాము,కూతురు శేఖర్,దాసరి ప్రవీణ్, అల్లే గంగ సాగర్, డి ఈ మిలింద్, ఏఈ విజయ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్‌ను యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేయాలి

- మిల్లింగ్, రవాణా, గిడ్డంగులలో ఉన్న సమస్యలను తొలగించాలి
- కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కోడిపల్లి గోపాల్ రెడ్డి



**జగిత్యాల, ఆగస్టు 11(మనం న్యూస్):** జగిత్యాల జిల్లా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో పెండింగ్లో ఉన్న సీఎంఆర్ ను యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేయాలని, మిల్లింగ్, రవాణా, గిడ్డంగులలో ఉన్న సమస్యలను తొలగించాలని కోరుతూ కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కోడిపల్లి గోపాల్ రెడ్డి, బిజెపి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు తిరుపతిరెడ్డి ల ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్. లత కు వినతి పత్రం సమర్పించారు ఈ సందర్భంగా కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కోడిపల్లి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు వరి పంట ఎక్కువ పండించారు..దానిని పెద్ద మొత్తంలో ప్రభుత్వం కొనుగోలు చేసింది..అయితే కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి (సి ఎం ఆర్) భారత ఆహార సంస్థ నిర్దిష్టమైన గడువు లోపల పంపించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం పై ఉంది..అయితే గత మూడు సంవత్సరాల కాలంలో భారత ఆహార సంస్థకు సరఫరా చేయాల్సిన సిఎంఆర్ లక్ష్యం పూర్తిగా చేరలేదు.. కావున ఇప్పటివరకు సరఫరా చేసిన ధాన్యం ఎంత..? ఇంకా రాష్ట్ర ప్రభుత్వ గిడ్డంగులలో పెండింగ్లో ఉన్న ధాన్యం నిల్వలు ఎన్ని..? పెండింగ్లో ఉన్న సీఎంఆర్ ను యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేయడానికి తగిన ఏర్పాట్లు చేయాలని, మిల్లింగ్, రవాణా, గిడ్డంగులలో ఉన్న సమస్యలను తొలగించాలని. కస్టర్డ్ మిల్లింగ్ రైస్ కేంద్ర ప్రభుత్వానికి చేరవేయడంలో జరుగుతున్న జాప్యం వలన రాష్ట్ర ప్రభుత్వంపై అదనకు ఆర్థిక భారం పడుతున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన శ్వేతా పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు తిరుపతి రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 58 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని గత మూడు సంవత్సరాల నుండి ఎఫ్ సి ఐ కి బకాయిగా ఉన్నారని మిల్లర్ల నుండి వెంటనే బియ్యాన్ని సేకరించి ఎఫ్ సి ఐ కి ఇవ్వాలని తాలు, తప్ప పేరుతో రైతుల పొట్ట కొడుతున్నారని వీటన్నిటిపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో బిజెపి జగిత్యాల పట్టణ అధ్యక్షులు కొక్కు గంగాధర్, కోరుట్ల రూరల్ అధ్యక్షులు పంచరీ విజయ్, బిజెపి ప్రధాన కార్యదర్శి ఆముద రాజు, విట్టల్, రాజేందర్ రెడ్డి, కోరుట్ల మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు రాజు, పట్టణ కిసాన్ మోర్చా అధ్యక్షులు మామిడి మల్లేశం, మరియు భారతీయ జనతా పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు

## కళాకారుల బోనాల జాతరలో పాల్గొన్న మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్



**జగిత్యాల, ఆగస్టు 11(మనం ప్రతినిధి):** జగిత్యాల జిల్లా యూట్యూబర్స్ మరియు కళాకారుల ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల జాతరలో మాజీ మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె అమ్మవారికి బోనాలు ఎత్తుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బోనాల ఊరేగింపులో పాల్గొని భక్తులతో కలిసి సందడి చేశారు. ఈ సందర్భంగా అడువాల జ్యోతి లక్ష్మణ్ మాట్లాడుతూ, జగిత్యాలలో మొట్టమొ దటిసారిగా తెలంగాణ జగిత్యాల జిల్లా యూట్యూబర్స్, కళాకారుల ఆధ్వర్యంలో బోనాల జాతర నిర్వహించడం అభినందనీయమన్నారు. బోనాలు తెలంగాణ ప్రజలకు కేవలం ఒక పండుగ మాత్రమే కాదని, అది మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలతో ముడిపడిన ఒక ఎమోషన్ అని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, జానపద కళలను భావితరాలకు అందించడంలో యూట్యూబర్స్, కళాకారులు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు దయ్యాల చంద్రకళ శంకర్, మానపూరి పవిత్ర మహేష్, మరియు యూట్యూబర్స్, కళాకారులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బెజవాడ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్



**జగిత్యాల ఆగస్టు 11(మనం న్యూస్):**విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గ అమ్మవారిని జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో జగిత్యాల పట్టణ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, పట్టణం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ప్రజల సంక్షేమం, పట్టణ అభివృద్ధి కోసం మరింత శక్తితో పనిచేసేలా అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ప్రార్థించినట్లు చైర్పర్సన్ తెలిపారు.

# ప్రధాని, కేంద్ర మంత్రిపై వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

- ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వ్యాఖ్యలపై మండిపాటు
- అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేత



**వేములవాడ, ఆగస్టు11(మనం న్యూస్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్లపై ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చేసిన బాధ్యతారాహిత్య వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలని వేములవాడ పట్టణ భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ డిమాండ్ చేశారు.నియోజకవర్గంలో రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాలని, ఎమ్మెల్యే వైఖరిని నిరసిస్తూ పట్టణ బిజెపి ఆధ్వర్యంలో బిజెపి నాయకులు, శ్రేణులతో కలిసి వేములవాడలోని అంబేడ్కర్ విగ్రహానికి మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాపల్లి శ్రీధర్ విలేకరులతో మాట్లాడుతూ మీ ప్రధాని అంటూ ఎమ్మెల్యే మాట్లాడటం ఆయన బాధ్యతారాహిత్యానికి, నిలకడలేని రాజకీయాలకు అద్దం పడుతోందన్నారు. దేశ ప్రధాని ఏ ఒక్క పార్టీకో పరిమితం కాదని, ప్రపంచ దేశాలన్నీ గర్వించే మహోన్నత నాయకుడని స్పష్టం చేశారు. స్వార్థ రాజకీయాలు, మంత్రి పదవి ఆశతోనే ఎమ్మెల్యే ఈ విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘిస్తూ మాట్లాడుతున్నారని, అసెంబ్లీ సమావేశాల్లో బిజెపి ఎమ్మెల్యేలందరూ స్పీకర్కు ఆయనపై అధికారికంగా ఫిర్యాదు చేయడానికి సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు. ఎమ్మెల్యే పదవికి ఆది శ్రీనివాస్ అనర్హుడని, ఆయనను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ ఎంపీగా, కేంద్ర మంత్రిగా బండి సంజయ్ నిరంతరం అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నారన్నారు. వేములవాడ పట్టణంలో రోడ్లన్నీ గుంతలమయమై ప్రయాణికులు అవస్థలు పడుతున్నారని, ఎమ్మెల్యే మున్సిపాలిటీకి తెచ్చిన నిధులెన్నో శ్వేతపత్రం విడుదల చేయాలని అన్నారు. ఎమ్మెల్యే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పకపోతే, ఈ నెల 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు యువత, ప్రజాసంఘాలు, కాంగ్రెస్లోని అసంతృప్తి నాయకులను మమేకం చేస్తూ ఆయన రాజీనామా కోసం నియోజకవర్గంలో పెద్ద ఎత్తున ఉద్ధృత ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.బిజెపి పట్టణ ఉపాధ్యక్షుడు కటకం శ్రీనివాస్ మాట్లాడుతూ.. బండి సంజయ్ ఎంపీగా తన పరిధిలోని ఏడు నియోజకవర్గాల అభివృద్ధికి దాదాపు రూ.20,000 కోట్లకు పైగా కేంద్ర నిధులు తీసుకువచ్చారని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే గూగుల్ ఓపెన్ చేసి చూస్తే నిధుల వివరాలు తెలుస్తాయని చురకలంటించారు. అలాగే ఆలయ అభివృద్ధి పేరిట పురాతన రాతి కట్టడాలను తొలగించి, సిమెంట్ నిర్మాణాలు చేపట్టడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అటు కౌన్సిలర్ కొండ్లేపు ముత్యం మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ఏ దేశంలో ఉంటున్నారో, భారత దేశంలో లేరా అని ప్రశ్నించారు.

ప్రస్తుతం పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులన్నీ దేవాదాయ శాఖ నిధులతో మాత్రమే జరుగుతున్నాయని, పట్టణాభివృద్ధికి ఎమ్మెల్యే ప్రత్యేకంగా ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదని విమర్శించారు.. ఈ కార్యక్రమంలో గడ్డమీద శీను బిల్లా కృష్ణ వాసం మల్లేశం నామాల శేఖర్ నేరెళ్ల సాయి ,,కిరణ్ లాల శేఖర్ నాంపల్లి లక్ష్మణ్ వావిలాల నరసయ్య యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# పంటల సాగుకు లక్నవరం నుంచి సాగునీరు అందిస్తాం

- ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్



**ములుగు, ఆగస్టు 11, మనం ప్రతినిధి :** లక్నవరం సరస్సు నుంచి పంట కాలువలకు సాగునీటిని విడుదల చేయించి రైతుల పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకుంటానని ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ హామీ ఇచ్చారు. మంగళవారం గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామంలోని తన నివాసం వద్ద మండల రైతులతో ఆయన సమావేశమై సాగునీటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని రైతులు అశోక్ దృష్టికి తీసుకువచ్చారు. లక్నవరం సరస్సులో నీరు అందుబాటులో ఉన్నందున పంట కాలువల ద్వారా నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని కోరారు. రైతుల సమస్యపై స్పందించిన అశోక్.. సంబంధిత అధికారులతో మాట్లాడి లక్నవరం సరస్సు నుంచి పంట కాలువలకు సాగునీటిని విడుదల చేయించేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. రైతులకు ఇబ్బందులు లేకుండా సాగునీటి పరిస్థితిని పర్యవేక్షించాలని అధికారులను కోరుతామని చెప్పారు. పంటలు చేతికొచ్చే వరకు రైతులకు అండగా ఉంటామని పేర్కొన్నారు. తమ సమస్యలను తెలుసుకుని వెంటనే స్పందించిన అశోక్కు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

# 24న ఆదివాసీల శాంతి ర్యాలీని విజయవంతం చేయాలి



**ములుగు, ఆగస్టు 11, మనం ప్రతినిధి:** ఆదివాసీల హక్కుల పరిరక్షణ, చట్టాల అమలుకు డిమాండ్ చేస్తూ ఈ నెల 24న నిర్వహించనున్న శాంతియుత ర్యాలీని విజయవంతం చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మైపతి అరుణ్కుమార్, జాతీయ ఉపాధ్యక్షుడు పొడెం బాబు, ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుల రవి పిలుపునిచ్చారు. ఏటూరునాగారంలో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు నల్లబోయిన లక్ష్మణరావు ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాస్థాయి అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 1976 నుంచి ఆదివాసీల రిజర్వేషన్లకు సంబంధించిన సమస్యలు కొనసాగుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో సింగిల్లైన్ అడ్మినిస్ట్రేషన్, జీవో 57, ఇతర ప్రత్యేక నిబంధనలను అమలు చేసి ఆదివాసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో సాధారణ నోటిఫికేషన్ల ద్వారా ఉద్యోగాల భర్తీ చేపట్టడం వల్ల ఆదివాసీలకు అన్యాయం జరుగుతోందని అన్నారు. పోడు భూముల విషయంలోనూ అటవీశాఖ అధికారుల చర్యలతో ఆదివాసీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. హక్కుల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 24న ఎక్కల బ్రిడ్జి నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు శాంతియుత ర్యాలీ, ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆదివాసీ యువత, నిరుద్యోగులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జాతీయ నాయకులు కోరగట్ల లక్ష్మణరావు, తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పులుష బాలకృష్ణ, ఆదివాసీ సేన రాష్ట్ర నాయకుడు మడి సాయిబాబా, విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కబ్బాక లక్ష్మణ్, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు దబ్బగట్ల శ్రీకాంత్, సిద్ధబోయిన కార్తీక్, తుడుందెబ్బ జిల్లా సోషల్ మీడియా ఇన్చార్జి ఎట్టి సారయ్యదొర, జిల్లా ప్రధాన కార్యదర్శి సోయం ఈశ్వర్, మంగపేట మండల అధ్యక్షుడు పునెం ప్రశాంత్, గుండ్ల పాపారావు, కోరుమిల్లి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రీయ విద్యాలయం (చలి గల్)లో వాక్-ఇన్ ఇంటర్వ్యూలు



**జగిత్యాల, ఆగష్టు 11(మనం ప్రతినిధి):** జగిత్యాల జిల్లా కేంద్రీయ విద్యాలయ చలిగల్ 2026-27 విద్యా సంవత్సరానికి గాను వివిధ పోస్టులకు ఒప్పంద ప్రాతిపదికన సిబ్బంది ఎంపిక ప్యానెల్ తయారీ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి వాక్-ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. బాలవాటిక ఉపాధ్యాయులు, ప్రాథమిక ఉపాధ్యాయులు పోస్టుల కోసం అర్హులైన అభ్యర్థులు 24.08.2026న వాక్-ఇన్ ఇంట ర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

అలాగే కంప్యూటర్ ఇన్స్ట్రక్టర్, స్పెషల్ ఎడ్యుకేటర్, సంగీతం/నృత్య శిక్షకులు పోస్టుల కోసం 25.08.2026న వాక్-ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంటర్వ్యూలకు సంబంధించిన అర్హతలు, ఖాళీలు, సమయాలు, అవసరమైన ధ్రువపత్రాలు తదితర పూర్తి వివరాల కోసం కేంద్రీయ విద్యాలయ చెల్గల్ను సంప్రదించడంతో పాటు కేంద్రీయ విద్యాలయ సంఘటన్ అధికారిక వెబ్సైట్ను https:// karimnagar.kvs.ac.in/ సందర్శించాలని ఆయన తెలిపారు.

## అల్ఫోర్స్ ఇ-టెక్నో లో ఘనంగా విద్యార్థుల ప్రమాణ స్వీకారోత్సవం



**జగిత్యాల, ఆగష్టు 11( మనం ప్రతినిధి ):** విద్యార్థులకు నాయకత్వపు లక్షణాలు చాలా అవసరమని మరియు వాటి ద్వారా పాఠశాలలో ప్రత్యేక గుర్తింపు పొందగలుగుతారని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక శివవీధిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో వేడుకగా నిర్వహించినటువంటి కెప్టెన్స్, వైస్ కెప్టెన్స్ ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా పాఠశాల లోని వివిధ విభాగాలైన లక్ష్య, ధ్రువ, సరస్ మరియు తేజస్ కెప్టెన్లకు మరియు వైస్ కెప్టెన్లకు ఎన్నికల నిర్వహణ అనంతరం ఫలితాల ప్రకటనతో ప్రమాణస్వీకారం ఘనంగా నిర్వహించబడినదని వారు చెప్పారు ఇందులో భాగంగా గెలుపొందిన కెప్టెన్లకు, వైస్ కెప్టెన్లలకు ప్రమాణస్వీకారంతో పాటు పాఠశాల పట్ల బాధ్యతగా వ్యవహరిస్తామని మరియు తోటి విద్యార్థులకు చేయూతనిస్తామని ప్రతిజ్ఞ చేయించడం జరిగిందని వారు చెప్పారు ఎన్నికల ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, బాధ్యత, నైతిక విలువలను పెంపొందించడం, దేశం, సమాజం మరియు పాఠశాల పట్ల బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడం, తల్లిదండ్రులు, గురువులు, పెద్దలను గౌరవించడం నిజాయితీ, సమయపాలన, కష్టపడి పనిచేయడం వంటి మంచి లక్షణాలను అలవర్చుకోవడం, విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సామాజిక సేవలో చురుకుగా పాల్గొనడం, పర్యావరణ పరిరక్షణ, సమితి పరిశుభ్రత మరియు సామాజిక బాధ్యతను ప్రతి విద్యార్థి తన కర్తవ్యంగా భావించడం, తోటి విద్యార్థులతో స్నేహభావంతో మెలగుతూ, ఐక్యతతో ఉండడం తదితర లక్షణాలను నేర్చుకుంటారని వారు చెప్పారు.

ప్రమాణ స్వీకారోత్సవంలో భాగంగా ప్రదర్శించిన ˇటువంటి పలు సంస్కృతిక కార్యక్రమాలు ఆలోచింపచేసాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

## అడవుల సంరక్షణ అందరి బాధ్యత

- జిల్లా పార్టీ అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య

**మంగపేట, ఆగస్టు 11,మనం ప్రతినిధి:** మంగళవారం నిమ్మగూడెం గ్రామంలోని ముసలమ్మ తోగు,తక్కెళ్లగూడెం ప్రాంతాల్లో పోడు భూముల సమస్యపై స్థానిక ఎస్త్స టీవీఆర్ సూరి అటవీ శాఖ అధికారుల సహకారంతో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య కలిసి పోడు భూముల వివాదం సమస్యలపై గుత్తి కోయలతో చర్చించారు. పోడు రైతులకు అటవీ శాఖ అధికారులకు వివాదంగా ఉన్న సమస్యను పరిష్కరించాలని, ఎన్నో సంవత్సరాలుగా పోడు భూములపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులకు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా అధికారులు, రైతుల మధ్య సమన్వయంతో సమస్యలను పరిష్కరించుకోవాలని అయ్యోరి యానయ్య అన్నారు. అడవుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని,అదే సమయంలో తరతరాలుగా పోడు సాగుపై ఆధారపడి జీవిస్తున్న రైతుల జీవనోపాధికి కూడా ఇబ్బంది కలగకుండా అధికారులు మానవతా దక్పథంతో వ్యవహరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# లక్ష మందితో సంగారెడ్డిలో సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభ

**సంగారెడ్డి సీఎం బహిరంగ సభ ఏర్పాట్లపై మంత్రి ఉత్తమ్ , జగ్గారెడ్డి సమీక్ష**



**సంగారెడ్డి ఆగస్టు 11 మనం న్యూస్ ప్రతినిధి :** ఈనెల 15న సంగారెడ్డిలో నిర్వహించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభ ఏర్పాట్లపై సచివాలయంలోని తన ఛాంబర్లో నీటిపారుదల, పౌర సరఫరా శాఖల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉన్నత స్థాయి రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, నారాయణ్ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కాగా, మంత్రి దామోదర రాజనర్సింహ వైరల్ ఫీవర్తో బాధపడుతుండటం వల్ల ఈ సమావేశానికి హాజరుకాలేకపోయారు. ఈ సందర్భంగా సభకు భారీ జన సమీకరణ, వేదిక ఏర్పాట్లపై సుదీర్ఘంగా చర్చించారు. ఆగస్టు 15న మధ్యాహ్నం 2 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి సంగారెడ్డికి చేరుకుంటారని, సాయంత్రం 4 గంటల వరకు సంగారెడ్డి లో ఉంటారని నేతలు వెల్లడించారు. సీఎం సభను ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని, జన సమీకరణ, భద్రత, ఇతర ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్, జగ్గారెడ్డి అధికారులకు సూచించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని 10 నియోజకవర్గాల నుండి నియోజకవర్గానికి ఒకరు చొప్పున, మొత్తం పది మంది లబ్ధిదారులకు సీఎం రేవంత్ రెడ్డి సభా వేదికపైనే స్వయంగా కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను అందజేస్తారని మంత్రి తెలిపారు. అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్కు సూచించారు. సుమారు లక్ష మంది జనంతో ఈ భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జగ్గారెడ్డి స్పష్టం చేశారు.

# రిజర్వాయర్లలో తగ్గిన నీటి నిలువ

- మల్లన్నసాగర్ లో 13. 86 టీఎంసీలు, కొండపోచమ్మ సాగర్లో 6.31 టీఎంసీలు మాత్రమే నీరు నిల్వ ఉంది
- ఆరుతడి పంటల సాగుపై రైతులు దృష్టి పెట్టాలి
- ఈసారి 70000 ఎకరాల్లో పంట మార్పిడి జరిగింది
- జిల్లా కలెక్టర్ కే హైమావతి



**సిద్దిపేట ఆగస్టు 11 (మనం ప్రతినిధి) :** జిల్లాలోని ప్రధాన రిజర్వాయర్లలో నీటి నిల్వ బాగా అడుగంటిందని వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఆరో తారీకు పంటల సాగు, పంట మార్పిడి పద్ధతులను రైతులు అవలంబించాలని జిల్లా కలెక్టర్ కె హైమావతి సూచించారు. గత సంవత్సరం వరి సాగు విస్తీర్ణం బాగా పెరిగిందని ఈసారి తగ్గించాలనే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. అయితే ఇప్పటివరకు 70000 ఎకరాలలో పంట మార్పిడి జరిగినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఇంకా ఆముదము, నూనె గింజల పంటలను సాగు చేసుకునే వీలుందని సూచించారు. జిల్లా నీటిపారుదల సలహా కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి అన్నారు. జిల్లా ఇరిగేషన్ అడ్వైజరీ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం జరిగిగగా ఎమ్మెల్సీ వంటేరు యాదవ రెడ్డి, ఇరిగేషన్, రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యానవనం శాఖల అధికారులు పాల్గొన్నారు. అన్నపూర్ణ సాగర్ 3.50 టీఎంసీలకు గాను 1.51 టీఎంసీల నీరు ఉండదని వాటిలో 0.32 డెత్ స్టోరేజ్ ఫోన్ 1.19 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని గజ్వేల్ సర్కిల్ చీఫ్ ఇంజనీర్ శివధర్మ తేజ తెలిపారు. రంగనాయక సాగర్ లో 3.00 టీఎంసీలకు గాను 0.99 టీఎంసీ నీరు ఉందని డెత్ స్టోరేజ్ 0.17 టీఎంసీలు పోను. 0.82 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని, మల్లన్న సాగర్ లో 50 టీఎంసీలకు గాను 13.86 టీఎంసీల నీరు ఉందని 9.37 టీఎంసీల నీరు డెత్ స్టోరేజ్ పోను 4.12 టీఎంసీల నీరు అందుబాటులో ఉందన్నారు. కొండపోచమ్మ సాగర్ లో 15.00 టీఎంసీలకు గాను 6.31 టీఎంసీల నీరు ఉందని 2.20 టీఎంసీల నీరు డెత్ స్టోరేజ్ పోను 4.11 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని, శనిగరం ప్రాజెక్టు లో 1.09 టీఎంసీలకు గాను 0.46 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా అందుబాటులో ఉన్న నీటిని కేవలం త్రాగునీరు అవసరాలకు మాత్రమే ఉపయోగించాలని రాష్ట్రప్రభుత్వం సూచించిందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వలన రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితిలో ఏర్పడి జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులలో కొత్తగా నీరు చేరలేదని అన్నారు. మళ్లీ వర్షాకాలం వరకు వర్షాలు పడే సూచనలు లేదని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ఇప్పుడు ప్రస్తుతం ప్రాజెక్టులో ఉన్న నీరు తాగునీరు అవసరాలకు మాత్రమే ఉపయోగించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని ఆదేశాల మేరకు ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని త్రాగునీటి అవసరాలకు అట్టి పెట్టడం జరిగిందని అన్నారు. జిల్లాలో సాగునీరు అందుబాటులో లేదని రైతులు వరి పంట ఇతర పంటలను సాగు చేయాలని సూచించారు. గత సంవత్సరం 4.82 లక్షల ఎకరాలలో పంట వేయగా వాటిలో 3.68 లక్షల ఎకరాలలో కేవలం వరి పంట పండించడం జరిగిందని అన్నారు. 5 లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యానికి ప్రభుత్వం 1200 కోట్లు పైన చెల్లించడం జరిగిందని అన్నారు. ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితుల గురించి రైతులకు వివిధ రకాలుగా అవగాహన కలిగించడం మూలంగా ఈ సంవత్సరం ఇప్పటికీ 70,000 ఎకరాల్లో పంట మార్పిడి జరిగి కందులు, పెసర్లు, మినుములు, చిరుధాన్యాలు, మొక్కజొన్న, పత్తి తదితర పంటలను వేశారని తెలిపారు.

ఆగస్టు 15 తర్వాత ఆముదము, పత్తి , నూనె గింజల పంటలను పండించవచ్చని ఆరుతడి పంటలను పండించాలని అన్నారు. ఆగస్టు, సెప్టెంబర్ మాసాలలో వర్షాలు కురిస్తే సాగునీటి ప్రాజెక్టుల ద్వారా నీటిని విడుదల చేయడానికి నీటిపారుదల శాఖ సిద్ధంగా ఉందని తెలిపారు. ఎంఎల్సి యాదవ రెడ్డి మాట్లాడుతూ వర్షాబావ పరిస్థితులలో రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారని, ప్రాజెక్టుల ద్వారా నీటిని వదిలి కూడా వెల్లి, హల్దివాగు చెక్ డ్యామ్ లను నింపితే రైతులు వ్యవసాయం పంటలకు మేలు జరుగుతుందని సూచించారు. గోదావరి నది నుండి నీరు వృధా పోకుండా లిఫ్ట్ చేసి ప్రాజెక్టులను నింపి సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని హరీష్ రావు పంపించిన లేఖలు పేర్కొన్నారు. భూగర్భ జలాలను పెంచేలా ప్రభుత్వానికి తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ సర్కిల్ సీఈ సత్యనారాయణ రెడ్డి, సిద్దిపేట్, గజ్వేల్, కరీంనగర్ సర్కిల్ ల ఎస్ఇలు సూర్యకిరణ్, లక్ష్మణ్ పల్లంరాజు,డిస్ట్రిక్ ఇరిగేషన్ ఆఫీసర్ నాగరాజు, సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ ఆర్డీవోలు సదానందం, చంద్రకళ, రామ్మూర్తి, జిల్లా వ్యవసాయ అధికారి మల్లయ్య, జిల్లా ఉద్యానవన అధికారి సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

# లాడ్జీల తనిఖీ -నిర్వాహకులకు పోలీసుల సూచనలు

**మహదేవ్పూర్ ఆగస్టు 11 మనం న్యూస్:** మండలంలోని కాళేశ్వరం గ్రామంలో క్యాషియో కార్యక్రమంలో భాగంగా మంగళవారం నాడు పోలీసులు లాడ్జీలను తనిఖీ చేశారు. మహదేవ్పూర్ సీఐ ఎన్. వెంకటేశ్వర్లు, కాళేశ్వరం ఎస్సై జి. తమాషా రెడ్డి ఆధ్వర్యంలో లాడ్జీలను తనిఖీ చేశారు.అనంతరం కాళేశ్వరం పోలీస్ స్టేషన్లో లాడ్జి యజమానులు, నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. లాడ్జీల నిర్వహణకు సంబంధించిన అన్ని అనుమతి పత్రాలను తప్పనిసరిగా పొందాలని, నిబంధనలకు అనుగుణంగా అన్ని అనుమతులతోనే లాడ్జీలను నిర్వహించాలని సూచించారు. లాడ్జీలకు వచ్చే వ్యక్తుల వివరాలను నిబంధనల ప్రకారం నమోదు చేసుకోవాలని, పోలీసులకు సహకరించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మహదేవ్పూర్ ఎస్సై-2 కే. భగవత్,మహదేవ్పూర్ ఎస్సై సాంబమూర్తి, పలిమెల ఎస్సై సాయి శశాంక్తో పాటు సివిల్ సిబ్బంది, టీజీఎస్పీ సిబ్బంది లాడ్జిల యజమానులు పాల్గొన్నారు.



# ప్రజలకు అందుబాటులో ఉండాలి:ఎస్పీ సంకీర్త్



**భూపాలపల్లి ఆగస్టు 11 మనం ప్రతినిధి:** పోలీసులు విధి నిర్వహణలో నిస్పాక్షికంగా వ్యవహరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎస్పి సంకీర్త్ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం నాడు ఆయన కాటారం సబ్ డివిజన్ పరిధిలోని కొయ్యూరు పోలీస్ స్టేషన్ను సందర్శించారు. పోలీస్ స్టేషన్కు చేరుకున్న ఆయనకు పోలీస్ సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఎస్పీ మొక్క నాటారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఆయన పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధి నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. రోడ్డు ప్రమాద కేసులకు సంబంధించిన వాహనాల స్థితిగతులు, వాటి పరిష్కార పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

రిసెప్షన్ విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడిన ఎస్పీ పోలీస్ స్టేషన్కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. అందిన ప్రతి ఫిర్యాదును వెంటనే ఆన్లైన్లో నమోదు చేసి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లో నమోదైన పెండింగ్ కేసుల పురోగతిని సమీక్షించిన ఎస్పీ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. దర్యాప్తు వివరాలను ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేస్తూ కేసు రికార్డులను అప్డేట్ చేయాలని ఆదేశించారు. స్టేషన్ రికార్డుల నిర్వహణ, కేసు రికార్డుల నవీకరణ, సిబ్బంది విధి నిర్వహణను పరిశీలించిన ఎస్పీ గారు అన్ని రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. రౌడీ షీటర్లపై తీసుకుంటున్న చర్యలను సమీక్షించి, వారిపై నిరంతరం నిఘా కొనసాగించాలని ఆదేశించారు.పోలీస్ స్టేషన్కు వచ్చే ప్రతి పౌరుడికి స్నేహపూర్వక వాతావరణం కల్పిస్తూ, వారి సమస్యలను వేగవంతంగా, పారదర్శకంగా పరిష్కరించే విధంగా సేవలు అందించాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసాన్ని మరింత పెంపొందించడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ వార్షిక తనిఖీల్లో కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, కాటారం సీఐ నాగార్జున రావు, తదితర అధికారులు పాల్గొన్నారు.

# పశువులను అక్రమంగా రవాణ చేస్తే కఠిన చర్యలు



**ములుగు, ఆగష్టు 11(మనంన్యూస్):** పశువులను అక్రమంగా రవాణ చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం ములుగు చెక్పోస్టు వద్ద అనుమానాస్పదంగా వస్తున్న వాహనం నంబర్ను గమనించి, వెంటనే ఆపి తనిఖీ చేశారు.వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 30 ఆవులు ఉన్నట్లు గుర్తించారు. వాహనంలో ఉన్న వ్యక్తులను విచారించగా అబ్దుల్ ఖలీల్, మహ్మద్ అబ్బాస్, మహమ్మద్ అయూబ్లు కరీంనగర్ జిల్లా పరిధిలో పశువులను కొనుగోలు చేసి, ఎటువంటి ముందస్తు అనుమతి/ప్రభుత్వ అనుమతులు లేకుండా, వాటిని డీసీఎం వాహనంలో క్రూరంగా కట్టి హైదరాబాద్లోని బహదూర్పుర పశువుల మార్కెట్కు తరలిస్తున్నట్లు ప్రాథమికంగా వెల్లడించారు. వెంటనే పోలీసులు ఆ వాహనంను అందులో ఉన్న 30 ఆవులను ములుగు పోలీస్ స్టేషన్కు తరలించారు. అనంతరం పశువుల సంక్షేమం మరియు రక్షణ దృష్ట్యా వాటిని గోశాలకు తరలించారు. ఈ ఘటనపై ములుగు పోలీసులు చట్ట ప్రకారం తదుపరి చర్యలు చేపడుతున్నారు.

# కౌన్ బనేగా కరోడ్పతి సీజన్ 18తో ఎఐ ప్లస్ స్మార్ట్ ఫోన్ భాగస్వామ్యం




**హైదరాబాద్ , ఆగస్టు 11(మనంన్యూస్):** ఎఐ ప్లస్ స్మార్ట్ ఫోన్ కౌన్ బనేగా కరోడ్పతి సీజన్ 18తో తన భాగస్వామ్యాన్ని ప్రకటించింది, దీని ద్వారా ఈ నూతన భారతీయ స్మార్ట్ ఫోన్ బ్రాండ్ దేశంలోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన మరియు విశ్వసనీయమైన టెలివిజన్ కార్యక్రమాలలో ఒకదానితో అనుసంధానమవుతోంది. రెండు దశాబ్దాలకు పైగా,కేబిసి దాని ప్రఖ్యాత వ్యాఖ్యాత అమితాబ్ బచ్చన్ విశ్వసనీయత, జ్ఞానం మరియు ఆకాంక్షలకు ప్రతీకగా నిలిచారు, తద్వారా భారతీయ ప్రేక్షకుల అనేక తరాల విశ్వాసాన్ని సంపాదించారు. ఎఐ ప్లస్ స్మార్ట్ ఫోన్, ఈ భాగస్వామ్యం విశ్వాసం అనేది కోరి పొందేది కాదు, కాలక్రమేణా సంపాదించుకోవ లసినది అనే ఉమ్మడి నమ్మకాన్ని ప్రతిబింబిస్తుంది. ఒక యువ భారతీయ సాంకేతిక బ్రాండ్గా, ఎఐ ప్లస్ స్మార్ట్ఫోన్ పారదర్శకత, గోప్యత మరియు వినియోగదారు-కేంద్రీకృత సాంకేతికత ఆధారంగా తన ప్రయాణాన్ని రూపొందించుకు ంటోంది. కేబిసీతో ఈ భాగస్వామ్యం, ఈ దృక్పథాన్ని భారతదేశం అంతటా లక్షలాది గృహాలకు చేరవేసే అవకాశాన్ని బ్రాండ్కు అందిస్తుంది. ఆర్పి గొగోయ్, హెడ్ ఆఫ్ బ్రాండ్, మార్కెటింగ్ అండ్ గ్రోత్, ఎఐ ప్లస్ స్మార్ట్ఫోన్ మరియు నెక్స్ట్క్వాంటం షిఫ్ట్ టెక్నాలజీస్ , మాట్లాడుతూ, కేబిసి కేవలం ఒక టెలివిజన్ కార్యక్రమం మాత్రమే కాదు; అది భారతదేశ సాంస్కృతిక వస్త్రంలో ఒక భాగం. అనేక సంవత్సరాలుగా, కేబిసి , బచ్చన్ విశ్వసనీయత మరియు విశ్వాసం యొక్క అసాధారణ వారసత్వాన్ని నిర్మించారు. ఒక యువ భారతీయ బ్రాండ్గా, ఇది మాకు లోతైన అర్థాన్ని కలిగి ఉంది. విశ్వాసాన్ని ప్రతిరోజూ మా ఉత్పత్తులు, మా చర్యలు మరియు మా పారదర్శకత ద్వారా సంపాదించుకోవాలనే నమ్మకంతో మేము ఎఐ ప్లస్ ని నిర్మిస్తున్నాము. ఈ భాగస్వామ్యం విశ్వాసం యొక్క స్థిరపడిన వారసత్వాన్ని, వినియోగదారుల నుండి అదే విశ్వాసాన్ని సంపాదించాలనే ఆకాంక్షతో ఉన్న ఒక కొత్త భారతీయ సాంకేతిక బ్రాండ్తో కలుపుతుంది. అని అన్నారు. విశ్వాసం, గోప్యత మరియు పారదర్శకతలో పాతుకుపోయిన భారతీయ సాంకేతిక బ్రాండ్ను నిర్మించే దిశగా, ఎఐ+స్మార్ట్ ఫోన్ప్రయాణంలో ఈ భాగస్వామ్యం మరో ముందడుగు.

# చలివాగు నుండి పంటలకు నీరందివ్వాలి




- మాజీ ఎమ్మెల్యే రమణారెడ్డి

**భూపాలపల్లి ఆగస్టు 11 మనం న్యూస్ :** గత కొన్ని రోజులుగా రైతులు మొరపెట్టుకుంటున్నా ఈ ప్రభుత్వానికి చలనం లేదని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి అన్నారు.. ఇప్పటికైనా నీళ్లు వదలకపోతే ఎక్కడికక్కడ స్థానిక శాసనసభ్యున్ని అడ్డుకుంటామని హెచ్చరించారు.. ఈ మేరకు చలివాగు ప్రాజెక్ట్ నుండి రైతులకు వెంటనే సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చెన్నాపూర్ క్రాస్ వద్ద టిఆర్ఎస్ పార్టీ పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని చేపట్టగా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి ఈ ధర్నా లో పాల్గొన్నారు.. ఈ సందర్భంగా రోడ్డు పై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. రైతులకు సాగు నీళ్లు ఇవ్వాలంటూ నినాదాలు చేశారు.. కాగా వీరి ధర్నా తో సుమారు రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయింది... కాగా పోలీసులు చేరుకొని ధర్నా చేస్తున్న నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు అనంతరం మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి చలివాగును సందర్శించారు.. రైతులు నాట్లు వేసి రోజులు గడుస్తున్నా సాగు నీళ్లు ఇవ్వకుండా ప్రభుత్వం మీనా మేషాలు లెక్కిస్తున్ దన్నారు.. ప్రభుత్వం ద్వంద విధానాలను అవలంబిస్తుందని ఈ ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే తొమ్మిది మోటార్లను ఆన్ చేసి రైతులందరికీ సాగు నీరు అందించాలని డిమాండ్ చేశారు.. 24 గంటల్లో రైతుల పొలాలకు సాగు నీళ్లు ఇవ్వకుంటే ఎక్కడికక్కడ ప్రజా ప్రతినిధులను నిలదీసి అడ్డుకుంటాం అని హెచ్చరించారు..

# అబద్దాలు చెప్పడంలో జగ్గారెడ్డికి ఆస్కార్ అవార్డు ఇచ్చినా తక్కువే



**సంగారెడ్డి ఆగస్టు 11 మనం న్యూస్ ప్రతినిధి :** పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి బస్ స్టేషన్ లో ఏం మాట్లాడుతున్నారో ఆయనకే తెలియడం లేదని ఆయన అబద్ధాలు చెప్పడంలో ఆయనకు ఆస్కార్ అవార్డు ఇచ్చిన తక్కువేనని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆయనపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.మంగళవారం నాడు సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ. జగ్గారెడ్డి పదేళ్ల క్రితం జరిగిన ఓ సమావేశం గురించి ఇప్పటికి పదేపదే చెప్పుకోవడం రాజకీయ దిగాజారుడుతనానికి నిదర్శనం అని చంద్రబాబు ఆకర్ అన్నారు. గతంలో జరిగిన విషయాలు పదేపదే చెప్పుకోవడం మానుకోవాలని ఆయనపై విమర్శించారు. రాహుల్ గాంధీ సభ కోసం 6.5 కోట్ల అప్పు తెచ్చానని జగ్గారెడ్డి చెబుతున్నారని తాను ఎన్ని కోట్లు అప్పు తెచ్చినది సంగారెడ్డి ప్రజలకు సంబంధం ఏముందని ప్రశ్నించారు. వాటి పెద్దలు మెప్పు పొందేందుకు అప్పుల కథలు చెప్తున్నారని ఆరోపించారు.ముఖ్యమంత్రి సంగారెడ్డికి వచ్చిన సమయంలో ప్రభుత్వ హోదా లేని జగ్గారెడ్డి ఆయన భార్య సీఎం వేదిక పై చోటు దక్కకపోవడంతో ఏర్పడిన అసంతృప్తిని హరీష్ రావు పై విమర్శలు రూపంలో వ్యక్తం చేస్తున్నారని అన్నారు.

### పాస్పోర్ట్ బ్రోకర్ కేసులో హరీష్ రావుకు ఎలాంటి సంబంధం లేదు

పాస్పోర్ట్ బ్రోకర్ కేసులో హరీష్ రావుకు ఎలాంటి సంబంధం లేదని సీతా ప్రభాకర్ స్పష్టం చేశారు మానవ అక్రమ రవాణా కేసు దర్యాప్తులో ఆధారాలు లభించడంతో చట్టపరమైన చర్యల భాగంగానే కేసు నమోదు అయిందని పేర్కొన్నారు తనపై వచ్చిన ఆరోపణను ఇతరుల పైకి నెట్టే ప్రయత్నం చేయవద్దని జగ్గారెడ్డికి సూచించారు. సంగారెడ్డి మున్సిపల్ చైర్మన్గా జగ్గారెడ్డి ఉన్న సమయంలో అవినీతి జరిగిందని, ఆయన చేసిన అవినీతి కోసం పలువురు అధికారులు సస్పెండ్ అయ్యారని కొందరు జైలుకే వెళ్లారని చింత ప్రభాకర్ ఆరోపించారు. తన నిజాయితీ పోలీసుల విచారణ గురించి జగ్గారెడ్డి మాట్లాడటం ఆశాస్పదంగా ఉందని అన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

## సెప్టెంబరు 1న 'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయాలి

**కామారెడ్డి, ఆగస్టు 11 (మనం న్యూస్):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి 14 వరకు కామారెడ్డి జిల్లాలో పాదయాత్రలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ తెలిపారు. మంగళవారం రామారెడ్డి మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద సీపీఐ జెండాను ఆవిష్కరించారు. అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పశ్య పద్మ మాట్లాడుతూ., నిత్యావసర ధరల పెరుగుదలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే అరికట్టాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, ఎరువుల ధరలు తగ్గించాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని కోరారు.

**యువతకు ఉద్యోగాలు, మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలి**

నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, మహిళా రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలని అన్నారు. కార్మిక హక్కులను పరిరక్షించడంతోపాటు నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు అందించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న రాజకీయ ప్రచార, పాదయాత్రలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సెప్టెంబరు 1న న్యూఢిల్లీలోని రామ్లీలా మైదానంలో నిర్వహించే బహిరంగ సభ, ర్యాలీ సందర్భంగా 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం రాజమ్మతండాలో రైతులతో సదస్సు నిర్వహించారు.

కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎల్. దశరథ్, సహాయ కార్యదర్శి పి. బాలరాజ్, నాయకులు ఎస్డీ హైదర్, రాజమణి, దేవయ్య, ప్రవీణ్, రఫీక్, శ్రీనివాస్, మౌలాన్సీ, శుక్రు, రాజ్మహ్మద్, శ్యామల, లక్ష్మి, శివప్రసాద్, సంపత్కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# నాగవల్లి ఎక్స్ప్రెస్లో తనిఖీల



- నాగవల్లి ఎక్స్ప్రెస్లో 6 కిలోల ఎండు గంజాయి పట్టివేత
- నిందితుల కోసం గాలింపు

**కామారెడ్డి, ఆగస్టు 11 (మనం జిల్లా ప్రతినిధి):** నాగవల్లి ఎక్స్ప్రెస్లో అక్రమంగా తరలిస్తున్న 6 కిలోల ఎండు గంజాయిని ఎక్సైజ్, టాస్క్ఫోర్స్, రైల్వే పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో స్వాధీనం చేసుకున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీధర్, కామారెడ్డి జిల్లా మధ్య నిషేధ అధికారి ముకుందరెడ్డి ఆదేశాల మేరకు ఈ దాడులు నిర్వహించారు. స్థంభంపూర్ నుంచి నాందేడ్ వెళ్తున్న నాగవల్లి ఎక్స్ప్రెస్లో గంజాయి తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో కామారెడ్డి ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది, జిల్లా టాస్క్ఫోర్స్, రైల్వే పోలీసులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా గంజాయి పట్టుబడింది. అయితే నిందితులు ఎవరూ చిక్కలేదని ఎక్సైజ్ సీఐ సంపత్ కృష్ణ తెలిపారు. నిందితుల ఆచూకీ కోసం గాలింపు కొనసాగుతోందన్నారు. దాడుల్లో డీటీఎఫ్ సీఐ సుందల్ సింగ్, ఎస్ఐలు విక్రమ్కుమార్, శ్రీనివాసరావు, శరత్కుమార్, ట్రైనీ ఎస్ఐలు అనిల్, మధుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా?

## ఎమ్మెల్యే చింతా ప్రభాకర్కు సవాల్ విసిరిన కాంగ్రెస్ నేతలు

## సదాశివపేటలో మాలకుంట చెరువును కబ్జా చేయడం నిజం

**సంగారెడ్డి ఆగస్టు 11 మనం న్యూస్ ప్రతినిధి :** సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలపై నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు స్పందిస్తూ జగ్గారెడ్డి పై విమర్శలు చేస్తే ఖబర్దార్ అంటూ హెచ్చరించారు. తాము చేసిన ఆరోపణలపై బహిరంగంగా చర్చకు సిద్ధమని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్కు సవాల్ విసిరారు. 2017 సంగారెడ్డిలో రాహుల్ గాంధీ సభ విజయవంతం కావడంతో కెసిఆర్ హరీష్ రావు జగ్గారెడ్డి పై కక్ష పెంచుకొని ఆయన చేసిన వ్యాఖ్యలకు చింతా ప్రభాకర్ కౌంటర్ ఇచ్చిన దానిపై కాంగ్రెస్ నేతలు మీడియా సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చింతా ప్రభాకర్ కుటుంబానికి సంబంధించిన భూముల వ్యవహారంలో ప్రశ్నలు లేవనెత్తారు సీలింగ్ భూమి రిజిస్ట్రేషన్, దళితుల భూములు సదాశివపేటలో రోడ్డు కబ్జా మాల కుంట కబ్జా తదితర అంశాలపై ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ చైర్మన్గా ఉన్న సమయంలో ఓ మహిళా కౌన్సిలర్లు పట్ల వ్యవహరించిన తీరు పైన వారు ప్రశ్నించే సదాశివపేటలో ఎక్కడికి రమ్మన్నా మేము అక్కడికి వస్తామని బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ కాంగ్రెస్ నేతలు సవాలు విసిరారు. ఇకపై టిఆర్ఎస్ నాయకులు అవినీతి చిట్టాను ఒక్కొక్కటిగా బయటకు పెడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి.



తోపాజి అనంత కిషన్ మాట్లాడుతూ

ఎమ్మెల్యే చింత ప్రభాకర్ జగ్గారెడ్డి పై అవాకులు చివకులు మాట్లాడడం సరికాదని జాతర అంటేనే జగ్గారెడ్డి జగ్గారెడ్డి అంటేనే సంగారెడ్డి అని అన్నారు ఆపదలో ఉన్న ప్రజల కష్టాలను తీర్చిన నాయకుడు జగ్గారెడ్డి అని కరోనా సమయంలో ఎంతోమందికి ఆక్సిజన్ అందచేసి ప్రాణాలు కాపాడిన వ్యక్తి జగ్గారెడ్డి అని కరోనా టైంలో మీరు ఎక్కడున్నారు ప్రశ్నించారు. సంగారెడ్డి అభివృద్ధి చేయడంలో జగ్గారెడ్డి చేసింది ఒకటి కాదు రెండు కాదు అని ఐఐటి, ఇంటింటికి మంజీరా నీరు సంగారెడ్డి నుండి లింగంపల్లి నాలుగు లైన్ల రహదారి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అగ్రికల్చర్ కళాశాల పీజీ కళాశాల ఇలా ఎన్నో జగ్గారెడ్డి తోనే సాధ్యమైందని నియోజకవర్గంలోని ప్రజలకు ఏ కష్టం వచ్చినా గుర్తుకొచ్చే పేరు జగ్గారెడ్డి దేనిని ఆయన అన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ కన్వీనర్ చర్యాల ఆంజనేయులు సి డి సి చైర్మన్ రామ్ రెడ్డి మాజీ మున్సిపల్ చైర్మన్ మున్సిపల్ సత్యనారాయణ కోన సంతోష్ షఫీ ఆఫీస్, కిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి భూమికి భూధార్ కార్డులు..



## రైతుల సమక్షంలో పారదర్శకంగా హద్దుల నిర్ధారణ.. అక్కడికక్కడే విస్తీర్ణం వివరాలు

## భవిష్యత్తులో భూ వివాదాలు గణనీయంగా తగ్గి రైతులకు భద్రత

## బేతుపల్లి, నారాయణపురం, గంగారం గ్రామాలలో భూ రీ సర్వేను తనిఖీ చేసిన కలెక్టర్

**సత్తుపల్లి, ఆగస్టు 11(మనం న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూ రీ-సర్వే ద్వారా రైతుల భూములపై ఉన్న వివాదాలు, విస్తీర్ణ వ్యత్యాసాలు, రికార్డులలోని లోపాలను ఎవరికి అన్యాయం జరగకుండా పారదర్శకంగా భూసమస్యలు పరిష్కారం కావలనేది ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గంలో మంగళవారం జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. బేతుపల్లి రెవెన్యూ పరిధిలోని గ్రామాలలో ప్రభుత్వం చేపట్టిన భూ రీసర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్‌తో కలిసి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గంగారం గ్రామంలో పంట పొలాలలో గట్టు వెంబటి నడుచుకుంటూ వెళ్లి రైతుల సమక్షంలో నిర్వహిస్తున్న రీ సర్వేను పరిశీలించారు. బేతుపల్లి, అనంతరం నారాయణపురం గ్రామాల్లో జరుగుతున్న భూ రీసర్వే ప్రక్రియ పరిశీలించి రైతులతో కలెక్టర్ నేరుగా ముచ్చటించి సర్వే పై వారి అభిప్రాయాలను తెలుసుకొని రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ సత్తుపల్లి నియోజకవర్గంలో బేతుపల్లి రెవెన్యూ పరిధిలోని గంగారం, బేతుపల్లి నారాయణపురం, రామగోవిందపురం, యం.వి. పాలెం, రామనగర్, పాకాలగూడెం గ్రామాలలో సుమారు 12 వేల ఎకరాలకు భూ సర్వే కొనసాగుతుందని, 10టీమ్ లలో ఇప్పటి వరకు 4 వేల ఎకరాల రైతుల భూములను రీ సర్వే పూర్తి చేశామని కలెక్టర్ వివరించారు. ప్రతి మనిషికి అధార్ లాగా అధునిక యాంత్రాలు, సాంకేతిక పరిజ్ఞానం తో చేసున్న భూ సర్వే ద్వారా ప్రతి రైతు భూమికి డిజిటల్ మ్యాప్ తో కూడిన భూధార్ కార్డు ఉంటుందని తెలిపారు. గ్రామంలోని రైతులకు గతంలో కొంత మందికి పట్టాదారు పాస్ పుస్తకాలు లేకపోవడం, అన్లైన్ ప్రక్రియలో పేర్లు నమోదు కాకపోవడం, రికార్డుల్లో ఉన్న విస్తీర్ణానికి భూమిపై ఉన్న విస్తీర్ణానికి తేడాలు ఉండడం వంటి అనేక సమస్యలు రైతులు ఎదుర్కుంటున్న వారికి, అలాగే ఉన్న భూ విస్తీర్ణము కొంతమందికి తక్కువగా నమోదు కాగా, మరికొందరికి ఎక్కువగా నమోదైన సందర్భాలు కూడా ఉన్నాయని, రీ-సర్వే ద్వారా అలాంటి అన్ని లోపాలను రీ సర్వే ద్వారా సరిచేస్తామని అన్నారు. గ్రామంలోనీ ప్రతి రైతుకు 48 గంటల ముందుగానే నోటీసులు జారీ చేసి, రైతుల సమక్షంలోనే వారి పొలాలను కొలుస్తామని కలెక్టర్ తెలిపారు. రైతులు స్వయంగా తమ భూమి హద్దులను చూపిస్తారని, పక్కనే ఉన్న రైతులను కూడా పిలిచి పంచనామా నిర్వహించి హద్దులను నిర్ధారిస్తామని వివరించారు. భూ సర్వే కు నోటీసు ఇచ్చిన రైతులు వారి కుటుంబంలో భూ హక్కదారులు, పట్టా పాస్ బుక్ లో భూమి ఉన్న వారు అందరూ తప్పకుండా స్వయంగా సర్వేకు వచ్చి పూర్తి వివరాలు తెలియజేసి, సహకరించాలని కలెక్టర్ కోరారు. సర్వే పూర్తయ్యాక ఎంత విస్తీర్ణం నమోదైందో రైతులకు అక్కడికక్కడే తెలియజేస్తామని చెప్పారు. రైతులకు సందేహం ఉన్న మరొక్కసారి, రైతులు విశ్వసించే వరకు పారదర్శకంగా భూ రీ సర్వే చేసి వారితో స్వయంగా ఉన్న భూమి విస్తీర్ణముకు సంతకం కూడా తీసుకుంటామని అన్నారు. భూ రీ సర్వే మొత్తం ప్రక్రియ పూర్తిగా క్షేత్ర స్థాయిలో భూ హక్కుదారిని సమక్షంలో జరుగుతుందని, రైతుల హక్కులకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులు అపోహలకు గురికాకుండా అధికారులు అందించే సమాచారాన్ని నమ్మకంతో భూ రీ-సర్వే కార్యక్రమానికి పూర్తి సహకారం అందించాలని కోరారు. సర్వే అనంతరం గ్రామాల్లో భూ వివరాలను ప్రకటించి, వివరాలను గ్రామ పంచాయతీ, తహసీల్దారు కార్యాలయాలలో నోటీస్ బోర్డులో ఉంచుతామని, ఏలాంటి అభ్యంతరాలు ఉన్న గడువు ఇస్తామని, అభ్యంతరాలు స్వీకరించి పరిష్కరించిన తర్వాత వివరాలను పూర్తిస్థాయిలో ఆన్లైన్లో నమోదు చేసి భూధార్ కార్డులు జారీ చేస్తామని పేర్కొన్నారు. రీ-సర్వే పూర్తయిన తర్వాత భవిష్యత్తులో భూ వివాదాలు గణనీయంగా తగ్గి రైతులకు శాశ్వత భద్రత కలుగుతుందని కలెక్టర్ దివాకర టీఎస్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట సత్తుపల్లి తహసీల్దారు సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ లు, సంబంధిత అధికారులు, రైతులు తదితరులు ఉన్నారు.

# ప్రీ-ప్రైమరీ పోస్టుకు రెండు ఇంటర్వ్యూలా?

## ఎంఈఓ స్థాయి తర్వాత మళ్లీ ఆర్డీఓ స్థాయిలోనా?

## ముందస్తు సమాచారం లేకుండానే రెండో ఇంటర్వ్యూ..

## ప్రొసీడింగ్స్‌పై స్పష్టత ఏది?11 ర్చ 1

**కొణిజర్ల, ఆగస్టు 11(మనం న్యూస్):** ఖమ్మం జిల్లాలో ప్రీ-ప్రైమరీ ఇన్స్ట్రక్టర్ పోస్టుల ఎంపిక ప్రక్రియలో రెండు దశల్లో ఇంటర్వ్యూలు జరిగాయన్న అంశం అభ్యర్థుల్లో పలు సందేహాలకు తావిస్తోంది. ఒకే పోస్టుకు ఇప్పటికే త్రిసభ్య కమిటీ ద్వారా ఇంటర్వ్యూ నిర్వహించిన తర్వాత మళ్లీ ఆర్డీఓ స్థాయిలో ఇంటర్వ్యూ ఎందుకు నిర్వహించాల్సి వచ్చిందన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. నెలకు రూ.8 వేల వేతనం ఉన్న ప్రీ-ప్రైమరీ ఇన్స్ట్రక్టర్ పోస్టుకు రెండు చోట్ల ఇంటర్వ్యూలు నిర్వహించాల్సిన అవసరం, దానికి సంబంధించిన విధివిధానాలు ఏమిటన్నది అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు.

### మొదటి ఇంటర్వ్యూ తర్వాత మళ్లీ ఎందుకు?

జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం నుంచి 16-06-2026న జారీ చేసిన ఆర్సీ నం.3596/బి6/ఎస్ఎస్/2026 ప్రొసీడింగ్స్‌పై ప్రీ-ప్రైమరీ ఇన్స్ట్రక్టర్ పోస్టులకు త్రిసభ్య కమిటీ ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఎంఈఓ, ఎంఆర్ఓ, ఎంపీడీఓలతో కూడిన కమిటీ ద్వారా అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ జరిగినట్లు అభ్యర్థులు చెబుతున్నారు. ఈ ప్రక్రియ అనంతరం ఆర్డీఓ స్థాయిలో మళ్లీ ఇంటర్వ్యూ నిర్వహించినట్లు అభ్యర్థులు పేర్కొంటున్నారు. ఈ రెండో ఇంటర్వ్యూకు సంబంధించి తమకు ముందస్తు సమాచారం ఇవ్వలేదని, సర్టిఫికెట్ పరిశీలన కోసం పిలిచిన సమయంలోనే అక్కడికక్కడే ఇంటర్వ్యూ ఉందని చెప్పారని వారు ఆరోపిస్తున్నారు. కొందరిని కేవలం పేరు, విద్యార్హతలు మాత్రమే అడిగారని, సరైన ప్రశ్నలు కూడా అడగలేదని చెబుతున్నారు.

### రెండు చోట్ల ఇంటర్వ్యూలు.. మధ్యలో ఏం జరిగింది?

ఒకే పోస్టుకు మొదటి స్థాయిలో ఇంటర్వ్యూ పూర్తయిన తర్వాత మళ్లీ మరో అధికారి స్థాయిలో ఇంటర్వ్యూ నిర్వహించడానికి కారణమేంటన్నది అభ్యర్థులకు అంతుపట్టడం లేదు. సాధారణంగా ఒక చిన్న వేతనంతో కూడిన పోస్టుకు ఎంపిక ప్రక్రియలో రెండు వేర్వేరు ఇంటర్వ్యూలు ఎందుకు అవసరమయ్యాయి? మొదటి ఇంటర్వ్యూలో వచ్చిన మార్కులు పరిగణనలోకి తీసుకున్నారా? లేక వాటిని పక్కనపెట్టి మళ్లీ మార్కులు కేటాయించారా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

### ఆర్టీఐ, ప్రజావాణి వివరాల్లోనూ తేడా...

త్రిసభ్య కమిటీ ద్వారా వచ్చిన మార్కుల వివరాలను ఆర్టీఐ ద్వారా పొందిన సమాచారంతో పోల్చితే, అదే అభ్యర్థికి ప్రజావాణి ద్వారా వచ్చిన సమాచారంలో వేరే మార్కులు ఉన్నట్లు పత్రాల ద్వారా తెలుస్తోందని అభ్యర్థులు చెబుతున్నారు. ప్రజావాణి దరఖాస్తు నంబర్ డీకేహెచ్ఏఎం13072600012, తేదీ 13-07-2026గా ఉంది.దీంతో త్రిసభ్య కమిటీ మార్కులే తుది కాదా? ఆర్డీఓ స్థాయిలో మళ్లీ మార్కులు కేటాయించారా? ఒకవేళ కేటాయించి ఉంటే దానికి సంబంధించిన అధికారిక ఆదేశాలు ఏమిటి? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### 'రిటర్న్ ఉన్నాయి' అన్న ఆర్డీఓ

ఈ అంశంపై ఆర్డీఓను ఫోన్లో సంప్రదించి రెండో ఇంటర్వ్యూకు సంబంధించిన ప్రొసీడింగ్స్ గురించి వివరణ కోరగా, సంబంధిత ప్రొసీడింగ్స్ డీఈఓ కార్యాలయంలో ఉన్నాయని తెలిపారు. అనంతరం ప్రొసీడింగ్ వివరాలను అడిగినప్పుడు రిటర్న్‌గా ఉన్నాయి అని ఆర్డీఓ సమాధానమిచ్చారు. అయితే రిటర్న్‌గా ఉన్నాయి అంటే ఏ రూపంలో ఉన్నాయో స్పష్టత కావాల్సి ఉంది. అధికారిక ప్రొసీడింగ్స్‌కు సాధారణంగా నంబర్, తేదీ, ఫైల్ వివరాలు తదితరాలు ఉంటాయి. మరి ఈ రెండో ఇంటర్వ్యూకు సంబంధించిన ప్రొసీడింగ్ ఏ రూపంలో ఉంది? దానికి నంబర్, తేదీ ఉన్నాయా? ఎవరి ఆదేశాల మేరకు ఇంటర్వ్యూ నిర్వహించారు? అన్న ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది.ఆర్డీఓ కార్యాలయాన్ని నేరుగా సంప్రదించి లిఖితపూర్వకంగా ప్రొసీడింగ్ కోరగా, ఇన్వార్డులో దరఖాస్తు ఇస్తే ఫైల్ను పరిశీలించి సంబంధిత ప్రొసీడింగ్స్‌ను వెతికి అందిస్తామని కార్యాలయ సిబ్బంది తెలిపారు.

### కలెక్టర్ విచారణకు అభ్యర్థుల డిమాండ్

ఒకే పోస్టుకు రెండు స్థాయిల్లో ఇంటర్వ్యూలు ఎందుకు నిర్వహించాల్సి వచ్చింది? మొదటి త్రిసభ్య కమిటీ ఇంటర్వ్యూ తర్వాత రెండో ఇంటర్వ్యూకు ఎవరి ఆదేశాలు ఉన్నాయి? ముందస్తు సమాచారం లేకుండా అభ్యర్థులను పిలిచి అక్కడికక్కడే ఇంటర్వ్యూ నిర్వహించడానికి కారణమేంటి? రెండు ఇంటర్వ్యూల్లో వచ్చిన మార్కుల్లో ఏవి తుది ఎంపికకు పరిగణనలోకి తీసుకున్నారు? అన్న అంశాలపై సమగ్ర విచారణ జరిపించాలని అభ్యర్థులు కోరుతున్నారు. త్రిసభ్య కమిటీ మార్కులు, ఆర్టీఐ ద్వారా వచ్చిన సమాచారం, ప్రజావాణి వివరాలు, ఆర్డీఓ స్థాయి ఇంటర్వ్యూకు సంబంధించిన ప్రొసీడింగ్స్, మార్కుల పట్టికలను పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, దీనిపై కలెక్టర్ స్థాయిలో విచారణ కమిటీ ఏర్పాటు చేయాలని అభ్యర్థులు కోరుతున్నారు.

# పేదలకండగా కాంగ్రెస్ ప్రభుత్వం

- వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్
- కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**వైరా, ఆగస్టు11 (మనం న్యూస్):** పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని వైరా ఎంఎల్ఏ మాలోత్ రాందాస్ నాయక్ పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి, కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఆడబిడ్డల వివాహం తల్లిదండ్రులకు ఆర్థిక భారం కాకూడదనే ఉద్దేశంతో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న, నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయుక్తంగా నిలుస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమం, రైతుల అభివృద్ధి, మహిళల సాధికారత, యువతకు అవకాశాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. వైరా నియోజకవర్గ ప్రజల సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చిన వెంటనే పరిష్కరించేందుకు నిరంతర అందుబాటులో ఉంటానని, అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, వైస్ చైర్మన్ కట్ల సంతోష్, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ మెడికల్ అండ్ హెల్త్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ, కాంగ్రెస్ పార్టీ మండల పట్టణ అధ్యక్షులు శీలం చంద్రశేఖర్ రెడ్డి, వీరంశెట్టి సీతారాములు ,మార్కెట్ చైర్మన్ బోళ్ళ గంగారావు, పమ్మి అశోక్, ఉండ్రు శ్యాంబాబు, కౌన్సిలర్ మోరు శ్రీకాంత్, లక్కిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, గుమ్మ రోశయ్య, మచ్చ బుజ్జి, మల్లు రామకృష్ణ ఆది ఆనందరావు, వైరా రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## సింగరేణి గ్యాస్ వినియోగదారులు ఈ-కేవైసి చేపించుకోవాలి



**కొత్తగూడెం సింగరేణి, ఆగస్టు 11(మనం న్యూస్):** ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థల ఇ-కేవైసీని పూర్తి చేయడం తప్పనిసరి అని పేర్కొంటూ నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో సింగరేణి సూపర్ బజార్(స్టోర్స్ లిమిటెడ్) ద్వారా ఎల్పిజి గ్యాస్ తీసుకునే వినియోగదారులు అందరూ కూడా ఇ-కేవైసీని పూర్తి చేయాలని జనరల్ మేనేజర్(పర్సనల్) ఐఆర్ అండ్ పిఎం జి.వి.కిరణ్ కుమార్ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. సింగరేణి సూపర్ బజార్ ద్వారా ఎల్పిజి గ్యాస్ కనెక్షన్ ఉన్న వినియోగదారులందరూ ఎల్పిజి సరఫరాకు సంబంధించిన ఇ-కెవైసి ప్రక్రియను ఈనెల 16వ తేదీలోపు పూర్తి చేయాలని సూచించారు. ఇందు కోసం వెంటనే సింగరేణి సూపర్ బజార్ అధికారులను సంప్రదించడం ద్వారా గానీ, లేదా పైన పేర్కొన్న గ్యాస్ సరఫరా కంపెనీల అధికారిక యాప్పు ఇన్స్టాల్ చేసి అప్డేట్ చేసుకోవడం ద్వారా గానీ అవసరమైన ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు.

# సింగరేణిలో సంక్షేమానికే ప్రాధాన్యత

## సింగరేణి జీఎం పర్సనల్ వెల్ఫేర్ అజయ్ కుమార్




**కొత్తగూడెం సింగరేణి, ఆగస్టు 11(మనం న్యూస్):** సింగరేణిలో పనిచేస్తున్న ఉద్యోగుల కాంట్రాక్ట్ కార్మికుల సంక్షేమానికే మొదట ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని సింగరేణి జీఎం(పర్సనల్) వెల్ఫేర్ సిఎస్ఆర్ అండ్ సెక్యూరిటీ కే.అజయ్ కుమార్ అన్నారు. మంగళవారం సింగరేణి ప్రధాన కార్యాలయ హెచ్ఆర్డి కాన్ఫరెన్స్ హాల్ నందు సింగరేణి ఉద్యోగుల కాంట్రాక్ట్ కార్మికులకు సంబంధించిన సిఎంపిఎఫ్ రీఫండ్ పెన్షన్ క్లెయిమ్లను అప్లికేషన్ లో పొందుపరిచే ప్రక్రియపై అవగాహన కలిపించటానికి సింగరేణి-సిఎంపిఎఫ్ఓ సంస్థలు సంయుక్తముగా కొత్తగూడెం రీజియన్ లోని కొత్తగూడెం, ఇల్లందు మణుగూరు ఏరియాల పర్సనల్, ఫైనాన్స్ డిపార్ట్మెంట్ అధికారులతో సంబంధిత సిబ్బందితో ప్రయాస్ సమాధాన్ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిలుగా జిఎం(పర్సనల్) వెల్ఫేర్ సిఎస్ఆర్ అండ్ సెక్యూరిటీ కే.అజయ్ కుమార్, సిఎంపిఎఫ్ రీజనల్ కమిషనర్ లు వంశీధర్ కుసుంభ, ఎం.కనకమ్మలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ బొగ్గు గని ఉద్యోగులకు సంబందించిన పెన్షన్ పిఎఫ్ క్లెయిమ్ లను వేగవంతముగా అప్లికేషన్ ద్వారా పరిష్కరించటం ఈ ప్రయాస్ సమాధాన్ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం అన్నారు. సింగరేణి సంస్థలోని ఉద్యోగులందరికి సి-సిఏఆర్ ఇఎస్ అప్లికేషన్ పై అవగాహన కల్పించటంతో పాటు రెగ్యులర్ ఉద్యోగులతో పాటు ఒప్పంద కార్మికులకు సంబందించిన వివరాలను కూడా నమోదు చేయాలని పెన్షన్ పిఎఫ్ క్లెయిమ్ ల సెటిల్మెంట్ ల విషయంలో ఎటువంటి జాప్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. రీఫండ్ పెన్షన్ క్లెయిమ్లను తప్పులు లేకుండా సకాలంలో సమర్పించడం రిటర్న్ చేయబడిన క్లెయిమ్లను నిర్ణీత సమయంలోపు సమర్పిచాలని తెలిపారు. డిసెంబర్ లో పదవీ విరమణ చేయబోయే సభ్యులకు సంబంధించి వివరాలను సమర్పిచాలని పేర్కొన్నారు. కాంట్రాక్టర్ కార్మికుల ప్రధాన డేటాను ఏర్పాటు చేయటం, సి-సిఏఆర్ ఇఎస్ సభ్యుల లాగిన్ గురించి ఉద్యోగులకు అవగాహన కల్పించాలనేవంటి అంశాలపై వివరించారు.

ఉద్యోగుల రీఫండ్ పెన్షన్ క్లెయిమ్లు సమర్పించే ప్రక్రియలో ఎదుర్కొనే సందేహాలను ఏరియా వారీగా చర్చించి వారికి సలహాలను సూచనలను చేశారు. ఈ సమావేశంలో ఏజిఎం(పర్సనల్) ఎస్.రమేష్, డిజిఎం(పర్సనల్)లు బి.శివ కేశవరావు, ముకుంద సత్యనారాయణ, డిజిఎం(ఎఫ్ అండ్ఏ) సిహెచ్.రమేష్, సీనియర్ పిఓలు ఎం.మురళి, జి.సుధాకర్, కే.శ్రీనివాస్, సిఎంపిఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ పి.చిరంజీవి, ఇతర అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఏకలవ్య రెసిడెన్షియల్‌ను సందర్శించిన ఎమ్మెల్యే జారే

## డ్రగ్స్ వ్యతిరేక అవగాహనా సదస్సు





**దమ్మపేట, ఆగస్టు 11(మనం న్యూస్):** దమ్మపేట మండలం గండుగులపల్లి,లోని తెలంగాణ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను (ఈ.ఎం.ఆర్.ఎస్) అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, సందర్శించారు. ఈ సందర్భంగా నేను సైతం చేయూత విద్యా అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే విద్యాయాత్ర (మన ఎమ్మెల్యే మన బడి)అనే నూతన కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టారు. పాఠశాలలో పోలీస్ అధికారులు ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రగ్స్ వ్యతిరేక వారోత్సవాల అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర అత్యంత కీలమని, డ్రగ్స్ రహిత అశ్వారావుపేట నిర్మాణానికి ప్రతీ విద్యార్థి భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఒక్కసారి మత్తు పదార్థాలకు బానిసైతే జీవితం చీకటిమయం అవుతుందని హెచ్చరిస్తూ చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ మంచి లక్ష్యాలు, చదువు,క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థుల్లో చైతన్యం పెంపొందిం చేందుకు వ్యాసరచన చిత్రలేఖన పోటీలు నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.అనంతరం ఉపాధ్యాయులు బోధిస్తున్న విధానాన్ని, విద్యా ప్రమాణాలను పరిశీలించిన ఎమ్మెల్యే తరగతి గదులు హాస్టల్, తాగునీరు ఇతర మౌలిక వసతులను తనిఖీ చేశారు. విద్యార్థులకు నిరంతరం నాణ్యమైన విద్య,సౌకర్యాలు అందేలా చూడాలని అధికారులకు,ఉపాధ్యాయులకు ఆదేశించారు.అనంతరం విద్యార్థులతో కలిసి ఆత్మీయంగా టిఫిన్ చేస్తూ వారి సమస్యలు, చదువు విశేషాలను అడిగి తెలుసుకున్నారు.నియోజక వర్గంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఇదప్ప ,దమ్మపేట మండలం ట్రైనింగ్ డిప్యూటీ కలెక్టరు ఎం మురళి, ఎంపీడీఓ రవీంద్ర రెడ్డి, ఎంఈఓ జగపతి రావు,సిఐ నాగరాజు , ఎస్ ఐ రాజేష్ కుమార్ ,మాజీ సర్పంచ్ మడకం రాజేష్,యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాక రమేష్ ,స్థానిక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అట్రాసిటీ చట్టాన్ని పకడ్బంధీగా అమలు చేయాలి

- ప్రతి అంశంపై చర్యలు తీసుకుని నివేదిక ఇవ్వాలి...
- బాధితులకు పరిహారం విడుదలలో జాప్యం చేయొద్దు
- కేసుల దర్యాప్తు, కోర్టు కేసుల ఫాలో అప్ పై ప్రత్యేక దృష్టి సారించాలి
- అట్రాసిటీ చట్టం మానిటరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ దివాకర టిఎస్



**ఖమ్మం, ఆగస్టు 11(మనం బ్యూరో):** ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం అమలుకు సంబంధించి జిల్లా, మండల, గ్రామ స్థాయిలో గుర్తించిన ప్రతి సమస్యను పరిష్కరించి, తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో పోలీస్ కమీషనర్ సునీల్ దత్తో కలిసి జిల్లా కలెక్టర్, జిల్లా స్థాయి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ముందుగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం అమలు తీరుపై ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా స్థాయిలో సమీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిలో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు ప్రస్తావించిన ప్రతి అంశంపై సంబంధిత అధికారులు తప్పనిసరిగా చర్యలు తీసుకుని యాక్షన్ టేకెన్ రిపోర్ట్ సమర్పించాలని స్పష్టం చేశారు. ప్రతి నెల మండల స్థాయిలో నిర్వహించే సివిల్ రైట్స్ డే కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. తహశీల్దార్లు, పోలీస్ అధికారులు సమన్వయంతో ఈ కార్యక్రమాలను నిర్వహించాలని, ప్రతి మండలంలో కనీసం 100 మంది పాల్గొనేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం మానిటరింగ్ కమిటీ సభ్యులకు గుర్తింపు కార్డులు జారీ చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ గుర్తింపు కార్డులు కేవలం సభ్యుల గుర్తింపు కోసం మాత్రమేనని, ఎలాంటి ప్రోటోకాల్ లేదా ప్రాధాన్యత కల్పించేందుకు కాదని స్పష్టం చేశారు. కమిటీ సభ్యులు సివిల్ రైట్స్ డే కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలకు చట్టంపై అవగాహన కల్పించాలని సూచించారు. మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. డ్రగ్స్ నియంత్రణకు ఈగల్ వంటి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తమకు తెలిసిన ఎవరైనా మాదకద్రవ్యాల వంటి కొత్త అలవాట్లకు గురైతే అధికారులకు సమాచారం అందించాలని, వారికి అవసరమైన సహాయం అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ పాఠశాలలను సందర్శించి చేసిన సిఫార్సులను పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా అమలు చేసేందుకు ప్రయత్నిస్తామని కలెక్టర్ తెలిపారు. సంబంధిత అధికారులు అవసరమైన సిఫార్సులు, నివేదికలను అందించాలని సూచించారు. పేదలు, అణగారిన వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని కలెక్టర్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు ప్రభుత్వం మంజూరు చేసిన పరిహారం త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైన వెంటనే అర్హులైన బాధితులకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిహారం వెంటనే విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పోలీసుల విచారణ పూర్తై నివేదిక అందిన తర్వాత ఏ ఫైలును పెండింగ్లో ఉంచరాదని, పరిహారం ఫైళ్లను ప్రాధాన్యత ప్రాతిపదికన వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు.ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం క్రింద నమోదైన అన్ని కేసుల పురోగతిని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. కోర్టుల్లో ఉన్న అన్ని కేసులను సమర్థవంతంగా ఫాలోఅప్ చేయాలని, బాధితులకు సకాలంలో న్యాయం అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సిపి సునీల్ దత్ మాట్లాడుతూ 2026 సంవత్సరంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం క్రింద 62 ఫిర్యాదులు అందాయని తెలిపారు. విచారణ అనంతరం 9 ఫిర్యాదులు తప్పుడు ఫిర్యాదులుగా తేలాయని, 53 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టానికి సంబంధించిన కేసుల్లో ఛార్జిషీట్ దాఖలు చేసి, కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి, బాధితులకు సకాలంలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం మానిటరింగ్ కమిటీ సభ్యులు ఖమ్మం జిల్లాలో 101 ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు బీఏఎస్ పథకాన్ని విస్తరించినందుకు జిల్లా కలెక్టర్ను అభినందించారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలను ప్రశంసించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ విజయలక్ష్మి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం మానిటరింగ్ కమిటీ సభ్యులు, ఎస్సీ అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి, ఎస్సీ కార్పొరేషన్ ఇడి ముజాహిద్, డిఆర్డిఓ శ్రీరామ్, డిఎంహెచ్ఓ డాక్టర్ రామారావు, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, డి.డబ్ల్యు.ఓ, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస రావు, సంబంధిత కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

మనం Manam Mahabubnagar మహబూబ్ నగర్

# అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్తున్న మన ప్రభుత్వం

## రహదారుల విస్తరణ, మరమ్మత్తులకు ప్రత్యేక నిధులు

### ప్రజా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి

### కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావు



**ఉమ్మడి మహబూబ్ నగర్ ఆగస్టు 11 (మనం బ్యూరో):** కొల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నానని, సంక్షేమ పథకాల అమలుతో పాటు మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. నియోజకవర్గంలోని రహదారుల విస్తరణ, మరమ్మతులకు అవసరమైన నిధులు మంజూరు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఏడుల మండల పరిధిలోని లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మంగళవారం మంత్రి జూపల్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మొత్తం 36 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడేలా రహదారుల విస్తరణ, మరమ్మతుల పనులకు నిధులు మంజూరు చేస్తున్నామని చెప్పారు. గతంలో నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన మాజీ ఎమ్మెల్యే అభివృద్ధిపై దృష్టి సారించలేదని, నియోజకవర్గానికి చేసిందేమీ లేదని విమర్శించారు. పిల్లలకు విద్యతో పాటు విలువలు, సంస్కారం నేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని మంత్రి సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లలు వ్యసనాల బారిన పడకుండా తల్లిదండ్రులు వారిపై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని చెప్పారు. పిల్లల స్నేహాలు, వారి నడవడికపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని సూచించారు. కుటుంబంలో మంచి వాతావరణం కల్పించడం ద్వారా పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దాలని మంత్రి కోరారు.

# శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌తో.. గమ్యం సులభం...

**శ్రీశైల క్షేత్రం వరకు ఎలివేటెడ్ కారిడార్ ఫోర్ వే లైన్ ను ప్రతిపాదనలు సంసిద్ధం**

**మన్ననూర్, పాతాళ గంగ మీదుగా 54 కి. మీ కారిడార్ పనులకు గ్రీన్ సిగ్నల్**

**రెండు తెలుగు రాష్ట్రాలకు వాణిజ్య, వ్యాపార లాభదాయకం పెరిగే సూచన**

**ఫ్యూచర్ దృష్టిలో పెట్టుకొని 2 లైన్ల కు బదులు 4 లైన్లు గ్రీన్ సిగ్నల్**

**దాదాపు రెండు లక్షలపైబడి చెట్లపై ప్రభావం పడే అవకాశం**



**ఉమ్మడి మహబూబ్ నగర్ ఆగస్టు 11 (మనం బ్యూరో):** శ్రీశైల మల్లన్న పుణ్యక్షేత్రానికి ప్రయాణికులకు మరింత సుగమతరం అయ్యేందుకు ఎలివేటెడ్ కారిడార్ ఒకే పిల్లర్ పై 4 లైన్ల కు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇదివరకే శ్రీశైలం వెళ్లేందుకు రెండు లైన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ ఏర్పాటు కోసం రెండు లైన్ల కు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. రానున్న రోజుల్లో శ్రీశైలంకు భక్తులు, ప్రయాణికులు అధికంగా రావడంతో పాటు వాహనాల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్నందున 2 లైన్లను 4 లైన్లకు పెంచితే రెండు తెలుగు రాష్ట్రాలకు వాణిజ్య, వ్యాపార రంగంలో లాభదాయకంగా ఉండే అవకాశం ఉన్నందున ఈ కీలక నిర్ణయంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది...! ఈ భారీ ప్రాజెక్టును కేంద్ర రోడ్డు, రవాణా మంత్రిత్వ శాఖ (మోర్త్) నుంచి భారత జాతీయ రహదారుల ప్రాధికర సంస్థ (ఎన్ ఎన్ హెచ్ ఏ ఐ) బదిలీ చేసింది. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులు కొనసాగితే హైదరాబాద్ తుక్కుగూడ అవుటర్ రింగ్ రోడ్డు నుండి కడ్తల్, ఆమనగల్, డిండి, మన్ననూర్ వరకు దాదాపు రెండు లక్షల చెట్లపై ప్రభావం పడే అవకాశం ఉందని అంచనా వేశారు...? హైదరాబాద్ నుండి తుక్కుగూడ, కడ్తల్, ఆమనగల్, డిండి, మన్ననూర్, పాతల గంగ మీదుగా శ్రీశైలం నేషనల్ హైవే వెళ్లే వారికి గంటల తరబడి ప్రయాణం కొనసాగుతుంది. ఈ ఎలివేటెడ్ కారిడార్ చేపడితే ప్రయాణం రెండు లేదా మూడు గంటల్లోనే గమ్యానికి చేరుకోవచ్చని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇదివరకే అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ లో ఎలివేటెడ్ కారిడార్ చేపడితే అడవిలో సంచరించే వన్యమృగాలకు ఎలాంటి ఆటంకులు తలెత్తవని ఉద్దేశంతో ముందస్తు ప్రణాళికలకు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా ఎలివేటెడ్ కారిడార్ రహదారి అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ లో ఉన్న మన్ననూరు గ్రామం నుండి పాతాళ గంగ వరకు దాదాపు 55 కిలోమీటర్ల మేర నిర్మాణం చేపట్టబోతుందని తెలుస్తుంది. రెండు లైన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనుల కోసం ఇదివరకే రూ. 7,668 కోట్లు అవసరమని (డిపీఆర్) పేర్కొంది. ఉన్నట్లుండి ఈ ప్రాజెక్టు నిర్మాణం, నిర్మాణ బాధ్యతలను ఎన్ హెచ్ ఏ ఐ కి కేంద్రం బదిలీ చేసింది. రాబోయే భవిష్యత్తు ను దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం రెండు లైన్లుగా ఉన్న ఎలివేటెడ్ కేరిడార్ నాలుగు లైన్లుగా ఏర్పాటు చేసి తీరాలని ఒక అంచనాకు రావడం పట్ల బడ్జెట్ మరింత పెరిగే అవకాశం ఉందని నిర్ధారణ చేస్తూ అంచనా చేస్తున్నారు. హైదరాబాద్ నడి బొడ్డు నుండి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి చేరుకొని మళ్లీ అదే రోజు తమ తమ గమ్యస్థానాలకు తిరిగి వెళ్లే అవకాశం సులభతరం కానుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ ఎలివేటెడ్ కారిడార్ వల్ల అటు వన్యమృగాలకు, ఇటు శ్రీశైలం ఎమ్మెల్యే భక్తులకు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు ఎంతో మేలు చేకూరుతుందని పలువురు చర్చించుకుంటున్నారు.

# చిన్నారులకు మెరుగైన పోషకాహారం, ఆరోగ్య సేవలు అందించాలి

- అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి
- చిన్నారుల ఎత్తు, బరువు వివరాలను పరిశీలించిన కలెక్టర్



**ఉమ్మడి మహబూబ్ నగర్ ఆగస్టు 11 (మనం బ్యూరో):** అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు అందుతున్న పోషకాహారం, ఆరోగ్య సేవలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నాగర్ కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని తిమ్మాజీపేట మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి అక్కడ అందుతున్న సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో నమోదైన చిన్నారుల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పిల్లల వయస్సుకు అనుగుణంగా వారి ఎత్తు, బరువు ఉన్నాయా లేదా అనే అంశాన్ని పరిశీలించారు. ఇందుకోసం కేంద్రంలో అందుబాటులో ఉన్న ఎత్తు, బరువు కొలిచే పరికరాలను పరిశీలించారు. చిన్నారుల శారీరక ఎదుగుదలను క్రమం తప్పకుండా నమోదు చేయాలన్నారు. వయస్సుకు తగ్గ ఎత్తు, బరువు లేని పిల్లలను గుర్తించి వారికి అవసరమైన అదనపు పోషకాహారం, ఆరోగ్య సేవలు అందించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రం ద్వారా చిన్నారులకు అందిస్తున్న బాలామృతం పంపిణీపై కూడా కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాలామృతం సకాలంలో సరఫరా అవుతున్నదా అని వివరంగా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అర్హులైన పిల్లలందరికీ నిర్ణీత పరిమాణంలో పంపిణీ చేస్తున్నారా, పంపిణీ వివరాలను రికార్డుల్లో నమోదు చేస్తున్నారా అనే అంశాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం అర్హులైన ప్రతి చిన్నారికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా చేరేలా చూడాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రం ద్వారా గర్భిణీలు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారంపై కూడా కలెక్టర్ వివరాలు తెలుసుకున్నారు. తల్లీ బిడ్డల ఆరోగ్య పరిరక్షణకు పోషకాహారం ఎంతో కీలకమని పేర్కొన్నారు. గర్భిణీలు, బాలింతలకు ప్రభుత్వం నిర్దేశించిన మేరకు పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా అందించడంతో పాటు, వారి ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందుతున్న సేవల విషయంలో సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారం, ప్రాథమిక విద్య, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కేంద్రానికి వచ్చే ప్రతి చిన్నారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తూ, పోషకాహార లోపం ఉన్న పిల్లలను ముందుగానే గుర్తించి సంబంధిత వైద్య, ఆరోగ్య శాఖల సహకారంతో అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ, పోషకాహార కార్యక్రమాల ప్రధాన లక్ష్యం తల్లులు, చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించి వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచడమేనని కలెక్టర్ పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో ఈ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలయ్యేలా అధికారులు, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కలెక్టర్ సందర్శన సందర్భంగా అంగన్వాడీ కేంద్రం సిబ్బంది చిన్నారులకు అందిస్తున్న సేవలు, పౌష్టికాహార పంపిణీ, పిల్లల హాజరు, గర్భిణీలు, బాలింతలకు అందుతున్న సేవలకు సంబంధించిన వివరాలను కలెక్టర్కు, జిల్లా ఇన్చార్జి సంక్షేమ శాఖ అధికారి డీఆర్ఓ పాండు వివరించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రం పరిసరాలను పరిశీలించిన కలెక్టర్, పరిశుభ్రతను పాటిస్తూ చిన్నారులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని సూచించారు. అనంతరం అధికారులతో కలిసి అంగన్వాడీ కేంద్రం ఆవరణలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట డిఆర్ఓ ఇంచార్జ్ సంక్షేమ శాఖ అధికారి పాండు, మండల స్థాయి గ్రామ సర్పంచ్ కవిత, తదితరులు ఉన్నారు.

# చేయూత దరఖాస్తులు నెలాఖరులోగా సమర్పించాలి

- కలెక్టర్ రాహుల్ శర్మ



**భూపాలపల్లి ఆగస్టు 11 మనం ప్రతినిధి:** చేయూత సామాజిక భద్రత పింఛన్ల మంజూరుకు ఆగస్టు 31లోగా దరఖాస్తులు సమర్పించాలని కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో కలెక్టర్ చాంబర్ నందు చేయూత సామాజిక భద్రత పింఛన్లు మంజూరుకు దరఖాస్తులు చేయు అంశంపై డీఆర్డీఓతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత సామాజిక భద్రత పింఛన్ల పథకంలో భాగంగా అర్హులైన కొత్త లబ్ధిదారులకు పింఛన్లు మంజూరుకు దరఖాస్తు లు స్వీకరించాలని తెలిపారు. ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, కల్లు గీత కార్మికులు చేనేత కార్మికులు, బోదకాలు, తలసేమియా, సికిల్ సెల్ డిసీజ్, హిమోఫిలియా వంటి రక్త రుగ్మతలతో బాధపడుతున్న వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల గ్రామసభలు, ప్రజావాణి కార్యక్రమాల్లో ఇప్పటికే అవసరమైన ఆధారాలతో దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. అర్హులైన వారు అవసరమైన ధృవీకరణ పత్రాలతో తమ దరఖాస్తులను ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు వద్ద సమర్పించి తప్పనిసరిగా రసీదు పొందాలని కలెక్టర్ సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ నిర్ణీత గడువులోగా అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డిఆర్డీఓ బాలకృష్ణ, డిపిఎం రవి తదితరులు పాల్గొన్నారు.

# డిజిటలైజేషన్ లో ఉమ్మడి జిల్లాలో గద్వాలకు మొదటి స్థానం

### 87.31 శాతం డిజిటలైజేషన్ పూర్తి

### ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతం చేసేందుకు కృషి

### జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**ఉమ్మడి మహబూబ్ నగర్ 11 (మనం బ్యూరో):** ఎస్ఐఆర్ ( స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియలో భాగంగా మొదట నిర్వహించిన ఇంటింటి సర్వే అనంతరం ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ లో జోగులాంబ గద్వాల జిల్లా ఉమ్మడి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచిందని జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్యుమరేషన్ పత్రాలను ఫిలప్ చేసి ఇచ్చిన వారి వివరాలను 87.31 శాతం డిజిటలైజేషన్ చేయడంతో ఓటర్ జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను జిల్లాలో విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. జిల్లాలో 63,925 అన్ కలెక్టబుల్ ఫారమ్స్ ఉన్నట్లు చెప్పారు. ఆగస్టు 17వ. తేదీన ముసాయిదా ఓటర్ జాబితా ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. ఆగస్టు 17 వ. తేదీ నుంచి సెప్టెంబర్ 16 వరకు ముసాయిదా ఓటరు జాబితా పై అభ్యంతరాలను స్వీకరించడం జరుగుతుందన్నారు. ఓటర్ల పేర్లు, ఇంటి పేర్లు, తదితర తప్పిదాలు ఉన్న అనామిలెస్ ఓటర్లు నోటీసులు అందుకున్న తర్వాత కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన 12 డాక్యుమెంట్స్ లో ఏదైనా ఒకటి సమర్పించాల్సి ఉంటుందన్నారు. సంబంధిత అధికారుల వెరిఫికేషన్ అనంతరం తప్పిదాలను సరిచేసి అక్టోబర్ 19న. ఫైనల్ ఓటరు జాబితాను ప్రచురించడం జరుగుతుందని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

# పేకాట రాయుళ్ల అరెస్టు



- పేకాట స్థావరంపై సిసిఎస్ బృందం దాడి
- 9 మంది పట్టివేత

**భూపాలపల్లి ఆగస్టు 11 మనం ప్రతినిధి:** భూపాలపల్లి జిల్లా ఘనపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సీతారాంపూర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న స్థావరంపై సిసి ఎస్ బృందం మంగళవారం సాయంత్రం దాడి నిర్వహించింది. ఈ దాడిలో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 7,990 నగదు, రెండు ద్విచక్ర వాహనాలు, తొమ్మిది మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.అదుపులోకి తీసుకున్న వ్యక్తులతో పాటు స్వాధీనం చేసుకున్న సామగ్రిని తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం ఘనపూర్ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ కు అప్పగించారు.ఈ ఘటనలో మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

# 129లోనే బస్టాండ్ నిర్మించాలి

- వార్డు సభ్యుడు సయ్యద్ ఇమ్రాన్



**మహదేవపూర్, ఆగస్టు 11 మనం న్యూస్:** భూపాలపల్లి జిల్లామహదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామంలో అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న సర్వే నంబర్ 129లో శాశ్వత బస్టాండ్ నిర్మించాలని 9వ వార్డు సభ్యుడు సయ్యద్ ఇమ్రాన్ కోరారు. ఈ మేరకు స్థానికులతో కలిసి జిల్లా అదనపు కలెక్టర్ అశోక్ కుమార్కు ఆయన వినతిపత్రం అందజేశారు.తెలంగాణ ప్రభుత్వం అంగరంగ వైభవంగా నిర్వహించిన సరస్వతీ పుష్కరాల ఉత్సవాల సందర్భంగా ఇదే ప్రాంతంలో తాత్కాలిక బస్టాండ్ ఏర్పాటు చేసినట్లు సయ్యద్ ఇమ్రాన్ తెలిపారు. తాత్కాలిక బస్టాండ్ ఏర్పాటు చేయడంతో ఆ ప్రాంతంలో ప్రయాణికుల రాకపోకలు పెరగడంతో పలువురు చిరువ్యాపారులు అక్కడ దుకాణాలు, వ్యాపార సముదాయాలను ఏర్పాటు చేసుకున్నారని పేర్కొన్నారు. దీంతో ఈ ప్రాంతం ప్రజలకు, ప్రయాణికులకు అనుకూలమైన వాణిజ్య కేంద్రంగా కూడా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు.ప్రతి పుష్కర సమయంలో సర్వే నంబర్ 129లోని హనుమాన్ ఆలయం ఎదుట తాత్కాలిక బస్టాండ్ ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే బస్టాండ్ నిర్వహణకు అనుకూలంగా ఉన్న ఈ ప్రాంతంలోనే శాశ్వత బస్టాండ్ నిర్మిస్తే కాళేశ్వరం గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాలు, కాళేశ్వరం పరిధిలోని పలు వార్డుల ప్రజలకు కూడా ప్రయోజనం కలుగుతుందని అన్నారు.500 మందికి పైగా ప్రజల సంతకాలు అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న ఈ స్థలంలోనే బస్టాండ్ నిర్మించాలన్న డిమాండ్కు గ్రామ ప్రజల నుంచి విస్తృత మద్దతు లభించిందని సయ్యద్ ఇమ్రాన్ తెలిపారు. 500 మందికి పైగా ప్రజలు సంతకాలు చేసి తమ మద్దతు తెలిపారని వెల్లడించారు.ఇక్కడ శాశ్వత బస్టాండ్ నిర్మిస్తే గ్రామ అభివృద్ధి మరింత వేగవంతం కావడంతో పాటు కాళేశ్వరం గ్రామ విస్తీర్ణం కూడా పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అధికారులు సర్వే నంబర్ 129లోనే శాశ్వత బస్టాండ్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాళేశ్వరం గ్రామానికి చెందిన ఆడప సంతోష్, మబ్బు సాయికిరణ్, తోట చంద్రశేఖర్ తదితర స్థానికులు పాల్గొన్నారు.

# దోమల నివారణకు పిచికారీ



**టేకుమట్ల ఆగస్టు 11 మనం న్యూస్:** టేకుమట్ల మండలం దుబ్యాల గ్రామంలో వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా గ్రామ సర్పంచ్ సంగీ అంజలి ఆధ్వర్యంలో మంగళవారం పంచాయతీ సిబ్బందితో కలిసి ప్రత్యేకంగా దోమల నివారణ మందు పిచికారీ చేపించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సంగీ అంజలి మాట్లాడుతూ. వర్షాల వల్ల నీరు నిల్వ ఉండి దోమలు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని, అందుకే ముందుస్తు జాగ్రత్త చర్యగా గ్రామంలోని అన్ని వీధులు, మురికి కాలువలు, మరియు రద్దీ ప్రాంతాల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయించినట్లు తెలిపారు.గ్రామ ప్రజలు కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్ల ముందు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ఆమె సూచించారు. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

# ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్



**ఉమ్మడి మహబూబ్ నగర్ ఆగస్టు 11 (మనం బ్యూరో):** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఈవీఎం గోడౌన్ ను ఈవీఎంల నెలవారి సాధారణ తనిఖీలో భాగంగా మంగళవారం కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సందర్శించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు, సిబ్బందికి సూచించారు. సందర్శనలో భాగంగా తనిఖీ రిజిస్టర్ లలో కలెక్టర్ సంతకాలు చేశారు. ఈ తనిఖీలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు మంజుల, ఎన్నికల ఉప తహసిల్దార్ ఉదయ్ కిరణ్, ఆర్ఐ వెంకటేశ్వర్ రెడ్డి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# కేసుల పరిష్కారంలో రాజీ మార్గం ఉత్తమమైనది

**టేకుమట్ల ఆగస్టు 11 మనం న్యూస్:** కేసుల పరిష్కారంలో రాజీమార్గమే ఉత్తమమైనదని లీలలు డిఫెన్స్ కౌన్సిల్ పుప్పాల శ్రీనివాస్ తెలిపారు. సోమనపల్లి కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్ లో మంగళవారం నాడు న్యాయ అవగాహనా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పుప్పాల శ్రీనివాస్ మాట్లాడుతూ సమస్యలు తలెత్తినప్పుడు, ఇదివరకే నమోదైన కేసుల్లో రాజీ, మధ్యవర్తిత్వం ఉత్తమమైనది అని తెలిపారు. డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కే. అక్షయ,సూపరింటెండెంట్‌రఘురామ్ లు మాట్లాడుతూ మీడియేషన్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలన్నారు. అనంతరం అంకుశపురం, టేకుమట్ల, చిట్యాల గ్రామాల్లో న్యాయ అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఎస్త్సై అమూల్య, అంకుశపురంసర్పంచ్ తోటసునీతసాగర్, స్థానిక నాయకులు పోతనవేణి ఐలయ్య, బొల్లపెల్లి శ్రీనివాస్,థౌటం నవీన్,మారాపెల్లి మల్లేష్, ఎలుకటి రాజయ్య, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది దేవేందర్, కే. మహిత, రమ్య, అలేఖ్య, కే. వెంకటేష్, ఎమ్. రాజ్ కుమార్, గౌతమి, మీడియేటర్ అంబాల ఆనందం, పారా లీగల్ వాలంటీర్స్ అంబాల రమేష్, అరెపెల్లి తిరుపతి,బండారి రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# దూరవిద్యను సద్వినియోగం చేసుకోవాలి

- సార్వత్రిక విద్యతో ఉన్నత చదువులకు మరింత అవకాశం



**ఉమ్మడి మహబూబ్ నగర్ ఆగస్టు 11 (మనం బ్యూరో):** చదువును మధ్యలో ఆపేసిన వారికి తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం దూరవిద్య విధానం ద్వారా తిరిగి చదువుకునే అవకాశాన్ని కల్పిస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం (టాస్) 2026-2027 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎస్ఎస్ సి, ఇంటర్ లో ప్రవేశాల గోడపత్రికలను జిల్లా కలెక్టర్ అధికారులతో కలిసి విడుదల చేశారు. ఎస్ఎస్ సి లో చేరేందుకు ఆగస్టు 31 నాటికి 14 సంవత్సరాల వయస్సు నిండిన వారు అర్హులన్నారు. దినికి గాను ఎలాంటి విద్యార్హతలు అవసరం లేదన్నారు. ఇంటర్ కు సంబంధించి ఆగస్టు 31 నాటికి 15 సంవత్సరాల వయస్సు నుండి ఉండాలన్నారు. గుర్తింపు పొందిన బోర్డు నుండి పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని లేదా ఇతర బోర్డులలో ఇంటర్ ఫెయిల్ అయిన వారు కూడా అర్హులని తెలిపారు. రెండింటికి గరిష్ట వయో పరిమితి లేదన్నారు. సంబంధిత వెబ్సైట్ ద్వారా ఈనెల 17వ. తేదీలోగా జరిమానాతో ఈనెల 29వ. తేదీ వరకు ఆన్లైన్లో ప్రవేశాలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి, టాస్ జిల్లా కోఆర్డినేటర్ సునీతమ్మ, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గజ్వేల్‌పై టిఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రత్యేక దృష్టి



**గజ్వేల్ ఆగస్టు 11 మనం న్యూస్:** సామాజిక తెలంగాణ సాధన లక్ష్యంగా ఏర్పాటైన తెలంగాణ రక్షణ సేన మండల కమిటీలు వారం రోజుల్లో పూర్తి చేయనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, గజ్వేల్ నియోజకవర్గ ఇన్చార్జి కొట్టాల యాదగిరి ముదిరాజ్ స్పష్టం చేశారు. మంగళవారం గజ్వేల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కమిటీల్లో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలతో పాటు ఉద్యమకారులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా రెండున్నర దశాబ్దాలుగా గజ్వేల్ నియోజకవర్గంలో పనిచేసిన ఉద్యమకారులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలో న్యాయం జరగదనే విషయాన్ని వెనుకబడిన వర్గాలు అర్థం చేసుకొని తమతో కలిసి రావాలని సూచించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి టిఆర్ఎస్ బలోపేతం లక్ష్యంగా, ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని అన్నారు. పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత గజ్వేల్ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారిస్తుండగా, శ్రేణులు పార్టీ బలోపేతం లక్ష్యంగా అన్ని వర్గాలతో కలిసి ఐక్యంగా సాగాలని వివరించారు.

# అధికార, ప్రతిపక్షాల పోటాపోటీ నిరసనలు



ఢిల్లీ, ఆగష్టు 11 : అధికార, విపక్షాల నిరసనలతో పార్లమెంట్ ప్రాంగణంలో కొంతసేపు గందరగోళం నెలకొంది. దిల్లీలో నిరసనకారులపై పోలీసుల దాడి గురించి హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్లో మాట్లాడాలని.. అయోధ్య రామ మందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలపై చర్చ జరపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. మరోవైపు ఝార్ఖండ్లో విద్యార్థులపై పోలీసుల లాఠీ ఛార్జీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మాట్లాడాలని భాజపా ఎంపీలు నినాదాలు చేశారు. దిల్లీ విషయంలో మీడియాలో చర్చలు జరిపిన రాహుల్ ఝార్ఖండ్ విషయంలో ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ఇరువర్గాల పోటాపోటీ నిరసనలతో పార్లమెంట్ ఆవరణలో గందరగోళం నెలకొంది. మరోవైపు లోక్సభలో చర్చలు జరుగుతుండగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్ష సభ్యులు ప్లకార్డులు ప్రదర్శించడంతో స్పీకర్ ఓం బిర్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్థవంతమైన చర్చలు జరపాలని హితవు పలికారు. ప్రతిపక్షాల నినాదాల మధ్య సభ రేపటికి వాయిదా పడింది వర్షాకాల సమావేశాలు మొదలైనప్పటి నుంచి పార్లమెంట్లో వాయిదాల పర్వం కొనసాగుతోంది. సమావేశాలు తుదిదశకు చేరుకుంటుండటంతో.. అధికార విపక్షాల మధ్య రాజకీయ పంతం మరింత పెరిగింది. జంతర్మంతర్ వద్ద విద్యార్థుల ఆందోళనలు, పోలీసు చర్యపై విపక్షాలు కోరినట్లుగా... హోంమంత్రి అమిత్షా సభలో సమాధానం ఇవ్వటానికి సిద్ధమని కేంద్రం సోమవారం ప్రకటించగా... ఊరికే ప్రసంగాలు కాదు... మేం అడిగిన ప్రశ్నలకే సమాధానం ఇవ్వాలంటూ కాంగ్రెస్ నేత రాహుల్గాంధీ మెలిక పెట్టారు.

# 365 రోజుల్లో 8,000 క్వాలిఫైడ్ వాచ్ అవర్స్

## యూట్యూబర్లకు మానిటైజేషన్ నిబంధనల్లో మార్పు




హైదరాబాద్, ఆగష్టు 11 : కొత్త యూట్యూబర్లకు కష్టకాలం వచ్చింది. మానిటైజేషన్కు అవసరమైన వాచ్టైమ్ను ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్ఫాం యూట్యూబ్ రెట్టింపు చేసింది. క్రియేటర్లు వీడియోల ద్వారా డబ్బు సంపాదించడానికి వీలు కల్పించే యూట్యూబ్ పార్ట్ నర్ ప్రోగ్రామ్లో చేపట్టిన మార్పుల్లో భాగంగా ఈ చర్యలు తీసుకున్నట్లు యూట్యూబ్ వెల్లడించింది. ఇంతకు ముందు.. డబ్బు సంపాదించాలంటే కంటెంట్ క్రియేటర్లుకు గత 365 రోజుల్లో 4,000 వాచ్ అవర్స్ లేదా 10 మిలియన్ షార్ట్స్ వ్యూస్ ఉండాలి. అయితే.. కొత్త నిబంధనల ప్రకారం గత 365 రోజుల్లో 8,000 క్వాలిఫైడ్ వాచ్ అవర్స్ లేదా గత 90 రోజుల్లో 20 మిలియన్ల షార్ట్స్ వీక్షణలు ఉండాలి. 1,000 మంది సబ్ స్రైబర్లు ఉండాలనే నియమంలో మాత్రం ఎటువంటి మార్పు లేదని తెలిపింది. అయితే ఇప్పటికే యూట్యూబ్ పార్ట్నర్ ప్రోగ్రామ్లో ఉన్న క్రియేటర్లపై ఈ ప్రభావం ఉండబోదని పేర్కొంది. ప్రోగ్రామ్లో ఇప్పటికే 3 మిలియన్లకు పైగా కంటెంట్ క్రియేటర్లు ఉన్నారు. ఈ నిబంధనలు 2027 ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి రానున్నట్లు యూట్యూబ్ వెల్లడించింది. యూట్యూబ్ షార్ట్స్ ద్వారా వచ్చే ఆదాయం కోసం కూడా ఈ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్ఫాం కొత్త నిబంధన ప్రవేశపెట్టింది. వీటి ద్వారా ప్రకటనలు, సబ్స్క్రిప్షన్ ద్వారా వచ్చే ఆదాయాన్ని పంచుకోవడానికి అర్హత పొందాలంటే క్రియేటర్లు 90రోజుల వ్యవధిలో 10 మిలియన్ల షార్ట్స్ వ్యూస్ కలిగి ఉండాలి. ఈ నిబంధన కొత్త క్రియేటర్లతో పాటు ఇప్పటికే ఉన్నవారికి కూడా వర్తిస్తుంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 1నుంచి ఇది అమల్లోకి వస్తుంది.

## వైద్యులకు లంచాలు..

### అమెరికాలో భారత సంతతి వ్యక్తికి జైలు

మసాచుసెట్, ఆగష్టు 11 : భారత సంతతికి చెందిన వ్యక్తికి అమెరికా ఫెడరల్ కోర్టు నాలుగు నెలల జైలు శిక్ష.. 9,500 డాలర్ల జరిమానా విధించింది. వెన్నెముక శస్త్రచికిత్సల్లో తమ సంస్థ పరికరాలను వినియోగించేలా వైద్యులకు లంచాలు ఇచ్చిన కేసులో ఈ తీర్పునిచ్చింది. జైలు శిక్ష పూర్తికాగానే ఏడాది పాటు అధికారుల పర్యవేక్షణలో ఉండాలని తెలిపింది. మసాచుసెట్స్లోని కేంబ్రిడ్జ్కు చెందిన ఆదిత్య హుమద్ వైద్యులకు లంచాలు ఇచ్చేందుకు కుట్ర పన్నినట్లు గతంలో నేరాన్ని అంగీకరించారు. స్పైన్ ఫ్రంటియర్ సంస్థ వ్యవస్థాపకుడు, సీఈఓ కింగ్స్లే చిన్తో కలిసి ఆయనపై 2021 సెప్టెంబరులో కేసు నమోదైంది. హుమద్ ఆ కంపెనీలో చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్గా పనిచేశారు. వారి సంస్థకు చెందిన వెన్నెముక పరికరాలను శస్త్రచికిత్సల్లో ఉపయోగించేలా వైద్యులను ప్రలోభపెట్టినట్లు అమెరికా న్యాయశాఖ తెలిపింది. ఈ వ్యవహారంలో హుమద్, ఆయన సంస్థలు, లంచాలు తీసుకున్న వైద్యుల నుంచి ఇప్పటివరకు రూ.40 లక్షల డాలర్లకు పైగా స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొంది.

# అమెరికాకు ఆంక్షల వ్యసనం పట్టింది

## ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి



టెహ్రాన్, ఆగష్టు 11 : తమ దేశంపై ఆంక్షలు విధించడం అమెరికాకు వ్యసనంగా మారిందని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి విమర్శించారు. ఆంక్షలతో ఇరాన్ను 'ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాం' అని అమెరికా ఆర్థికశాఖ మంత్రి స్కాట్ బెసెంట్ చెప్పడంపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దౌత్య మార్గంలో లక్ష్యాలను సాధించలేనప్పుడల్లా అమెరికా ఆంక్షలు విధిస్తోందని ఆరోపించారు. అవి ఫలించకపోతే మరింత తీవ్రత పెంచుతోందని పేర్కొన్నారు. ఇది ఒక అలవాటుగా, చివరకు వ్యసనంగా మారిందని ఎక్స్ వేదికగా ఆయన మండిపడ్డారు. ఆంక్షలతో ఇరాన్ను లొంగదీసుకోవడం సాధ్యం కాదని బఘాయి స్పష్టం చేశారు. దశాబ్దాలుగా ఇలాంటి ఆంక్షలను ఎదుర్కొంటూనే ఉన్నామన్నారు. అమెరికా నేతలు ఈ చెడు అలవాటును కొనసాగిస్తే.. సంక్షోభం నుంచి గౌరవప్రదంగా బయటపడే అవకాశాలను వారే దెబ్బతీసుకుంటారని హెచ్చరించారు. మరోవైపు ఇరాన్ ప్రభుత్వం డిజిటల్ ఆస్తులు, రహస్య బ్యాంకింగ్ నెట్వర్క్లపై ఆధారపడుతోందని స్కాట్ బెసెంట్ ఆరోపించారు. వారి అక్రమ ఆర్థిక నెట్వర్క్లను గుర్తించి ధ్వంసం చేస్తామని తెలిపారు.

### ఇరాన్ సైన్యంలో కీలక నియామకాలు

ఇరాన్ సైన్యంలో కీలక నియామకాలు జరిగాయి. సుప్రీం నేత మొజ్తబా ఖమేనీ ఈ మార్పులు చేశారు. మేజర్ జనరల్ అలీ అబ్దొల్లాహీని సాయుధ దళాల చీఫ్గా, కియుమర్స్ హైదారిని డిప్యూటీగా నియమించారు. అలాగే ఐఆర్జీసీ కమాండర్గా మేజర్ జనరల్ అహ్మద్ వాహిదీ, డిప్యూటీగా మొస్తఫా ఇజాదీ బాధ్యతలు చేపట్టారు. మొజ్తబా సుప్రీం నేతగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సైన్యంలో చేసిన తొలి కీలక నియామకాలు ఇవే కావడం గమనార్హం.

# బాబ్ అల్ మాండెబ్లో నౌకపై హూతీల దాడి




సనా, ఆగష్టు 11 : పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి. బాబ్ అల్ మాండెబ్ జలసంధి లోని నౌకపై హూతీలు దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు నావికులు ప్రాణాలు కోల్పోయినట్లు యెమెన్ తీరరక్షక దళం వెల్లడించింది. మృతులను పాకిస్థాన్, ఇండోనేషియాకు చెందిన వారిగా భావిస్తున్నారు. గల్లంతైన వారి వివరాలు తెలియాల్సి ఉంది. టాంజానియా జెండా కలిగిన కార్గో నౌక ఒమన్ నుంచి జిబౌటి మీదుగా ప్రయాణిస్తున్న సమయంలో దాడి జరిగినట్లు అధికారులు వెల్లడించారు. దీనిపై హూతీలు ఇప్పటి వరకు ఎటువంటి ప్రకటన చేయలేదు.

చమురు రవాణాలో మాండెబ్ జలసంధికి చాలా ప్రాముఖ్యత ఉంది. ఇది యెమన్, జిబౌటి మధ్య ఉంది. ఎర్ర సముద్రాన్ని అరేబియా సముద్రంతో అనుసంధానం చేస్తుంది. సూయజ్ కాలువ దిశగా ఆసియా, ఐరోపా, ఉత్తర అమెరికా, పశ్చిమాసియా దేశాలకు వెళ్లే నౌకలు, చమురు ట్యాంకర్లకు ఇది కీలక మార్గం. అంతర్జాతీయ వాణిజ్యంలో 10-12 శాతం చమురు దీని ద్వారానే పయనిస్తోంది. ప్రధాన మార్కెట్ల మధ్య ఎల్ఎన్జీ, తయారీ వస్తువులు, ఆహార పదార్థాలు ఈ మార్గంలోనే రవాణా అవుతున్నాయి. ఏటా రూ.93.95 లక్షల కోట్ల విలువైన సరకులు ఈ జలసంధి గుండా రవాణా అవుతున్నట్లు అంచనా.

# ప్రతిష్టాత్మకంగా ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2026

**డిసెంబరులో నిర్వహించేందుకు ఏర్పాట్లు**

**మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకోండి**

**క్రీడా స్ఫూర్తిని చాటేలా పోటీలు ఉండాలి**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**



హైదరాబాద్, ఆగస్టు 11 (మనం న్యూస్): తెలంగాణ ప్రభుత్వం ఆతిథ్యం ఇవ్వనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2026 పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎంసీఆర్ హెఆర్డీలోని బోధి పెవిలియన్ లో ఖేలో ఇండియా యూత గేమ్స్ ఏర్పాట్లు, నిర్వహణపై మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. జాతీయ స్థాయిలో వివిధ రాష్ట్రాల నుంచి పాల్గొనే ఈ పోటీలకు సంబంధించి మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. డిసెంబరులో పోటీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. హైదరాబాద్ లోని స్టేడియంలలో ప్రస్తుత పరిస్థితిని పరిశీలించి, క్రీడా పోటీలకు అనుగుణంగా శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు అవసరమైన నిధులను అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రారంభోత్సవ, ముగింపు వేడుకలకు సంబంధించిన ముఖ్య అతిథులు, ప్రముఖ క్రీడాకారులు, సినీ ప్రముఖులను కార్యక్రమాల్లో భాగస్వాములను చేసేందుకు ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించాలన్నారు. మౌలిక వసతులు, క్రీడల నిర్వహణ, అతిథులకు కావాల్సిన సౌకర్యాల ఏర్పాట్లకు సంబంధించి పని విభజన చేసుకుని బాధ్యత తీసుకోవాలని తెలిపారు. తెలంగాణకు చెందిన అర్జున అవార్డు గ్రహీతలు, తెలంగాణ స్పోర్ట్స్ హబ్ బోర్డు సభ్యులు, ఒలింపిక్స్ అసోసియేషన్ తో పాటు జాతీయస్థాయి క్రీడా ప్రతినిధులను కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని అధికారులకు సూచించారు. ఇందుకు సంబంధించి ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్ లో భాగంగా 20 రకాల స్పోర్ట్స్ కు సంబంధించిన పోటీలు నిర్వహించనున్న నేపథ్యంలో క్రీడా విభాగాల వారీగా పోటీ ప్రదేశాలను గుర్తించి ఏర్పాట్లు చేయాలన్నారు. క్రీడా స్ఫూర్తిని చాటేలా నిర్వహణ ఉండాలని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, ఖిఅఖీఎ చైర్మన్ శివసేనా రెడ్డి, క్రీడా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఖిఅఖీఎ ఎండీ సోనీబాల దేవి పాల్గొన్నారు.



# సంక్షేమ సంఘాలను ఏర్పాటు చేస్తున్న ధనుష్ ఫ్యాన్స్ అసోసియేషన్

చెన్నై, ఆగష్టు 11 : కోలీవుడ్ కథానాయకుడు ధనుష్ రాజకీయాల్లోకి రానున్నట్లు వార్తలు వస్తున్న అంశం పాఠకులకు విదితమే. ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆయన ఇటీవల తన అభిమానులకు పిలుపునిచ్చారు.

ఈ నేపథ్యంలో ధనుష్ అభిమాన సంఘం 'ఆల్ ఇండియా ధనుష్ ఫ్యాన్స్ అసోసియేషన్'.. తమిళనాడులోని కోయంబత్తూరు జిల్లా పరిధిలో ఐదు నియోజకవర్గాల్లో కొత్త సంక్షేమ సంఘాలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ఇందులో సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని ఫ్యాన్ క్లబ్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ధనుష్ సంక్షేమ సంఘం అఖిల భారత కార్యదర్శి బి. రాజా సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు.

సాధారణంగా తమిళనాడు రాజకీయాల్లో అభిమాన సంఘాలు క్షేత్రస్థాయిలో ప్రధాన భూమిక పోషిస్తాయి. గతంలో విజయ్ వంటి నటులు కూడా తమ రాజకీయ ప్రయాణానికి ముందు అభిమాన సంఘాల ద్వారానే నియోజకవర్గాల వారీగా బలమైన కేడర్ ను నిర్మించుకున్నారు. ఇప్పుడు ధనుష్ కూడా అదే తరహాలో నియోజకవర్గాల వారీగా సంక్షేమ సంఘాల విస్తరణకు ఆదేశాలు ఇవ్వడంతో ఆయన త్వరలోనే పొలిటికల్ ఎంట్రీ ఇవ్వడం ఖాయమని వార్తలు వైరల్ అవుతున్నాయి.

# అమెరికాలో ఇమిగ్రేషన్ అప్లికేషన్ ఆన్లైన్ ఫైలింగ్ తప్పనిసరి



వాషింగ్టన్, ఆగష్టు 11 : వలసలను అరికట్టేలా ఇప్పటికే ఉన్న అన్ని విధానాలను అమెరికా ప్రభుత్వం కఠినతరం చేస్తోంది. గ్రీన్కార్డ్, పౌరసత్వం, ఆశ్రయం వంటి ప్రయోజనాలు పొందేందుకు వలసదారులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవడాన్ని తప్పనిసరి చేయనుంది. త్వరితగతిన మెరుగైన సేవలు అందించేందుకు, నిర్వహణ ఖర్చులను తగ్గించేందుకు యూఎస్ సిటిజన్షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ ఈ కొత్త నిబంధనను తీసుకువచ్చింది. ఈ మేరకు కొత్త నిబంధనను ఫెడరల్ రిజిస్టర్లో సోమవారం పబ్లిష్ చేసింది. గ్రీన్కార్డు దరఖాస్తులు, రెన్యువల్స్, ఫ్యామిలీ బేస్డ్ పిటిషన్లు, పౌరసత్వం కోసం, ఆశ్రయం కోసం చేసుకునే అభ్యర్థనలు, ఉపాధి అనుమతి దరఖాస్తులు, తాత్కాలిక రక్షిత హోదా ప్రయోజనాలు పొందేందుకు వలసదారులు ఈ ఆన్లైన్ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. మామూలుగా అయితే దరఖాస్తు దారులు యూఎస్సీఐఎస్ ఆన్లైన్ అకౌంట్ లేదా మెయిల్ (పోస్టు) ద్వారా పంపించే అవకాశం ఉంది.

# రేవంత్ షెల్ కంపెనీల బాగోతం బయటపెడతం

## రేవంత్ సోదరులకు షెల్ కంపెనీలు.. భారీగా లబ్ధి: కేటీఆర్ సంచలన ఆరోపణలు

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ సీఎం రేవంత్రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్,కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ షెల్ కంపెనీల బాగోతాన్ని బయటపెడతామని హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం తెలంగాణ భవన్లో మీడియాతో కేటీఆర్ మాట్లాడుతూ... కొండల్ రెడ్డి టెస్ రాక్ సంస్థకు చైర్మన్గా ఉన్నానని ఆయనే చెప్పారని అన్నారు. రేవంత్ బ్రదర్స్ సూటు బూట్లతో కంపెనీలు ఎలా పెట్టారని ప్రశ్నించారు. టెస్రాక్ట్ కంపెనీలో ఒక్క ఎంప్లాయ్ కూడా లేరని చెప్పారు. ఆ కంపెనీకి వేల కోట్ల భూములు ఎలా కేటాయించారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులు నామమాత్రపు అర్హతలతో భారీ కంపెనీలను రిజిస్టర్ చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పెద్ద ఎత్తున లబ్ధి పొందుతున్నారని ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి సోదరులు బడా కంపెనీలకు యజమానులుగా మారుతున్నారన్నారు. కనీసం ఒక్క ఉద్యోగి కూడా లేని కంపెనీలను చిన్న నివాసాల చిరునామాలతో రిజిస్టర్ చేయించారని పేర్కొన్నారు. అటువంటి ఒక కంపెనీకే దాదాపు రూ. 200 కోట్ల విలువైన ఐదు ఎకరాల భూమిని ప్రభుత్వం కట్టబెట్టిందని విమర్శించారు. ముఖ్యంగా, అనుముల కొండల్ రెడ్డి తన లింక్డ్ఇన్ ప్రొఫైల్లో 'టెసరాక్' కంపెనీకి ఛైర్మన్గా ఉన్నట్లు పేర్కొన్నారని తెలిపారు. మరో సోదరుడు జగదీశ్ రెడ్డి కాంట్రాక్టులు దక్కించుకుంటుండగా, ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డికి సింగరేణిలో కాంట్రాక్ట్ కట్టబెట్టారని ఆరోపించారు. ప్రతిపాదిత ఫోర్త్ సిటీ పరిధిలోని భూముల కేటాయింపులపై బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్ ఒకరోజు ముందే ఇవే తరహా ఆరోపణలు చేసిన నేపథ్యంలో కేటీఆర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# కేసీఆర్ను మోసం చేయలే?.. చేయను?

- అన్నం పెట్టినోళ్లను మర్చిపోలేను?
- నిధులిస్తనందుకే రేవంత్ వద్దకు వెళ్లి కండువా కప్పుకున్నా
- పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు

హైదరాబాద్, మనం ప్రతినిధి : పార్టీ మార్పుపై బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మంత్రి పదవి, డబ్బు కోసం కాంగ్రెస్లో చేరలేదన్నారు. కేవలం నియోజకవర్గ అభివృద్ధి కోసమే సీఎం రేవంత్ని కలిసి పార్టీ మారినట్లు తెలిపారు. 6 నెలల్లో పెండింగ్ బిల్లులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినా ఇప్పటివరకు సగం నిధులు మాత్రమే విడుదలయ్యాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. కేసీఆర్ను మోసం చేయడం తనకు ఇష్టం లేదని.. తనకు అన్నం పెట్టిన వారిని ఎప్పటికీ మర్చిపోలేనని ఎమోషనల్ అయ్యారు. మంగళవారం బిర్కూర్లో పార్టీ కార్యకర్తలు, అభిమానులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో మాజీ సీఎం కేసీఆర్తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ పోచారం.. భావోద్వేగ వ్యాఖ్యలు చేశారు. పెండింగ్ బిల్లుల చెల్లింపులో జాప్యం కారణంగా కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారని పోచారం తెలిపారు. గత నవంబర్లో పార్టీ మారిన ఎమ్మెల్యేలతో జరిగిన సమావేశంలో ఇదే విషయాన్ని తాను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లానని గుర్తుచేశారు. ఆరు నెలల్లోగా బిల్లులు మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినప్పటికీ, ప్రస్తుతం సగం నిధులే విడుదల య్యాయని పేర్కొన్నారు. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మిగతా మొత్తాన్ని మంజూరు చేయలేదని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీలోకి మారడం తనకు ఎంతమాత్రం ఇష్టం లేదని స్పష్టం చేశారు. తాను స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీ మారలేదని మరోసారి వెల్లడించారు. అన్నం పెట్టిన వాళ్లను ఎప్పటికీ మర్చిపోలేనని పేర్కొన్న పోచారం శ్రీనివాస్ రెడ్డి.. కేసీఆర్ హయాంలోనే బాన్సువాడ నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందని పేర్కొన్నారు. కొంతమంది కారణంగానే తాను పార్టీ మారాల్సిన పరిస్థితి వచ్చిందని వ్యాఖ్యానించారు. నిధుల కోసం సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కోరినా ఆశించిన స్థాయిలో స్పందన రాలేదన్నారు. గతేడాది నవంబర్లో ఫిరాయింపు ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్రెడ్డి సమావేశం నిర్వహించిన సమయంలో తాను సూటిగా ప్రశ్నించినట్లు పోచారం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. 'నేను నీకు అమ్ముడుపోయానా.. లేక నా ఎమ్మెల్యే పదవిని కొన్నావా?' అని తాను సీఎం రేవంత్ రెడ్డిని నిలదీసినట్లు వెల్లడించారు. అయిన రాబోయే రోజుల్లో బాన్సువాడలో మళ్లీ తమదే విజయమని ధీమా వ్యక్తం చేశారు. అయితే, పోచారం చేసిన తాజా వ్యాఖ్యలు అటు కాంగ్రెస్తో పాటు ఇటు తెలంగాణ రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి. ముఖ్యంగా కేసీఆర్పై తన అభిమానం, పార్టీ మార్పుపై చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

# నిరుద్యోగులకు మరో తీపీ కబురు

**రూ.1.80 లక్షల వరకు ఆకర్షణీయమైన వేతనం**

**389 మేనేజర్, జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేపట్టనున్నారు.**

**అర్హత ఉన్న అభ్యర్థులు 2026 సెప్టెంబర్ 7 వరకు ఆన్లైన్లో దరఖాస్తుకు అవకాశం**



హైదరాబాద్, మనం ప్రతినిధి : ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఎఐ) మంచి అవకాశాన్ని అందిస్తోంది. వివిధ విభాగాల్లో మొత్తం 389 మేనేజర్, జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి ఎఎఐ తాజాగా నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నియామకాలు రెగ్యులర్ ప్రాతిపదికన చేపట్టనున్నారు. అర్హత ఉన్న అభ్యర్థులు 2026 సెప్టెంబర్ 7 వరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చు. పోస్టుల వారీగా విద్యార్హతలు, వయోపరిమితి, జీతం, ఎంపిక విధానం తదితర వివరాలు ఇలా ఉన్నాయి.

### ఎన్నిపోస్టులు?.. దరఖాస్తులు ఎప్పటి నుంచి..

ఈ రిక్రూట్మెంట్ ద్వారా ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాలో మొత్తం 389 ఖాళీలను భర్తీ చేయనున్నారు. మేనేజర్, జూనియర్ ఎగ్జిక్యూటివ్గా హోదా.. ఈ ఉద్యోగాలు ఆర్కిటెక్చర్, ఫైనాన్స్, ఫైర్ సర్వీసెస్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, కార్పొరేట్ ప్లానింగ్ అండ్ మేనేజ్మెంట్ సర్వీసెస్ తదితర విభాగాల్లో ఉన్నాయి. ఎఎఐ ఉద్యోగాలకు ఆన్లైన్ దరఖాస్తుల స్వీకరణ ఆగస్టు 8, 2026 నుంచి ప్రారంభమైంది. అర్హత కలిగిన అభ్యర్థులు సెప్టెంబర్ 7, 2026లోపు అధికారిక వెబ్సైట్ ద్వారా అప్లికేషన్ సమర్పించాలి.

### విద్యార్హతలు, వయోపరిమితి ఎంత?..

పోస్టును బట్టి విద్యార్హతలు మారుతాయి. సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన విద్యాసంస్థ నుంచి డిప్లొమా, ఐటీఐ, బీఈ, బీటెక్, ఎంబీఏ లేదా ఎంసీఏ వంటి అర్హతలు కలిగి ఉండాలి. కొన్ని పోస్టులకు సంబంధిత పని అనుభవం కూడా తప్పనిసరి. అభ్యర్థులు తాము దరఖాస్తు చేయాలనుకుంటున్న పోస్టుకు నిర్దేశించిన విద్యార్హత, అనుభవానికి తగ్గట్టు పోస్టులు, జీతం ఉంటోంది. మేనేజర్ పోస్టులకు.. 2026 సెప్టెంబర్ 7 నాటికి అభ్యర్థుల గరిష్ఠ వయసు 32 ఏళ్లు, జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు గరిష్ఠ వయోపరిమితి 27 ఏళ్లు, ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. అర్హులైన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు గరిష్ఠ వయసులో 5 సంవత్సరాలు, ఓబీసీ (నాన్-క్రీమీ లేయర్) అభ్యర్థులకు 3 సంవత్సరాల సడలింపు ఉంటుంది.

### ఆకర్షణీయమైన వేతనం..

ఈ పోస్టులకు ఎంపికైన వారికి ఆకర్షణీయమైన వేతనం లభించనుంది. మేనేజర్: రూ.60,000 - రూ.1,80,000, జూనియర్ ఎగ్జిక్యూటివ్: రూ.40,000 - రూ.1,40,000, పోస్టును బట్టి ఇతర నిబంధనల ప్రకారం లభించే ప్రయోజనాలు, అలవెన్సులు కూడా ఉంటాయి.

### ఎంపిక ప్రక్రియ ఎలా ఉంటుంది?..

అభ్యర్థుల ఎంపికలో ప్రధానంగా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (ఇఆఖీ) నిర్వహిస్తారు. ఈ పరీక్షలో తప్పు సమాధానాలకు నెగెటివ్ మార్కింగ్ ఉండదని నోటిఫికేషన్లో పేర్కొన్నారు. ఆన్లైన్ పరీక్ష అనంతరం పోస్టును బట్టి అప్లికేషన్ వెరిఫికేషన్, ఇతర పరీక్షలు నిర్వహిస్తారు. పోస్ట్ కోడ్ 1 నుంచి 11 వరకు ఉన్న పోస్టులకు ఇంటర్వ్యూ కూడా ఉంటుంది. ఫైర్ సర్వీసెస్ మేనేజర్ పోస్టుకు మాత్రం రాత పరీక్ష తర్వాత అదనంగా ఫిజికల్ మెజర్మెంట్ టెస్ట్, డ్రైవింగ్ టెస్ట్, ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్ నిర్వహిస్తారు. వీటిని విజయవంతంగా పూర్తి చేసిన అభ్యర్థులకు అనంతరం ఇంటర్వ్యూ ఉంటుంది. ఆన్లైన్ దరఖాస్తుల ప్రారంభం ఆగస్టు 8, 2026 నుంచి 7 సెప్టెంబర్ 2026 వరకు చివరి తేదీగా నిర్ణయించారు.

### ఎలా దరఖాస్తు చేయాలి?

అర్హత ఉన్న అభ్యర్థులు ఎఎఐ అధికారిక రిక్రూట్ మెంట్ పోర్టల్లోకి వెళ్లి ఆన్లైన్లో అప్లికేషన్ పూర్తి చేయాలి. వ్యక్తిగత వివరాలు, విద్యార్హతలు, అనుభవం తదితర సమాచారాన్ని నమోదు చేసి, అవసరమైన పత్రాలను సమర్పించాలి. అభ్యర్థులు దరఖాస్తు చేసే ముందు పోస్టుల వారీగా అర్హతలు, వయోపరిమితి, అనుభవం, ఎంపిక విధానం, ఇతర నిబంధనలను అధికారిక నోటిఫికేషన్లో చూడాలని పేర్కొంది.

# సైబర్ మోసాలు రోడ్డు ప్రమాదాల నివారణపై కృషి

- ప్రజలకు అందుబాటులో ఉండి ఫిర్యాదులు కేసులు పెండింగ్ లేకుండా చేయాలి
- సిబ్బంది పనితీరుపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని డీఎస్పీ, సీఐలకు ఆదేశం
- సూర్యాపేట డివిజన్ స్థాయి అధికారులతో ఎస్పీ సమీక్ష సమావేశం



**సూర్యాపేట, ఆగస్టు 11 (మనం ప్రతినిధి):** సైబర్ నేరాలు రోడ్డు ప్రమాదాల నివారణకు నిరంతరం కృషి చేయాలని జిల్లా ఎస్పీ నరసింహ స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ నరసింహ సూర్యాపేట డివిజన్ స్థాయి పోలీసు అధికారుల నెలవారి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గత నెలలో నమోదైన కేసుల తీరుతెన్నులు, పోలీసు దర్యాప్తు మరియు కేసుల పురోగతి స్థితిగతులను సమీక్షించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ... పోలీసు అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి పని చేయాలని స్పష్టం చేశారు. సైబర్ మోసాలు, రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రణాళికతో పని చేస్తూ కృషి చేయాలని అన్నారు. మహిళల భద్రతలో ప్రాధాన్యం తో పని చేసి బాధితులకు త్వరగా సేవలు అందించాలని కోరారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, కేసులు ఏమాత్రం పెండింగ్లో ఉండొద్దు అని అధికారులను ఆదేశించారు. నేరాల అదుపునకు సాంకేతిక పద్ధతులను ఉపయోగించాలని, క్షేత్రస్థాయిలో సమాచారం ఇచ్చే వనరులను మరింత అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. సమాజంలో నేరాల నియంత్రణకు ప్రజల్లో విస్తృత చైతన్యం కల్పించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. డీఎస్పీలు, సీఐలు తమ పరిధిలోని పోలీస్ స్టేషన్ల పనితీరుపై, సిబ్బంది విధి నిర్వహణపై నిరంతర క్షేత్ర స్థాయి పర్యవేక్షణ ఉంచాలని, సిబ్బందిని ఎప్పటికప్పుడు మోటివేషన్ చేస్తూ ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు.ఈ సమీక్షా సమావేశంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డిసిఆర్బీ డీఎస్పీ రవి, డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐ లు వెంకటయ్య, నాగేశ్వరరావు, ఉపేందర్ రావు, రాజశేఖర్, డివిజన్ ఎస్సైలు, టెక్నికల్ టీం ఎస్ఐ రాజశేఖర్ డిసిఆర్బీ ఎస్ఐ ఝాన్సి రాణీ, మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కష్టపడి చదివి కలలను నిజం చేసుకోండి



**ఆత్మకూరు ఎస్, ఆగస్టు 11 (మనం న్యూస్):** విద్యార్థులు లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కేజీబీవీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులు, వంటగది, వసతి గదులను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి కాసేపు ముచ్చటించి, వారి విద్యాభ్యాసం గురించి అడిగి తెలుసుకున్నారు. మెనూ గురించి ఆరా తీశారు. భోజనం నాణ్యతగా ఉందని, ఇదే నాణ్యతను నిరంతరం కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. చదువుతో పాటు పౌష్టికాహారం కూడా విద్యార్థులకు ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. తరగతి గదిలోకి వెళ్లిన కలెక్టర్.. విద్యార్థులతో సరదాగా సంభాషించారు. పెద్దయ్యాక మీరు ఏమవుతారు?' అని ప్రశ్నించగా.. పలువురు విద్యార్థులు డాక్టర్, ఇంజనీర్, కలెక్టర్ అవుతామని ఉత్సాహంగా సమాధానమిచ్చారు. విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని చూసి ఆయన అభినందించారు. సొంత కాళ్లపై నిలబడాలంటే చదువే ఏకైక మార్గం. కష్టపడి చదివి మీ తల్లిదండ్రుల కలలను నిజం చేయాలని హితబోధ చేశారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అధికారులకు ఆదేశాలు..పాఠశాల ఆవరణను పరిశీలించిన కలెక్టర్.. పరిశుభ్రతవిష యంలో ఎక్కడా రాజీ పడకూడదని స్పష్టం చేశారు. తాగునీటి వసతి, టాయిలెట్ల నిర్వహణ నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించా రు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడమే కాకుండా, వారి ఆరోగ్యం పట్ల కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి విశాల్, తహసిల్దార్ అమిన్ సింగ్ ప్రిన్సిపాల్ వై సరస్వతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించిన చైర్మన్

**తిరుమలగిరి ఆగస్టు 11 (మనం న్యూస్):** తిరుమలగిరి మున్సిపాలిటీ 5వ వార్డు పరిధిలోని పద్మశాలి కాలనీలో ముత్యాలమ్మ ఆలయం వద్ద సిసి రోడ్ నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ సంకేపల్లి రఘునందన్ రెడ్డి,వైస్ చైర్మన్ గోవిందమ్మ రవీందర్ మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలోకౌన్సిలర్లు కవిత వెంకట్ రెడ్డి, యాదగిరి, శ్రీను వార్డు నాయకులు మోడెపు వీరన్న, నాగరాజు, కిషోర్ రెడ్డి,అడ్డబొట్టు చారి, అశోక్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లు, జలసిరి పనులకు ప్రాధాన్యం



- 16వ ఆర్థిక సంఘం నిధులను సద్వినియోగం చేయాలి
- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**కామారెడ్డి, ఆగస్టు 11 (మనం ప్రతినిధి):** గ్రామపంచాయతీల సమగ్ర అభివృద్ధికి ప్రజల అవసరాలను గుర్తించి, సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. 2026-27 నుంచి 2028-29 ఆర్థిక సంవత్సరాలను దృష్టిలో ఉంచుకుని మూడేళ్ల ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. గ్రామసభల ద్వారా ప్రజల అవసరాలను గుర్తించి, ప్రాధాన్యత క్రమంలో పనులను ఎంపిక చేయాలన్నారు.

**మౌలిక అవసరాలకు ప్రాధాన్యం**

తాగునీరు, పారిశుద్ధ్యం, అంతర్గత రహదారులు, డ్రైనేజీ, విద్యుత్, విద్య, వైద్యం, ఉపాధి, నీటి సంరక్షణ వంటి మౌలిక అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. చెయూత సామాజిక భద్రతా పింఛన్లకు సంబంధించి ఏడు రకాల పింఛన్లకు వచ్చిన దరఖాస్తులను గ్రామస్థాయిలో స్వీకరించి, అర్హతలను పరిశీలించి, ఎంపీడీవోల ద్వారా ఆన్లైన్లో నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. అర్హులైన ఒక్కరూ సంక్షేమ పథకాల ప్రయోజనాలకు దూరం కాకుండా పారదర్శకంగా పరిశీలన చేపట్టాలన్నారు.

## సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణకు మరింత భద్రత



- ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం
- సీపీ సాయి చైతన్య

**నిజామాబాద్, ఆగస్టు 11 (మనం బ్యూరో):** 'మన ఊరు.. మన భద్రత. మన బాధ్యత' కార్యక్రమంలో భాగంగా జక్రాన్పల్లి పోలీస్స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన 25 సీసీ కెమెరాలను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ., ప్రజల భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటు ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని, అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు నేరాల నియంత్రణ, ట్రాఫిక్ పర్యవేక్షణలో ఇవి కీలకంగా పనిచేస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, దుకాణాల యజమానులు తప్పనిసరిగా కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జక్రాన్పల్లి గ్రామంలో 25 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పోలీస్శాఖకు సహకరించిన గ్రామపంచాయతీని సీపీ అభినందించారు. డ్రగ్స్ నివారణ, సైబర్ నేరాలపై అవగాహన, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ ప్రకాష్, సీసీఆర్బీ ఏసీపీ గురునాయుడు, డిచ్పల్లి సీఐ తిరుపతి, జక్రాన్పల్లి ఎస్ఐ మహేష్, సర్పంచ్ బండి పద్మసత్యం, మండల అధ్యక్షుడు రెక్కల సురేష్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# గుడి భూమి.. మాకు సంబంధించినది

- కొంతమంది కబ్జా చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు
- భూమి ఇవ్వకపోతే ఊరు నుండి వెళ్ళిపోమని అంటున్నారు
- అయిటిపాముల గ్రామస్తుడు బొజ్జ అజయ్ కుమార్




**నల్లగొండ-- ఆగస్టు 11( మనం ప్రతినిధి ):** నల్గొండ జిల్లా కట్టంగూరు మండలం ఐయిటిపాముల గ్రామంలోని ఎస్సీ కాలనీ సమీపంలో ఉన్న భూమి తనది అని గ్రామానికి చెందిన బొజ్జ అజయ్ కుమార్ అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ కాలనీకి సమీపంలో 30 గుంటల భూమి ఉన్నదని అన్నారు. ఆ భూమి 821 సర్వే నెంబర్లు ఉందని అన్నారు.తన నాన్న బొజ్జ నరసింహ తన బాబాయిలు బొజ్జ చంద్రయ్య , బొజ్జ ఎల్లయ్య పేరు మీదుగా ఉందని అన్నారు. 30 గుంటల భూమిలో మనిషికి 10 గంటల వరకు భూమి వాటాలుగా వచ్చే అవకాశం ఉందన్నారు. తమ గ్రామంలోని కొందరు తమకు పడని వాళ్ళు భూమిని గుడి పేరు మీదగా కబ్జా చేయాలని చూస్తున్నారని అన్నారు. గుడి కట్టడానికి భూమి ఇవ్వకపోతే గ్రామం నుండి వెళ్లిపోవాలని తమను ఆదేశిస్తున్నారని అన్నారు. ప్రస్తుత సమాజం ఎటువైపు వెళుతుందో అర్థం కావడం లేదని అన్నారు. కావాలనే తమని రెచ్చగొడుతున్నారని అన్నారు. తమది ఒరిజినల్ పట్టా భూమి అని అన్నారు. తాను గుడి కట్టవద్దు అని అనడం లేదని వేరేచోట కట్టండి అని అంటున్నారని అన్నారు. తమ భూమిని కబ్జా చేసే వారి నుండి తమకు ప్రాణహాని ఉందని అన్నారు. తమపై దాడి చేసే అవకాశం కూడా ఉందని అన్నారు. ఇదే విషయమై కట్టంగూర్ పోలీస్ స్టేషన్లో ఇదివరకే ఫిర్యాదు చేయడం జరిగింది అన్నారు. రాజ్యాంగంలో ఏ పని చేసినా పక్కవారికి ఇబ్బంది కలగకుండా చేయాలి అని ఉంది అని అన్నారు. ఈ విషయంలో ప్రభుత్వ అధికారులు చొరవ తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు.

## యల్లాపురం పాఠశాలలో విద్యార్థులకు నోట్స్ పంపిణీ




**పాలకీడు, ఆగస్టు 11 (మనం న్యూస్):** పాలకీడు మండలంలోని ఎల్లాపురం గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాల నందు విద్యార్థిని విద్యార్థులకు లయన్స్ క్లబ్ నేరేడుచర్ల ఆధ్వర్యంలో మంగళవారం నోట్స్, చూచిరాత నోట్స్ పంపిణీ చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు షేక్ అబూబకర్ సిద్ధిక్ ఆర్థిక సహకారంతో నోట్ బుక్స్ అందించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ యూసుఫ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి ఇంజమూరి కాటయ్య, గ్రామ సర్పంచ్ పెరుమాళ్ల సురేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో చక్కని చేతిరాతను పెంపొందించేందుకు హ్యాండ్ రైటింగ్ ఉపయోగపడుతుందని, విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపకరించే విధంగా ఇలాంటి సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని వారన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, సహ ఉపాధ్యాయులు గంధం ధర్మరాజు, వాలంటీర్లు సమీనా, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎంఎంఎస్ పరీక్షలో ఎరిగేరి హై స్కూల్ విద్యార్థుల ఘన విజయం

- విద్యార్థుల ప్రతిభకు ఉపాధ్యాయులు కృషికీ తోడైతే విజయాలు సొంతమవుతాయి
- హెచ్.ఎం.రమేష్ నాయుడు



**కౌతాళం,ఆగస్టు 11 మనం న్యూస్:** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎరిగేరి విద్యార్థులు డిసెంబర్ 2025లో నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్షిప్) పరీక్షలో అద్భుత ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన బి.రజత,యు.నిఖిల్, ఎం.అజయ్ ముగ్గురు విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ స్కాలర్షిప్కు ఎంపికయ్యారు. ఎంపికైన ప్రతి విద్యార్థికి 9వ తరగతి నుండి 12వ తరగతి వరకు సంవత్సరానికి 12,000 రూపాయలు చొప్పున స్కాలర్షిప్ లభిస్తుంది.ఈ విజయం విద్యార్థుల ప్రతిభకు, ఉపాధ్యాయుల కృషికి మరియు తల్లిదండ్రుల సహకారానికి నిదర్శనంగా నిలిచింది. విద్యార్థుల విజయానికి ప్రత్యేకంగా కృషి చేసిన గణిత ఉపాధ్యాయులు మరియు సైన్స్ ఉపాధ్యాయులు అదేవిధంగా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు సహకరించిన ఇతర ఉపాధ్యాయులను, విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.రమేష్ నాయుడు అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ శ్రీరాములు, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు రామలింగ, బసవరాజు,గిడ్డయ్య, చంద్రశేఖర్ తదితరులు విద్యార్థులను,వారి తల్లిదండ్రులను మరియు ఉపాధ్యాయులను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ప్రతిభకు ఉపాధ్యాయుల కృషి తోడైతే విజయాలు సొంతమవుతాయి అనే సందేశాన్ని ఎరిగేరి జడ్పిహెచ్ఎస్ విద్యార్థుల ఎన్ఎంఎంఎస్ విజయం చాటిచెప్పింది.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ఎస్పీ మహేష్ బి గితెతో కలిసి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్




**రాజన్న సిరిసిల్ల, ఆగస్టు -11(మనం ప్రతినిధి ):** జిల్లాలో ఈ నెల 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ మహేష్ బి గితె తో కలిసి సంబంధిత శాఖల జిల్లా స్థాయి అధికారులతో మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, తప్పనిసరిగా హాజరయ్యేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జెండా ఆవిష్కరణకు సంబంధించిన ఏర్పాట్లు, వేదిక, గ్రౌండ్ తదితర ఏర్పాట్లను పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించేలా స్టాల్స్, శకటాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాలు, జిల్లాలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు అవగాహన కలిగే విధంగా స్టాళ్లలో ప్రదర్శించాలని సూచించారు. దేశభక్తిని ప్రతిబింబించేలా విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేసేందుకు సంబంధించిన ప్రతిపాదనలను నిర్ణీత గడువులోగా సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథి ప్రసంగం కోసం జిల్లాలోని వివిధ శాఖలు చేపట్టిన ముఖ్యమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సంక్షిప్త నివేదికలను జిల్లా పౌర సంబంధాల అధికారికి అందజేయాలని ఆదేశించారు. జిల్లాకు చెందిన ప్రముఖులు, వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న వ్యక్తులు వేడుకలకు హాజరయ్యేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రతి ప్రభుత్వ శాఖ తమ కార్యాలయాల్లో కూడా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించడంతో పాటు జిల్లా స్థాయి వేడుకలకు అధికారులు, సిబ్బంది హాజరయ్యేలా చూడాలని తెలిపారు. వేడుకల సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. స్వశక్తి మహిళా సంఘాల ప్రతినిధులు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వేడుకలకు హాజరయ్యే ప్రజలు, అధికారులు, విద్యార్థులకు అవసరమైన మేర తాగునీటి వసతి ఏర్పాట్లు కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్ఓ జయశ్రీ, సిరిసిల్ల ఆర్డీఓ శ్రీధర్ బాబు, సంబంధిత ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆరాధన ఉత్సవాలకు హాజరు కావాలని కర్ణాటక సీఎం, మాజీ సీఎంలకు ఆహ్వాన పత్రికలు అందజేత



**మంత్రాలయం ఆగస్టు 11,మనం న్యూస్ :** ఆధ్యాత్మిక క్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్ర స్వామి 355వ ఆరాధన ఉత్సవాల్లో భాగంగా పీఠాధిపతి శ్రీ సుభుధేంద్ర తీర్థ ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి సెప్టెంబర్ 2 వరకు జరిగే సప్తరాత్రోత్సవాలకు హాజరు కావాలని కోరుతు పీఠాధిపతి ఆదేశానుసారం శ్రీ మఠం అసిస్టెంట్ మేనేజర్/ పీఆర్వో ఐపీ నరసింహ మూర్తి స్వామి బెంగళూరు లోని కర్ణాటక సీఎం డీకే. శివకుమార్, మాజీ సీఎం సిద్దరామయ్యి లకు వేర్వేరు సమయాల్లో ఆహ్వాన పత్రికలను అందజేశారు.

# కార్తీకమాస వేడుకలను వైభవంగా నిర్వహించండి

### దేవాదాయ వరంగల్ జోన్ డిప్యూటీ కమిషనర్ రామాల సునీత వేయిస్తంభాల ఆలయంలో కార్తీక వేడుకల గోడ పత్రిక ఆవిష్కరణ



**హనుమకొండ, ఆగస్టు 11 (మనం ప్రతినిధి ):** ఈ నెల 13వ తేదీ గురువారం నుంచి ప్రారంభం కానున్న శివ కేశవులకు, అమ్మవారికి ఇష్టమైన శ్రావణ మాస వేడుకలను ఉమ్మడి జిల్లాలోని అన్ని ఆలయాల్లో వైభవంగా నిర్వహించేందుకు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని దేవాదాయ శాఖ వరంగల్ జోన్ డిప్యూటీ కమిషనర్ రామాల సునీత పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండలోని ప్రసిద్ధి వేయిస్తంభాల ఆలయంలో ఈ నెల 13 నుంచి ప్రారంభమయ్యే కార్తీకమాస వేడుకల విశేషాలతో కూడిన గోడ పత్రికను ఆలయ ప్రధాన అర్చకులు, రాష్ట్ర ఆలయాల అర్చకుల ఉద్యోగుల జాక్ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీసీ సునీత మాట్లాడుతూ శ్రావణమాసం మహిళలకు ఎంతో ఇష్టమైన ప్రీతికర మాసమని ప్రకృతి రమణీయత కూడా ఈ మాసానికి అనుకూలంగా ఉంటుందని ఆధ్యాత్మికంగా ఎంతో ముఖ్యమైన ఈ మాసంలో ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారని చెప్పారు. ముఖ్యంగా మంగళ, శుక్ర వారాల్లో వరలక్ష్మీ వ్రతాల సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయాలను సందర్శిస్తారని చెప్పారు. సోమవారాలు శివాలయాల్లో ప్రత్యేక వేడుకలు వీటితోపాటు రాఖీ పౌర్ణమి నాగుల పంచమి లాంటి వేడుకలు కూడా ఈ మాసంలోనే సంభవించడం వల్ల ఆధ్యాత్మికంగా ప్రాధాన్యముందని ఆమె చెప్పారు. అన్ని ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆలయాల ఈవోలకు సూచించారు. ఈ నెల 17వ తేదీన మొదటి సోమవారం నాగుల పంచమి కలిసి వస్తున్నందున వేయిస్తంభాల ఆలయంలో ప్రత్యేక వేడుకలు నిర్వహిం చనున్నట్లు ఆలయ ఈవో అనిల్ కుమార్, ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. అదే విధంగా శ్రావణంలో వచ్చే నాలుగు సోమవారాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహింపజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ వేద పండితులు మణికంఠ శర్మతోపాటు మధుకర్, రామకృష్ణ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# గోదావరి జలాలను సెప్టెంబర్ చివరి వరకు పూర్తి స్థాయిలో పంపింగ్ చేయాలి



## 45రోజుల పాటు 9 మోటార్లను నిరంతరాయంగా నడపాలి

## ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**హనుమకొండ ఆగష్టు 11(మనం ప్రతినిధి ):** దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా రానున్న 45రోజుల పాటు పూర్తి స్థాయి మోటార్ల ద్వారా గోదావరి జలాలను నిరంతరాయంగా లిఫ్ట్ చేసి రైతుల పంటలను కాపాడేందుకు సాగు నీరు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. హన్మకొండ చింతగట్టులోని నీటి పారుదల శాఖ కార్యాలయంలో ఈ.ఎన్.సి రమేష్ ఆధ్వర్యంలో నీటి పారుదల శాఖ అధికారులు, కాంట్రాక్టర్లతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు మాట్లాడుతూ.... సెప్టెంబర్ లో వర్షాలు కురవకపోతే గోదావరిలో నీటి ప్రవాహం తగ్గే ప్రమాదం ఉందని కావున సమ్మక్క సారాలమ్మ బ్యారేజిని పూర్తి స్థాయిలో నింపి పెట్టుకోవాలని తెలిపారు. దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలను సెప్టెంబర్ చివరి వరకు పూర్తి స్థాయిలో 9మోటార్ల ద్వారా పంపింగ్ చేయడానికి అవకాశం ఉంటుందని వెల్లడించారు. మొత్తం 9మోటార్లను నిరంతరాయంగా నడుపగలిగితే రోజుకు 2వేల క్యూసెక్కుల నీటిని లిఫ్ట్ చేయగలమని దింతో రానున్న 45రోజులలో 15టీఎంసిల నీటిని వాడుకునే అవకాశం ఉంటుందని వెల్లడించారు. ధర్మసాగర్ నుండి ఘనపూర్ వరకు టన్నెల్ పనులు పూర్తి అయినప్పటికీ ఇప్పటి వరకు టన్నెల్ వాడుకలోకి రాలేదని టన్నెల్ ను వెంటనే వాడుకలోకి తీసుకురావాలని అన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులు ఆరుతడి పంటలు, కొన్ని చోట్ల వరి నాట్లు వేసుకున్నారని దేవాదుల రిజర్వాయర్లలో నీటి నిలువల ద్వారా పంటలకు సాగు నీరు అందించే అవకాశలను పరిశీలించి రైతులకు సాగు నీరు విడుదల చేయాలని అన్నారు. అలాగే అన్ని రిజర్వాయర్లలో వాటర్ లేవల్స్ మెయింటేన్ చేసేందుకు వర్కింగ్ మాన్యువల్ రూపొందించాలని సూచించారు. దేవాదుల ఎత్తిపోతల పథకంలో రామప్ప, ధర్మసాగర్, ఘనపూర్ రిజర్వాయర్లు చాలా కీలకం అయినవి అని ఈ రిజర్వాయర్లలో లేవల్స్ మెయింటేన్ చేయడం చాలా ముఖ్యమని అన్నారు. దేవాదుల ఫేజ్ -3 ప్యాకేజీ -6 పనులు నత్త నడకన నడుస్తున్నాయని అన్నారు. ప్యాకేజీ-6 ద్వారా 4నియోజకవర్గాలలో 78వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందని తెలిపారు. కాంట్రాక్టర్లను అడిగితె బిల్లులు రావడం లేదని అంటున్నారని కానీ ఇప్పటికే పెండింగ్ బిల్లుల విషయాన్నీ మంత్రిగారి దృష్టికి తీసుకువెళ్ళమని రెండు మూడు రోజుల్లో బిల్లులు క్లియర్ అవుతాయని అన్నారు. అధికారులు వెంటనే పనుల్లో వేగం పెంచాలని సూచించారు. వచ్చే యాసంగి వరకు పాలకుర్తి వరకు నీరు అందించే విధంగా పనులు పూర్తి చేయాలని పేర్కొన్నారు. గండి రామారం ఎత్తిపోతల పథకంలో లిఫ్ట్ -2పనులు పూర్తి అయ్యాయని లిఫ్ట్ -1పనులు కొనసాగుతున్నాయని కానీ అనుకున్న విధంగా పనులు ముందుకు సాగడం లేదని అన్నారు. లిఫ్ట్ -1పనులు పూర్తి చేసి లిఫ్ట్ -3పనులు చేపట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. అక్టోబర్ చివరి నాటికి లిఫ్ట్ -1పనులు పూర్తి చేసి యాసంగికి రైతులకు సాగు నీరు అందించాలని తెలిపారు. ఆ దిశగా అధికారులు, కాంట్రాక్టర్లు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మామిడాల యశస్విని రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, సిఈ సుధీర్, ఎస్ఈలు సీతారాం, దర్శన్, డిఈలు, ఈఈలు, ఇతర నీటి పారుదల శాఖ అధికారులు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# కన్నాయిగూడెం కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా సునార్కని రాంబాబు



- **నియామక పత్రం అందజేసిన మంత్రి సీతక్క**

**కన్నాయిగూడెం, ఆగస్టు 11, మనం న్యూస్:** కన్నాయిగూడెం మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా చింతగూడెం గ్రామానికి చెందిన సునార్కని రాంబాబు మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం ములుగు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మాట్టేవాడ తిరుపతి చేతుల మీదుగా రాంబాబు నియామక పత్రాన్ని అందుకున్నారు.ఈ సందర్భంగా సునార్కని రాంబాబు మాట్లాడుతూ తనపై నమ్మకంతో మూడోసారి ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన మంత్రి సీతక్కకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను ప్రజా సేవకు అంకితం చేస్తూ, కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు పనిచేస్తానని అన్నారు.తన ఎన్నికకు సహకరించిన ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, యువనేత కుంజ సూర్య, కన్నాయిగూడెం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జాడి రాంబాబు, జిల్లా సీనియర్ నాయకుడు ఎండీ అప్సర్ పాషా, గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగా కళ్యాణి, జిల్లా కార్యదర్శి బొల్లె భాస్కర్, మండల యూత్ అధ్యక్షుడు బోట నాగేష్, మాజీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు దాసరి సుధాకర్తో పాటు జిల్లా, మండల కాంగ్రెస్ నాయకులు, యూత్ నాయకులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, సీనియర్ నాయకులకు రాంబాబు కృతజ్ఞతలు తెలిపారు. మూడోసారి ఏకగ్రీవంగా తనను ఎన్నుకోవడం తనపై పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉంచిన నమ్మకానికి నిదర్శనమని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని రాంబాబు పేర్కొన్నారు.

# పలు బాధిత కుటుంబాలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి పరామర్శ



**పర్వతగిరి, ఆగస్టు 11 (మనం న్యూస్):** పలు బాధిత కుటుంబాలను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్రావు మంగళవారం పరామర్శించారు. పర్వతగిరి మండలం కేంద్రంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతు మృతిచెందిన సమీ బంధువు విశ్వజెనీత్ కరస్పాండెంట్ ఎర్రబెల్లి హరికుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇదే గ్రామానికి చెందిన నాయకులు చిన్నపెల్లి దేవేందర్ మాతృమూర్తి చిన్నపెల్లి కమలమ్మ సోమవారం మరణించగా వారి భౌతికకాయాన్ని సందర్శిం నివాళులర్పించి, ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందిన నీరటి కొమురమ్మ, చీదురు ఏకంబ్రం, గడిదాసు వీరాస్వామి కుటు ంబాలను పరామర్శించి అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగడ సానుభూతిని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తె పారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ యం. మనోజ్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు, మాజీ మండల అధ్యక్షులు రంగు కుమార్ గౌడ్, మాజీ సర్పంచులు బొట్ల కిష్టయ్య. గొనె సంపత్, మండల మాజీ కోప్షన్, ఎంపిటీసీ ఎస్కే షబీ పాషా, మండల నాయకులు బొట్ల మధు, మెరుగు వెంకటేశ్వర్లు, రంగు కుమార్, రాజు, తుంగ రాజు, చిరుత విజయ్, దొమ్మటి రాజు, రాపోలు యాకయ్య, ముంజ శ్రావణ్ గౌడ్, బొట్ల భాస్కర్, జంగా వీరమల్లు, అంబటి కుమార్, చింతపట్ల సునీల్, బంధారపు రంజిత్, బొట్ల శ్రీకాంత్, చిన్నపెల్లి అజయ్ తదితరులు ఉన్నారు.

# బాధిత కుటుంబానికి పరామర్శ

**పర్వతగిరి, ఆగస్టు 11 (మనం న్యూస్):** మండల కేంద్రానికి చెందిన సీనియర్ నాయకులు చిన్నపెల్లి దేవేందర్ తల్లి చిన్నపెల్లి కమలమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకొని మంగళవారం కమలమ్మ భౌతికదేహంపై పూలమాల వేసి కాం గ్రెస్ మండల అధ్యక్షురాలు సావిత్రి, సర్పంచ్ చీదురు శంకర్ నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించి ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు కుసం రాంచందర్, మాజీ ఏఎంసీ డైరెక్టర్ పిన్నింటి సునీల్ రావు, ఉప సర్పంచ్ అనిత రమేష్ వార్డు సభ్యులు రంగు వెంకన్న, చిన్నపెల్లి ఎల్లయ్య, బొట్ల వెంకన్న, తీగల రేణుక శ్రీను, మైనారిటి నాయకురాలు సుల్తాన, నాయకులు వర్ధినేని సతీష్ రావు, పోకల శంకర్, అజయ్ రావు, నీరటి వెంకన్న, వర్ధినేని పాపరావు, చిదురు తిరుపతి, దరస్వామి, నిరంజన్, వెంకన్న, కుమారస్వామి, కనుకరాజు, వెంకన్న. భాస్కర్ పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ రాజ్యాంగ హక్కులు, బాధ్యతలను తెలుసుకోవాలి

- **వరంగల్ పోలీస్ కమిషనర్ ఎస్.శ్వేత**




**హనుమకొండ, ఆగస్టు 11(మనం ప్రతినిధి ):** రాజ్యాంగం కల్పించిన హక్కులతో పాటు పౌరులుగా మన బాధ్యతలను కూడా ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎస్. శ్వేత అన్నారు. మంగళవారం హనుమకొండ లోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (ఇఆఇ)వరంగల్ ఫీల్ కార్యాలయం ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా' పై రెండు రోజుల ఇంటిగ్రేటెడ్ కమ్యూనికేషన్ అండ్ ఔట్రీచ్ ప్రోగ్రాం (ఐఇ్క), ఫోటో ఎక్సిబిషన్ ను పోలీస్ కమిషనర్, జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఫోటో ఎగ్జిబిషన్ను ప్రారంభించిన అనంతరం వరంగల్ ఫీల్ పబ్లిసిటీ ఆఫీసర్ తరుణ్ కుమార్ బోడా సీబీసీ రూపొందించిన జాతీయ పతాకం యొక్క ప్రస్థానం, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల పై ఫోటో ఎగ్జిబిషన్లోని అంశాలను వివరించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి పోలీస్ కమిషనర్ ప్రసంగిస్తూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, స్వేచ్ఛ, ప్రజా స్వామ్యం, రాజ్యాంగ విలువలను కాపాడటంతో పాటు దేశ అభివృద్ధిలో యువత క్రియాశీలకంగా భాగస్వాములు కావాలని సూచించారు. మన రాజ్యాంగంలో రాసుకున్న హక్కులు, బాధ్యతలు ఏవైతే ఉన్నాయో పౌరులుగా మన బాధ్యత ఏంటి అనేవి ఇలాంటి కార్యక్రమాలు మనకి గుర్తు చేస్తాయన్నారు. ఎప్పుడూ మనం హక్కుల కోసం పోరాడడం అనేది ఒక నాణేనికి ఒక వైపు మాత్రమే. ఇంకోవైపు మన బాధ్యత ఏముంది అనేది తప్పనిసరిగా తెలుసుకోవాలన్నారు. మనకి దక్కిన స్వాతంత్ర్యానికి మనం గౌరవం, విలువ ఇస్తూ, భవిష్యత్తు తరాలకి ఎటువంటి సమాజాన్ని అందిస్తామో అనేది మనపైనే ఆధార పడి ఉంటుంద న్నారు. దేశాభివృద్ధి, భవిష్యత్తు యువతపైనే ఆధారపడి ఉందన్నారు. మిమ్మల్ని మీరు ఎలా మలుచుకుంటారు అనేది మీ చేతుల్లోనే ఉంటుందని యువతను ఉద్దేశించి అన్నారు. మీ జీవితాలు మీరు ఎలా మలుచుకుంటారు అనేది వందకి వంద శాతం మీ చేతుల్లోనే ఉంటుందని, కష్టపడి మన జీవితాన్ని మనమే మెరుగు పరచుకోవాలని పేర్కొన్నారు.

# నేడు నగరంలో శ్రీరామ హృదయం శోభాయాత్ర

**హనుమకొండ, ఆగస్టు 11 (మనం ప్రతినిధి):** పరమహంస పరివ్రాజక ఆచార్యులు త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్స్వామి 70వ జ (సప్తతి) వేడుకల సందర్భంగా తలపెట్టిన శ్రీరామ హృదయం కలశల శోభాయాత్ర బుధవారం నగరంలో నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా వికాస గిణి చైర్పర్సన్ డాక్టర్ బచ్చు రాధాకృష్ణ తెలిపారు. గత నెల 20వ తేదీన గురు పౌర్ణమి వేళ ఉమ్మడి జిల్లాలోని అన్ని గ్రామీణ ప్రాంతాలకు తరలివెళ్లి శ్రీరామ హృదయం కలశాలను ఆయా కమిటీ నిర్వాహకులు, భక్తులు నగరానికి తరలివచ్చి ఈ శోభాయాత్రలో పాల్గొంటారని చెప్పారు. బుధవారంతో ఉమ్మడి జిల్లాలో పరిసమాప్తం అయ్యే శ్రీరామ హృదయం ముగింపు సందర్భంగా నక్కలగుట్టలోని వికాస తరంగిణి కార్యాలయం నుంచి టీటీడీ కలా ఒడపం వరకు బుధవారం సాయంత్రం కలశాలు, భజన సంఘాలు, కోలాట బృందాలతో శోభాయాత్ర నిర్వహింపజేస్తున్నట్లు డాక్టర్ బచ్చు రాధాకృష్ణ పారు.

# సీఎం సభకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి



- **కలెక్టర్ చాహత్ బాజ్‌పేయ్**
- **వరంగల్ సిపి శ్వేతతో కలిసి ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్**

**పరకాల, ఆగస్టు 11: (మనం న్యూస్ ):** పరకాలలో ఈ నెల 16న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పాల్గొనే సభకు పటిష్టమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయి వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం పరకాలలో సీఎం పర్యటన నేపథ్యంలో ప్రతిపాదిత హెలిప్యాడ్, సభా వేదిక, వాహనాల పార్కింగ్, రాకపోకల మార్గాలు, భద్రతా ఏర్పాట్లను వరంగల్ పోలీస్ కమిషనర్ ఎస్. శ్వేతతో కలిసి కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వద్ద సీఎం ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ప్రతిపాదిత హెలిప్యాడ్ కోసం లలితా కన్వెన్షన్ హాల్ సమీపంలోని స్థలాన్ని, సభా వేదిక, వాహనాల పార్కింగ్ కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అంగడి స్థలాలను పరిశీలించారు. సభకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున వాహనాల రాకపోకలు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణకు ముందస్తు ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చాహత్ బాజ్పాయి మాట్లాడుతూ, సీఎం పర్యటనలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ అంకిత్ కుమార్, అదనపు కలెక్టర్ రవి, డీఆర్డీవో మేన శ్రీను, స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, ఆర్అండ్బీ ఎస్ఈ సురేష్ బాబు, ఈఈ దేవిక, టీడబ్ల్యూఐడీసీ ఈఈ అరుణ్ కుమార్, డీఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య, పరకాల మున్సిపల్ చైర్మన్ సునీల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ పవన్, ఏసీపీ సతీష్ బాబు, పరకాల సీఐ క్రాంతి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# మెగా టెక్స్‌టైల్స్ పార్క్ పురోగతిపై కేంద్రాన్ని ప్రశ్నించిన ఎంపీ



**హనుమకొండ ఆగష్టు 11(మనం ప్రతినిధి ):** వరంగల్లో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీఎం మిత్ర మెగా టెక్స్టైల్స్ పార్క్ అమలు పురోగతిపై వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య లోక్సభలో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పార్క్లో భూసేకరణ, మౌలిక వసతుల కల్పన, పెట్టుబడుల ఆకర్షణ, ఉత్పత్తి ప్రారంభం, ఉద్యోగాల కల్పనపై వివరాలు వెల్లడించాలని ఎంపీ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యంగా స్థానిక యువత, మహిళలు, ఎస్సీలు, ఇతర వెనుకబడిన వర్గాలకు ఎన్ని ఉపాధి అవకాశాలు లభిస్తాయో స్పష్టత ఇవ్వాలని ప్రశ్నించారు. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర జౌళి శాఖ సహాయ మంత్రి పబిత్ర మార్గెరిటా లోక్సభలో దేశవ్యాప్తంగా ఏడు పీఎం మిత్ర పార్కులను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అందులో తెలంగాణలోని వరంగల్ను ఒక ప్రాంతంగా ఎంపిక చేసినట్లు వెల్లడించారు. వరంగల్ పార్క్ను బ్రౌన్ఫీల్ కేటగిరీలో అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. కేంద్రం సమాధానంపై ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ.. వరంగల్ పీఎం మిత్ర పార్క్ కేవలం ఒక పారిశ్రామిక ప్రాజెక్టు కాకుండా తెలంగాణలోనే అతిపెద్ద ఉపాధి, పెట్టుబడుల కేంద్రంగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. అయితే భవిష్యత్తులో ప్రకటించిన లక్ష్యాలకు అనుగుణంగా పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాల కల్పన వేగంగా పెరగాలని అన్నారు. వరంగల్లోని యువతకు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే నాణ్యమైన ఉద్యోగాలు, నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించడమే తన ప్రధాన లక్ష్యమని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు, ఎస్సీలు, ఎస్టీలు, బలహీన వర్గాలకు పార్క్లో తగిన ప్రాధాన్యత కల్పించేలా కేంద్రం ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. వరంగల్ను జౌళి రంగానికి జాతీయ స్థాయి హబ్గా తీర్చిదిద్దేందుకు తాను నిరంతరం కృషి చేస్తానని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు. వరంగల్ ప్రజలకు మరిన్ని పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాలు తీసుకురావడానికి తన ప్రయత్నాలు నిరంతరం కొనసాగుతాయని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య తెలిపారు.

# సమస్యల సాధనకు సీపీఎం పోరాటాలు

- **పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.చుక్కయ్య**

**కాజీపేట, ఆగస్టు 11 (మనం న్యూస్):** కాజీపేట మండలంలోని సమస్యలను పరిష్కరించే వరకు ప్రభుత్వంపై పోరాటాలకు సీపీఎం సిద్ధమవుతు ందని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.చుక్కయ్య అన్నారు. మంగళవారం కాజీపేటలోని పార్టీ కార్యాలయంలో మండల కమిటీ సమావేశం కారు ఉపేందర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా చుక్కయ మాట్లాడుతూ కాజీపేట మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న రోజువారి సమస్యలతో పాటు దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ముఖ్యంగా రాంపూర్లోని చెత్త డంపింగ్ యార్డును జనావాసాలకు దూరంగా వెంటనే తరలించాలని, కాజీపేట మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కాజీపేట బస్టాండ్ నిర్మాణం వెం టనే పూర్తి చేయాలని, కాజీపేట, దర్గాలోని ఫ్లైఓవర్ బ్రిడ్జిలను వెంటనే పూర్తిచేయాలని, కాజీపేట రైల్వేను డివిజన్గా ఏరాటు చేయడంతోపాటు రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో భూ నిర్వాసితులకు, స్థానిక నిరుద్యోగులకు, అప్రెంటిస్ చేసిన యువకులకు ఉద్యోగాలు కల్పించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి ఓరుగంటి సాంబయ్య, జంపాల రమేష్, సంటి రవి తదితరులు పాల్గొన్నారు.

# మిరప నారు మడుల్లో వేరుకుళ్లు తెగులు..



**కన్నాయిగూడెం, ఆగస్టు 11, మనం న్యూస్:** కన్నాయిగూడెం మండలంలోని తుపాకులగూడెం, లక్ష్మీపురం గ్రామాల పరిధిలో సాగు చేస్తున్న మిరప నారు మడులను వ్యవసాయ శాఖ అధికారి ముంజ మహేష్ (ఎం.ఎస్సీ. అగ్రికల్చర్) పరిశీలించారు. ఈ సందర్భంగా నారు మడుల్లో మిరప మొక్కల పెరుగుదల, నాణ్యత, ఆరోగ్య పరిస్థితులను పరిశీలించా.రు. ట్రైకోడెర్మా విరిడి జీవ శిలీంద్రనాశినిని సేంద్రియ ఎరువుతో కలిపి నారు మడుల్లో చల్లుకోవాలని తెలిపారు. లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 2 గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి, నారు మడి పూర్తిగా తడిచేలా పిచికారీ చేయాలని సూచించారు.మిరప పంటలో సమగ్ర పురుగు, తెగుళ్ల యాజమాన్యంతో పాటు సమతుల్య ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యం, నాణ్యమైన నారు పెంపకం వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.రైతులు నారు మడులను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ, తెగుళ్ల లక్షణాలు కనిపించిన వెంటనే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి, సూచించిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారి ముంజ మహేష్ సూచించారు. కార్యక్రమంలో స్థానిక రైతులు పాల్గొన్నారు.

# పప్పు దినుసు పంటలను రైతులు సాగు చేసేలా ప్రోత్సహించాలి

- **హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**



**హనుమకొండ: ఆగష్టు 11.(మనం ప్రతినిధి ):** ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటలలో భాగంగా పప్పు దినుసుల పంటలను అధిక విస్తీర్ణంలో సాగు చేసే విధంగా రైతులను ప్రోత్సహించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో ని కాన్ఫరెన్స్ హాలులో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆత్మ నిర్భరత ఇన్ పల్సెస్ ( పప్పు దినుసుల సాగులో స్వయం సమృద్ధి సాధించడం)పై వ్యవసాయ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లాలోని ఆయా మండలాల్లో ప్రత్యామ్నాయ పంటల సాగు గురించిన వివరాలను మండల వ్యవసాయ అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రైతు బీమా క్లెయిమ్ ల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ ఎరువుల దుకాణాలలో ఎరువులు విత్తనాల నాణ్యత ప్రమాణాలను పాటించే విధంగా విస్తృత తనిఖీలు నిర్వహించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. రైతు బీమా క్లెయిమ్ లను త్వరితగతిన చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. రైతు నమోదు( ఫార్మర్ రిజిస్ట్రీ) అందరూ రైతులు నమోదు చేసుకునే విధంగా విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 87.8 శాతం నమోదు పూర్తయిందని, మిగతా నమోదును త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర, సహాయ సంచాలకులు ఆదిరెడ్డి, అవినాష్ వర్మ, సాంకేతిక వ్యవసాయ అధికారి కమలాకర్, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

- **కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్**



**ములుగు, ఆగస్టు 11, మనం ప్రతినిధి:** ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ఈ నెల 16న ములుగు జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ పిలుపునిచ్చారు. మంగళవారం గోవిందరావుపేట మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ సీఎం పర్యటనకు ప్రతి గ్రామం నుంచి నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో తరలివచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పర్యటన ఏర్పాట్లను నాయకులు సమన్వయంతో చేపట్టాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతోందన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. సీఎం పర్యటనను విజయవంతం చేయడం ద్వారా ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఐక్యత, బలాన్ని చాటాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్మికశాఖ అధ్యక్షుడు కొంపెల్లి శ్రీనివాస్రెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు మద్దాలి నాగమణి, జిల్లా అధికార ప్రతినిధి జెట్టి సోమయ్యతో పాటు రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# టీమ్‌లోకి రమ్మంటే.. వద్దంటానా?: భువనేశ్వర్

టీమ్ఇండియాలో ఒకప్పుడు కీలక బౌలర్ గా ఉన్న భువనేశ్వర్ జట్టుకు దూరమై చాలా కాలమే అయింది. చివరగా 2022లో అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు. కానీ గత కొన్ని వారాలుగా అతడి గురించి ఆసక్తికర చర్చ సాగుతోంది. 2027 వన్డే ప్రపంచకప్ కోసం అతణ్ని తిరిగి భారత జట్టులోకి తీసుకోవాలని చాలా మంది క్రికెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. భువి 2026 ఐపీఎల్ లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరపున విశేషంగా రాణించడం, భారత పేసర్లు గాయాల బారిన పడుతుండడం అందరి దృష్టి అతడివైపు మళ్లడానికి ప్రధాన కారణాలు. తనపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో భువనేశ్వర్ స్పందించాడు. సెలక్టర్ల నుంచి పిలుపు అందితే టీమ్ఇండియాతో చేరడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పాడు. ''సెలక్టర్ల నుంచి పిలుపు అందితే నేనెందుకు కాదంటా. టీమ్ఇండియాకు ఆడేందుకు నేను పూర్తి సిద్ధంగా ఉన్నా. నిజాయితీగా చెప్పాలంటే.. నేను ఎంత సిద్ధంగా ఉన్నానో చెప్పలేను. నా పని క్రికెట్ ఆడడం. అందుకే ఇప్పుడు యూపీ టీ20 లీగ్ లో ఆడడానికి వచ్చా. ఏదో స్థాయికి వెళ్లడానికి ఇక్కడికి రాలేదు. దేనికో ఎంపిక కావాలని లేదా ఎవరో ఏదో అన్నారని నేను యూపీ టీ20 లీగ్ లో ఆడేందుకు రాలేదు. నేను ఎంత సన్నద్ధంగా ఉన్నానన్నది చెప్పాల్సింది నేను కాదు. నిర్ణయం తీసుకోవాల్సింది సెలక్టర్లు'' అని భువనేశ్వర్ చెప్పాడు. 36 ఏళ్ల భువి.. ఈ నెల 14న మొదలయ్యే ఉత్తర్ ప్రదేశ్ టీ20 లీగ్ లో లఖ్‌నవూ ఫాల్కన్స్కు నాయకత్వం వహించనున్నాడు.

# విండీస్‌కు అఫ్ఘాన్ ఎఫెక్ట్.. వరల్డ్ కప్ డైరెక్ట్ క్వాలిఫికేషన్ కు దూరం



ఒకప్పుడు అద్భుతమైన విజయాలతో ప్రపంచ క్రికెట్ లో తిరుగులేని జట్టుగా వెలుగొందిన వెస్టిండీస్ ప్రభ కొన్నేళ్లుగా మసకబారుతోంది. గత వన్డే ప్రపంచ కప్ నకు నేరుగా అర్హత సాధించలేకపోయిన వెస్టిండీస్.. తర్వాత క్వాలిఫయర్స్ లోనూ పేలవ ప్రదర్శన చేసి టోర్నమెంట్ కు దూరమైంది. ఈ సారి కూడా విండీస్ అదే పరిస్థితిని ఎదుర్కొంటోంది. సోమవారం ఐర్లాండ్ తో జరిగిన మూడో వన్డే మ్యాచ్ లో అఫ్ఘానిస్థాన్ విజయం సాధించి ప్రపంచ కప్ నకు నేరుగా అర్హత సాధించింది. దీంతో విండీస్ ఆశలు ఆవిరయ్యాయి.

వన్డే ర్యాంకింగ్స్ ఆధారంగా నేరుగా టోర్నీకి అర్హత సాధించడానికి ఐసీసీ ఈ సెప్టెంబర్ 30 వరకు డెడ్ లైన్ విధించింది. టాప్-8లో నిలిచిన జట్లు నేరుగా వరల్ కప్ నకు క్వాలిఫై అవుతాయి. ఆతిథ్య దేశాలుగా ఉన్న సౌతాఫ్రికా, జింబాబ్వేతో కూడా ఆటోమేటిక్ అర్హత సాధిస్తాయి. ఐర్లాండ్ పై విజయంతో అఫ్ఘాన్ టాప్-8లోకి దూసుకొచ్చింది. భారత్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, పాకిస్థాన్, శ్రీలంక, ఇంగ్లాండ్, అఫ్ఘాన్, బంగ్లాదేశ్, జింబాబ్వే నేరుగా డైరెక్ట్ గా క్వాలిఫై అయ్యాయి. కటాఫ్ తేదీ నాటికి విండీస్ రెండు వన్డేలు మాత్రమే ఆడనుంది. ఆ రెండూ సెప్టెంబర్ లో భారత్ తోనే జరగనున్నాయి. ఆ రెండింటిలో గెలిచినా అఫ్ఘాన్ ను కరేబియన్ జట్టు వెనక్కినెట్టే అవకాశం లేదు.

వెస్టిండీస్ 2027 వరల్ కప్ లో ఆడాలంటే 10 జట్లతో జరిగే ప్రపంచ కప్ క్వాలిఫయర్స్ ఆడాల్సి ఉంటుంది. ఇందులో ఐర్లాండ్ తోపాటు క్రికెట్ వరల్ కప్ లీగ్-2లో అత్యుత్తమ ప్రదర్శన చేసిన జట్లు, క్వాలిఫయర్ ప్లే ఆఫ్స్ నుంచి వచ్చిన జట్లు పాల్గొంటాయి. ఈ టోర్నీలో విండీస్ విజేతగా నిలిస్తే నేరుగా వరల్ కప్ గ్రూప్ దశలో తలపడుతుంది. ఒకవేళ రెండు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిస్తే సూపర్ సిరీస్ లో తలపడాల్సి ఉంటుంది. అందులో అగ్రస్థానం దక్కించుకుంటే వరల్ కప్ లో చివరి బెర్తును ఖరారు చేసుకుంటుంది.

# ఢిల్లీ క్యాపిటల్స్ క్రికెటర్ అరెస్టు

ఢిల్లీ క్యాపిటల్స్ క్రికెటర్ అభిషేక్ పోరెల్ అరెస్టయ్యాడు. అత్యాచార ఆరోపణల కేసులో పోలీసులు అతడిని అరెస్టు చేశారు. బెంగాల్ కు చెందిన అభిషేక్ పోరెల్ 2023లో ఐపీఎల్ లో అడుగుపెట్టాడు. ఢిల్లీ క్యాపిటల్స్ కు ప్రాతినిధ్యం వహిస్తున్న 24 ఏళ్ల ఈ లెఫ్టాండర్ బ్యాటర్.. ఇప్పటికి 35 మ్యాచ్ లు ఆడి 769 పరుగులు చేశాడు.

**పెళ్లి చేసుకుంటానని నమ్మించి..**



క్యాపిటల్స్ కీలక ప్లేయర్లలో ఒకడిగా ఎదిగిన అభిషేక్ పోరెల్ పై జూన్ లో అత్యాచార ఆరోపణలతో కేసు నమోదైంది. గత మూడేళ్లుగా తనతో రిలేషన్ షిప్ లో ఉన్న పోరెల్.. ఏడాది కాలంగా తనను దూరం పెట్టాడని వైద్య విద్యార్థిని ఆరోపించింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి అన్ని రకాలుగా వాడుకున్నాడని ఫిర్యాదు చేసింది.

ఈ క్రమంలో తనపై అనేకమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడని.. తమ వ్యక్తిగత వీడియోలు రికార్డు చేసి ఇప్పుడు వాటిని చూపించి బెదిరిస్తున్నాడని బాధితురాలు తీవ్రమైన ఆరోపణలు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు బెంగాల్ పోలీసులు తెలిపారు.

**హైకోర్టు ఆదేశాలతో..**

ఈ క్రమంలో అభిషేక్ పోరెల్ మొబైల్ ఫోన్ తదితర ఎలక్ట్రానిక్ వస్తువులను వెంటనే సీజ్ చేయాలని కోల్ కతా హైకోర్టు ఆదేశించింది. అతడిని వెంటనే అరెస్టు చేయాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది.

ఈ నేపథ్యంలో డుమ్ డుమ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇమామి సిటీ పోలీసులు అభిషేక్ పోరెల్ను తాజాగా అరెస్టు చేసినట్లు సమాచారం. హూగ్లీ రూరల్ పోలీస్ ఎస్పీ కున్వార్ భూషణ్ సింగ్ ఈ విషయాన్ని ధ్రువీకరించారు.

కాగా అభిషేక్ పోరెల్ గతంలో భారత్-ఎ క్రికెట్ జట్టు తరపున యూకే, ఆస్ట్రేలియా గడ్డ మీద మ్యాచ్లు ఆడాడు. ఇదిలా ఉంటే.. తనపై వచ్చిన ఆరోపణలు అవాస్తమని అభిషేక్ పోరెల్ కొట్టిపారేశాడు. కాగా బెంగాల్ తరఫున 2021-11 సీజన్ లో ఫస్ట్ క్లాస్ క్రికెట్ లో అరంగేట్రం చేసిన అభిషేక్ పోరెల్.. 32 మ్యాచ్లు ఆడాడు. ఇక లిస్ట్-ఎ క్రికెట్లో అతడు 23 మ్యాచ్ లలో భాగమయ్యాడు.

# వరుస హిట్లతో ఫుల్ ఫామ్‌లో వామికా గబ్బీ..

## ఏకంగా బిగ్గెస్ట్ పాన్ ఇండియా మూవీలో చాన్స్!



బాలీవుడ్ యంగ్ బ్యూటీ వామికా గబ్బీకి 2026 సంవత్సరం బాగా కలిసివస్తోందనడంలో అతిశయోక్తి లేదు. అక్షయ్ కుమార్ 'భూత్ బంగ్లా' లో నటించి విజయం సాధించి జోరు అందుకున్నఆమె, ఆ తర్వాత 'పతి పత్ని ఔర్ వో 2', తమిళ చిత్రం 'డీసి: ది బ్లడీ వాలెంటైన్'లలో నటనతో మంచి ప్రశంసలు అందుకుంది. ఇప్పుడు తన కెరీర్ లోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన భారీ ప్రాజెక్ట్ లో అవకాశం దక్కించుకుని వార్తల్లో నిలిచింది. ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో, కాంతార ఫేమ్ రిషబ్ శెట్టి హీరోగా నటిస్తున్నపాన్ ఇండియా మైథలాజికల్ మూవీ 'జై హనుమాన్'లో వామికా ఒక శక్తివంతమైన పాత్రకు ఎంపికైనట్లు సమాచారం.2024లో వచ్చిన బ్లాక్ బస్టర్ 'హనుమాన్' సినిమాకి సీక్వెల్ గా రాబోతుంది. ఈ సినిమాలో రిషబ్ శెట్టి లార్డ్ హనుమాన్ పాత్రలో కనిపించబోతుండటం విశేషం. కలియుగం బ్యాక్ డ్రాప్ లో హనుమంతుడి భక్తి, బలం నేపథ్యంలో అత్యున్నత యాక్షన్ ఎలిమెంట్స్ తో ఈ చిత్రాన్నినిర్మిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, టీ-సిరీస్ సంయుక్తంగా నిర్మిస్తున్నఈ చిత్రం 'ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్' లో భాగంగా వస్తున్నవిషయం తెలిసిందే. ప్రస్తుతం హైదరాబాద్ లోనే ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రంతో పాటు వామికా గబ్బీ చేతిలో రాజ్ కుమార్ రావుతో 'ప్రహార్', అడివి శేష్ తో 'గూఢచారి 2', సిద్ధాంత్ చతుర్వేదితో 'దిల్ కా దర్వాజా ఖోల్ నా డార్లింగ్' వంటి పలు క్రేజీ ప్రాజెక్ట్ లు లైన్ లో ఉన్నాయి.

# 'రంభ, ఊర్వశి, మేనక' ట్రైలర్ రిలీజ్..

అల్లరి నరేష్.. టాలీవుడ్ ఇండస్ట్రీలో ఓ మార్క్ హీరోగా ఎదిగాడు. కామెడీ కింగ్ గా ఎదిగిన అల్లరి నరేష్.. అప్పట్లో అందరిని కడుపుబ్బా నవ్వించేవాడు. ఈ మధ్యకాలంలో రూట్ మార్చిన నరేష్... సెంటిమెంట్ మూవీలతో కూడా అందరికీ కన్నీళ్లు తెప్పిస్తున్నాడు. ఇలా రెండు యాంగిల్స్ లో దూసుకు వెళ్తున్న అల్లరోడు... మళ్లీ జనాలను కడుపుబ్బా నవ్వించేందుకు సిద్ధమయ్యాడు. అల్లరి నరేష్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా సినిమా 'రంభ, ఊర్వశి, మేనక' . చంద్రమోహన్ చింతాడ దర్శకత్వంలో వస్తున్న ఈ



సినిమాలో ఏకంగా ముగ్గురు హీరోయిన్లు సందడి చేయనున్నారు.

వచ్చే నెలలో రిలీజ్ కాబోతున్న ఈ సినిమా టీజర్ ను తాజాగా రిలీజ్ చేసింది చిత్రం బృందం. ఇందులో అల్లరి నరేష్ చేసిన కామెడీ అందరినీ ఆకట్టుకుంది.

# జూ. ఎన్టీఆర్‌కు సర్జరీ



మరో టాలీవుడ్ స్టార్ హీరోకి గాయం కావడంతో సినీ ప్రియులు, అభిమానులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గ్లోబల్ స్టార్ జూనియర్ ఎన్టీఆర్ తీవ్ర భుజం నొప్పితో బాధపడుతుండటంతో, బుధవారం హైదరాబాద్ లోని కిమ్స్ ఆసుపత్రిలో ఆయన కుడి భుజానికి సర్జరీ జరగనుంది. గతకొన్ని రోజులుగా భుజం నొప్పితో బాధపడుతున్న ఎన్టీఆర్.. వైద్యుల సూచన మేరకు షూటింగ్ లకు విరామం ఇచ్చి విశ్రాంతి తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఆయన స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్ లో తెరకెక్కుతున్న 'డ్రాగన్' (వర్కింగ్ టైటిల్) చిత్రంలో నటిస్తున్నారు. ఈ సర్జరీ అనంతరం ఆయన కొద్దిరోజుల పాటు విశ్రాంతి తీసుకోనుండటంతో, తదుపరి షూటింగ్ షెడ్యూల్ కాస్త ఆలస్యమయ్యే అవకాశముంది.

# ఇండస్ట్రీలో ఎదగాలంటే సొంత ఇమేజ్ చాలా ముఖ్యం.. : రెజీనా



తెలుగు, తమిళ, హిందీ భాషల్లో నటిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న యంగ్ అండ్ టాలెంటెడ్ బ్యూటీ రెజీనా కాసాండ్రా. ఇటీవల 'మరీచిక' అనే క్రైమ్ మిస్టరీ థ్రిల్లర్తో ఆకట్టుకున్న ఈ భామ, త్వరలో 'సెక్షన్-108', చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న రెజీనా, తన కెరీర్ తొలిరోజుల్లో అనుభవించిన కొన్ని విచిత్రమైన, మరచిపోలేని సంఘటనలను పంచుకున్నారు. తన మొదటి తెలుగు చిత్రం 'శివ మనసులో శ్రుతి' (2012) సమయానికి నటన గురించి, ఇండస్ట్రీ రూల్స్ గురించి తనకు ఏమీ తెలియదని రెజీనా చెప్పారు. 'ఆ సమయంలో షూటింగ్ కోసం స్కూల్ కు వారాల తరబడి సెలవులు పెట్టాల్సి వచ్చేది. నా పాఠాలు మిస్ కాకుండా మా అమ్మ సెట్ లోనే కూర్చుని నా కోసం నోట్స్ రాసేది. ప్రొడక్షన్ ఫుడ్ కాకుండా బయటి నుంచి ఫుడ్ ఆర్డర్ చేసుకోవచ్చని మేకప్ ఆర్టిస్ట్ చెప్పినా పర్వాలేదని అవే తినేదాన్ని' అని గుర్తుచేసుకున్నారు. అలాగే ఒకసారి రేడియో మిర్చి ఇంటర్వ్యూకి వెళ్లినప్పుడు సాధారణ సల్వార్, జీన్స్ వేసుకుని, తల కూడా సరిగ్గా ఆరబెట్టుకోకుండా వెళ్లానని, అక్కడ ఫోటోలు తీసి వెబ్ సైట్ లో పెట్టేసరికి చాలా డల్లుగా కనిపించానని నవ్వుతూ చెప్పారు. ఆ తర్వాతే ఒక నటిగా సొంత టీమ్ ను, ఒక ప్రత్యేక ఇమేజ్ ను ఏర్పాటు చేసుకోవడం ఎంత ముఖ్యమో అర్థమైందని తెలిపారు. ఈ రోజుల్లో చూస్తున్న పర్సెప్షన్ ఇంజనీరింగ్ లాంటిది కాకపోయినా, మంచి పాత్రలు రావాలన్నా, కెరీర్లో ఎదగాలన్నా సమాజంలో మన గురించి ఒక మంచి ఇమేజ్ ఉండటం అవసరమని ఆ అనుభవాల ద్వారా తెలుసుకున్నానని రెజీనా వెల్లడించారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

# ఆర్జీవీ ఈజ్ బ్యాక్.. ముంబై మాఫియాపై భారీ చిత్రం ప్రకటన

సంచలన దర్శకుడు రామ్ గోపాల్ వర్మ (ఆర్జీవీ) మళ్లీ తన మార్క్ సబ్జెక్ట్ తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. తనకు ఎంతో ఇష్టమైన ముంబై అండర్ వరల్ గ్యాంగ్స్టర్ల నేపథ్యంలో 'పోలీస్ కంపెనీ' పేరుతో ఓ కొత్త చిత్రాన్ని ప్రకటించారు. ప్రముఖ నిర్మాణ సంస్థ 'టీ-సిరీస్' నిర్మిస్తున్న ఈ సినిమాలో టాలెంటెడ్ యాక్టర్ హర్షవర్ధన్ రాణే ప్రధాన పాత్రలో నటించనున్నారు. 1990ల చివర్లో, 2000వ దశకం ప్రారంభంలో ముంబైలో పెరిగిపోతున్న గ్యాంగ్ వార్లను అరికట్టడానికి అప్పటి ప్రభుత్వం ఒక ప్రత్యేక పోలీస్ స్క్వాడ్ ను ఏర్పాటు చేసింది. ఆ స్క్వాడ్ స్ఫూర్తితోనే ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు ఆర్జీవీ వెల్లడించారు. ఈ స్క్వాడ్లోని కీలక సభ్యుడైన ప్రముఖ ఎన్ కౌంటర్ స్పెషలిస్ట్, పోలీస్ ఆఫీసర్ 'దయా నాయక్' పాత్రలో హర్షవర్ధన్ రాణే కనిపించనున్నారు. 'డీ-కంపెనీ కంటే ఇది చాలా ప్రమాదకరమైనది' అనే ట్యాగ్ లైన్ తో ఈ చిత్రం రాబోతోంది. హర్షవర్ధన్ రాణే లుక్ ను కూడా రామ్ గోపాల్ వర్మ సోషల్ మీడియాలో పంచుకున్నారు.

ఈ సినిమా కథ నేపథ్యం గురించి వర్మ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా వివరించారు. 'తన ప్రత్యర్థి గ్యాంగ్ వార్ లను దారుణంగా అంతం చేసిన తర్వాత దావూద్ ఇబ్రహీం.. తన గ్యాంగ్ను ఒక 'కంపెనీ'గా మార్చాడు. కార్యకలాపాల బాధ్యతలను తన అనుచరుడు ఛోటా రాజన్ కు అప్పగించి దుబాయ్ వెళ్లిపోయాడు. ఆ తర్వాత జరిగిన కొన్ని సంఘటనల వల్ల దావూద్, రాజన్ ల మధ్య విభేదాలు వచ్చాయి. దీంతో ముంబై అండర్ వరల్ లో ఆధిపత్య పోరు మొదలైంది' అని వర్మ పేర్కొన్నారు. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని ఆధిపత్యం కోసం అనేక ఇతర గ్యాంగ్ లు రంగంలోకి దిగాయని, యూపీ, మధ్యప్రదేశ్, బిహార్ వంటి ప్రాంతాల నుంచి యువకులు అండర్ వరల్ కంపెనీల్లో చేరారని తెలిపారు. ఆ ఉద్రిక్త పరిస్థితుల్లో అప్పటి ప్రభుత్వం ఒక స్పెషల్ స్క్వాడ్ ను ఏర్పాటు చేసిందని, 1997 నుంచి 2004 మధ్య కాలంలో ఈ స్క్వాడ్ దాదాపు 300 మందికి పైగా గ్యాంగ్ స్టర్లను హతమార్చిందని ఆయన వివరించారు. ఒకప్పుడు క్రైమ్, మాఫియా సినిమాలతో ట్రెండ్ సెట్ చేసిన ఆర్జీవీ.. మళ్లీ తనకిష్టమైన కథతో రావడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ చిత్రంలోని మిగతా నటీనటుల వివరాలను మేకర్స్ త్వరలోనే ప్రకటించనున్నారు. కాగా, ఆర్జీవీ ప్రస్తుతం 'పోలీస్ స్టేషన్ లో భూత్' అనే మరో హారర్-కామెడీ చిత్రాన్ని కూడా తెరకెక్కిస్తున్నారు.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.